
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం — భూపాలపల్లిలో అమానవీయ సంఘటన 03

'సర్' ప్రక్రియకు అడ్డంకులు రానివ్వం — అవసరమైతే ఆదేశాలు జారీ చేస్తాం: సుప్రీం 05



సంపుటి 09, సంచిక: 73 | మంగళవారం | 10-02-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# రాహుల్‌గాంధీని మాట్లాడనీయాల్సిందే



## లోక్‌సభలో పట్టుబట్టిన కాంగ్రెస్ ఎంపీలు

- అధికార, విపక్ష సభ్యుల మధ్య ప్రతిష్టంభన
- సభ మంగళవారానికి వాయిదా

**న్యూఢిల్లీ :** కేంద్ర బడ్జెట్‌పై చర్చ ప్రారంభం కావడానికి ముందు తాను మాట్లాడేందుకు అనుమతించాలని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. దీంతో ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్టంభన నెలకొంది. ఈ నేపథ్యంలో స్పీకర్ సభను మంగళవారానికి వాయిదా వేశారు. సోమవారం ఉదయం సభ రెండుసార్లు వాయిదా పడి న తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి సమావేశమైంది. అధ్యక్ష స్థానంలో ఉన్న సంధ్యా రాయ్, బడ్జెట్‌పై చర్చను ప్రారంభించాల్సిందిగా కాంగ్రెస్ సభ్యుడు శశి థరూర్‌ను కోరారు. తాను ప్రసంగం ప్రారంభించడానికి ముందు కొన్ని అంశాలను లేవనెత్తడానికి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న రాహుల్‌గాంధీని అనుమతించాలని థరూర్ అధ్యక్ష స్థానంలో ఉన్నవారికి తెలిపారు. బడ్జెట్‌పై రాహుల్‌గాంధీ మాట్లాడాలనుకుంటే తనకు ఎలాంటి అభ్యంత రం లేదని రాయ్ చెప్పి, ఆయనను మాట్లాడమని కోరారు. స్పీకర్ ఓం బిర్లా, కొంత మంది ప్రతిపక్ష ఎంపిల మధ్య జరిగిన సమావేశంలో బడ్జెట్ చర్చకు ముందు తాను కొన్ని అంశాలను లేవనెత్తడానికి అనుమతిస్తారని ఒక ఒప్పందం కుదిరిందని, అయితే ఇప్పుడు స్పీకర్ తన మాటను నిలబెట్టుకోవడం లేదని రాహుల్ పేర్కొన్నారు. అలాంటి ఒప్పందం గురించి తనకు తెలియదని, ముంద స్తు నోటీసు లేకుండా ఎవరినీ ఏ విషయంపైనా మాట్లాడటానికి అనుమతించలేనని రాయ్ అన్నారు. ఈ సమయం లో, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు జోక్యం చేసుకుని, అలాంటి ఒప్పందం ఏదీ జరగలేదని, ప్రతిపక్ష నాయకుడు స్పీకర్ గురించి ఏదైనా చెప్పాలనుకుంటే, దానికి సమాధానం ఇవ్వడానికి బిర్లా కూడా సభ లో ఉండాలని అన్నారు. ఈ విషయంపై సభలోని ఇతర సభ్యులు కూడా మాట్లాడతారని, దీనిపై విస్తృత చర్చ జరుగుతుందని రిజిజు అన్నారు. ఇరుపక్షాలు తమ తమ వైఖరి నుంచి వెనక్కి తగ్గకపోవడంతో రాయ్ సభను మంగళవారానికి వాయిదా వేశారు. అంతకుముందు లోక్‌సభ కార్యకలాపాలు రెండుసార్లు వాయిదా పడ్డాయి ఒకసారి ఉదయం 11 గంటలకు రోజువారీ కార్యకలాపాలు ప్రారంభమైనప్పుడు, కొన్ని నిమిషాల చర్చ తర్వాత. ల్లీ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడ్డాయి. ఉదయం 11 గంటలకు,

తరువాయి 2లో

## ఓమ్ బిర్లాపై అవిశ్వాస తీర్మానం?



రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నాయకులను సభలో మాట్లాడకుండా అడ్డుకున్నందుకు, అలాగే ఎనిమిది మంది ఎంపిలను సస్పెండ్ చేసినందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ప్రతిపక్షం యోచిస్తోంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 94సి కింద ఈ తీర్మానానికి నోటీసు ఇచ్చే అవకాశం ఉందని, ఇప్పటికే 100 మందికి పైగా ప్రతిపక్ష ఎంపిలు దానిపై సంతకాలు చేశారని వర్గాలు తెలిపాయి. అయితే, టిఎంసి ఎస్ఐఆర్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ రిపోర్ట్) సమస్యను మరింత తీవ్రంగా లేవనెత్తాలని చూస్తుండగా, సమాజ్‌వాదీ పార్టీ మాల్వా రాణి అహల్యాబాయి హోల్కర్‌కు జరిగిన అవమానాన్ని హైలైట్ చేయాలని కోరుకుంటోంది. ధన్యవాద తీర్మానంపై ప్రతిపక్ష నాయకుడిని సభలో మాట్లాడకుండా

తరువాయి 2లో



# మున్సిపల్ ఎన్నికలతో మోదీకేం సంబంధం?

## ఢిల్లీలో ఉండే ప్రధాని ఇక్కడి మున్సిపాలిటీల్లో మురికిని తీస్తారా?

- ఫామ్ హౌస్‌లో ఉన్న మాజీ సిఎం కెసిఆర్ కూడా మున్సిపాలిటీలకు నీళ్లు ఇవ్వడు
- ఇంకా మూడేళ్లు మేమే.. మరో ఐదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే
- మురికి కాలువల నుంచి ఇందిరమ్మ ఇళ్ల వరకు అన్ని పనులు చేయిస్తా'
- పురపోరులో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి మధ్య త్రిముఖ పోటీ
- అభివృద్ధిని బేరీజు వేసుకొని, భవిష్యత్తును ఆలోచించుకుని తీర్పు ఇవ్వండి
- ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు
- పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఇస్తామన్న మోదీ మాటలు నీటి మూటలయ్యాయని విమర్శ
- సమస్యలకు ప్రధాన కారణమైన కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌లు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని మండిపాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

'అసలు తెలంగాణ మున్సిపల్ ఎన్నికలకు, ప్రధాని మోదీకి ఏమి సంబంధం? ఢిల్లీలో ఉండే మోదీ వచ్చి ఇక్కడి మున్సిపాలిటీల్లో మురికిని తీస్తారా. ఫాస్ హౌజ్‌లోని మాజీ సిఎం కెసిఆర్ వచ్చి మున్సిపాలిటీలకు నీళ్లు ఇవ్వడు. ఇంకా మూడేళ్లు నేనే ఉంటా, ఆ తరువాత ఐదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది. ఇప్పుడు మున్సిపల్ శాఖ మంత్రిగా నేనే ఉన్నా. 'మున్సిపాలిటీల అభివృద్ధిని బాధ్యతను నేను తీ సుకుంటా. మున్సిపాలిటీలకు సమగ్ర ప్రణాళికలను రూపొందిస్తా. సంక్షేమ చర్యలను అమలు చేస్తా. మురికి కాలువల నుంచి ఇందిరమ్మ ఇళ్ల వరకు అన్ని పనులు చేయిస్తా' తెలంగాణ సమాజానికి ఏది మేలు చేస్తుందో ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోండి'' అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసిన నేపథ్యంలో సోమవారం సాయంత్రం సిఎం

తరువాయి 2లో

### దక్షిణాదికి తీవ్ర అన్యాయం

తెలంగాణకు లక్షల కోట్ల రూపాయలను ఇచ్చామని బిజెపి నేతలు చెబుతున్నారని, దీనిపై ప్రభుత్వ సిఎస్‌ను వివరణ అడిగితే తెలంగాణ రాష్ట్రం పన్నుల రూపంలో రూపాయి చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం 42 పైసలు ఇస్తోందని చెప్పారని సిఎం వెల్లడించారు. 'దక్షిణాది రాష్ట్రాలకు బిజెపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోంది. బిహార్ ఒక్క రూపాయి పన్ను చెల్లిస్తే రూ.6.16 కేంద్రం ఇస్తోంది. తెలంగాణకు అన్యాయం జరుగుతున్నప్పుడు ఏ రోజైనా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ మాట్లాడారా? మనకు అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదు. మనం చెల్లించిన నిధులు తిరిగిస్తే చాలు. కేంద్రానికి వచ్చే పన్నుల్లో దక్షిణాది రాష్ట్రాలే 40 శాతానికి పైగా చెల్లిస్తున్నాయి' అని సిఎం అన్నారు.



## ముమ్మాటికీ 'పచ్చి దోపిడీ'

- దేశంలో డిజిటల్ మోసాల ద్వారా రూ.54వేల కోట్లు కొల్లగొట్టడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
- బ్యాంకులు, టెలికాం శాఖలతో చర్చించి ఎస్ఒపి రూపొందించాలని కేంద్రానికి ఆదేశం

**న్యూఢిల్లీ :** దేశంలో డిజిటల్ మోసాల ద్వారా రూ.54వేల కోట్లకు పైగా సొమ్ము దోపిడీకి గురికావడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది ముమ్మాటికీ 'పచ్చి దోపిడీ, డెకాయిటీ' అని వ్యాఖ్యానించింది. ఇలాంటి కేసులను ఎదుర్కోవడానికి ఆర్‌బిఐ, బ్యాంకులు, టెలికాం శాఖలతో సంప్రదించి, ఒక పక్కా 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్' (ఎస్ఒపి) రూపొందించాలని

తరువాయి 12లో




# 'మున్సిపల్' ప్రచారం బంద్

## హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారానికి తెర

- రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి 48 గంటల సైలెంట్ పీరియడ్
- జోరందుకున్న నగదు, మద్యం, తాయిలాల పంపిణీ
- అప్రమత్తమైన ఎన్నికల యంత్రాంగం
- 11న పోలింగ్

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచార పర్వానికి తెరపడింది. సోమవారం సాయంత్రం 5 గంటలతో ప్రచారానికి ఫుల్ స్టాప్ పడగా, రాష్ట్రవ్యాప్తంగా 48 గంటల సైలెంట్ పీరియడ్ అమల్లోకి వచ్చింది. దీంతో మైకులు మూగబోయాయి. ర్యాలీలు, సభలు నిలిచిపోయాయి. ప్రచారం ముగియడంతో తాయిలాల పంపిణీ జోరందుకుంది. అయితే ఓటర్లను ప్రభావితం చేసే ఎలాంటి ప్రచారం జరగకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం కఠిన చర్యలు చేపట్టింది. ఈ నెల 11వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుండగా, 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 నగరపాలక సంస్థలు, 2,996 వార్డులకు పోలింగ్ జరగనుంది. ఎన్నికల ప్రచార పర్వం ముగియడంతో రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ఎన్నికల సంఘం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అన్ని రాజకీయ పార్టీల నేతలు, అగ్రనేతలు ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జోరుగా ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో అధికార, ప్రతిపక్ష నేతల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు, విమర్శలు, ప్రతి విమర్శలతో హోరెత్తించారు. అగ్రనేతలతో పాటు కేడర్ అంతా ఇంటి బాటపడుతోంది. ఆఖరి రోజు ప్రచారంలో పాల్గొన్న నేతలు ఓటర్లను ఆకట్టుకునేందుకు తుది ప్రయత్నాలు చేశారు. ఈ నెల 11వ తేదీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర

తరువాయి 2లో

### పార్టీల వారీగా చూస్తే..

| | |
|---|---|
| కాంగ్రెస్ | : 2,948 వార్డులు |
| బిఆర్ఎస్ | : 2,634 వార్డులు |
| సిపిఐ | : 168 వార్డులు |
| బిజెపి | : 2,634 వార్డులు |
| ఇండిపెండెంట్లు | : 2,786 మంది |
| ఆమ్ ఆద్మీ పార్టీ | : 38 వార్డులు |
| బిఎస్‌పి | : 213 వార్డులు |
| సిపిఐ(ఎం) | : 128 వార్డులు |
| ఎంఐఎం | : 282 వార్డులు |
| ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ | : 288 వార్డులు |
| జనసేన | : 332 |

### ఓటర్ల వివరాలు

ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

| | |
|---|---|
| మహిళా ఓటర్లు | : 26.80 లక్షలు |
| పురుష ఓటర్లు | : 25.62 లక్షలు |
| థర్డ్ జెండర్ ఓటర్లు | : 640 మంది |

మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.



# ఆత్మ గౌరవం నిలుపుకుందాం

- కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించుకుందాం
- ఎర్రజెండా ఎక్కడుందన్న వాళ్లు ఎందుకు హైరానా పడుతున్నారు ?
- ప్రచార కార్యక్రమాల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

ఇది అహంకారానికి ఆత్మీయకు మధ్య జరుగుతున్న పోటీ అని, ఈ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుని ఆత్మగౌరవాన్ని నిలుపుకుందామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా సోమవారం రామవరంలోని ఆరు డివిజన్లు, బర్మా క్యాంపు, ఫ్యూన్స్ బస్తీ, ఏపవర్ హౌస్ బస్తీ, గంగా బిషన్ బస్తీలో రోడ్ షోలు,కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఎర్రజెండాది ఏముందిలే, కమ్యూనిస్టుల అయిపోయింది అంటూ అవాకులు చెవాకులు పేలుతున్నవాళ్లు సిపిఐకి అందుతున్న ఆదరణను చూసి ఎందుకు హైరానా పడుతున్నారని అన్నారు. పాల్వంచ మొదలుకుని కొత్తగూడెం, సుజాతనగర్ వరకు ఉన్న కార్పొరేషన్ 60 డివిజన్లు ఎరుపు, పసుపు రంగుల జెండాలతో రెపరెపలాడుతున్నాయని చెప్పారు. కార్పొరేషన్ కాకుండా చాలా మంది కుట్రలు పన్నారని, కానీ వారి ప్రయత్నాలు పటాపంచలు చేస్తూ ప్రభుత్వంతో కొట్లాడి కార్పొరేషన్ ఏర్పాటు చేసుకున్నామని, తద్వారా ఈప్రాంతం

తరువాయి 2లో

## ఎలైట్ లిక్కర్ మార్ట్ లైసెన్స్...

# రూ.1.26 కోట్లు మోసం

### హైదరాబాద్‌లో వెలుగుచూసిన ఘటన



ప్రజాపక్షం/హైదరాబాద్

ఎలైట్ లిక్కర్ మార్ట్ లైసెన్స్ ఇప్పిస్తామని నమ్మించి ఓ వ్యక్తిని రూ.1.26 కోట్ల రూపాయల మేరకు మోసం చేసిన ఘటన హైదరాబాద్‌లో వెలుగుచూసింది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా మారం సురేష్ రెడ్డి, ఆయన భార్య మారం మమతతో పాటు వారి అనుచరులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా చంద్రుబట్లకు చెందిన మాధవ రెడ్డి కొండకిండి (60) ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. 2019లో

తరువాయి 12లో

# బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్‌మర్ వచ్చేవారం రాజీనామా?

## ఎప్‌స్టీన్ కేసు : లేబర్‌పార్టీ పరువు తీసిన మాండెల్సన్



**లండన్:** ప్రపంచ ప్రముఖులను అవినీతి–లైంగిక సంబంధాల రొచ్చులోకి లాగి జైలులో మరణించిన అమెరికా ఫైనాన్సియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ వివాదం బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్ స్టార్‌మర్ మెడకు చుట్టుకుంది. సొంత పార్టీ ఎంపీల నుండే ఆయనపై రాజీనామా ఒత్తిడి వస్తోంది. ఒపీనియన్ పోల్స్‌లో కూడా ఆయనకు ఆదరణ దక్కలేదు. చివరకు ఆయన రాజీనామా చేసే పరిస్థితులు వచ్చాయి. అన్నీ తెలిసే మాండెల్సన్‌ను అమెరికాలో బ్రిటన్ దౌత్యవేత్తగా నియమించారని, తప్పుచేసిన తర్వాత కూడా స్టార్‌మర్ ఎలా పదవిలో కొనసాగుతున్నరని పలువురు లేబర్‌పార్టీ ఎంపీలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని టాస్‌వార్తాసంస్థ వ్యాఖ్యానించింది. ఈ పరిస్థితుల్లో స్టార్‌మర్ వచ్చేవారం తన పదవికి రాజీనామా చేసే అవకాశాలు ఉన్నాయని బ్లూంబెర్గ్ నివేదిక వెల్లడించింది. స్టార్‌మర్ రాజీనామా చేసేవిధంగా ఆయనపై ఒత్తిడి తీసుకురావాలని లేదా బెదిరింపులన్నా చేయాలని టెన్‌డౌనింగ్ స్ట్రీట్‌లో పనిచేసే సిబ్బంది ప్రైవేటు సంభాషణల్లో గవర్నమెంట్ మెంబర్స్‌ను అభ్యర్థిస్తున్నారని బ్లూంబెర్గ్ పేర్కొంది. మంత్రివర్గంలో ఒకరి సలహాదారు చెప్పిన సమాచారం ప్రకారం స్టార్‌మర్ వచ్చేవారం రాజీనామా చేసేందుకు యాభై శాతం అవకాశాలు

తరువాయి 12లో

# సంక్లిష్టదశలో కార్మికవర్గం

- అందుకే సార్వత్రిక సమ్మె
- 12న సమ్మెపై కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక స్పష్టీకరణ




**న్యూఢిల్లీ:** దేశంలో కార్మికవర్గం నియంత్రణలకు, అణచివేతలకు గురువుతున్న సంక్లిష్ట తరుణంలో ఫిబ్రవరి 12వ తేదీన దేశంలో కర్షకులు, సామాన్య ప్రజాబాహుళ్యం మద్దతుతో కార్మికులు దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె చేపట్టారని కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర రంగాల సమాఖ్యలు,సంస్థల ఐక్య వేదిక స్పష్టం చేసింది. మరో 48 గంటల తర్వాత దేశంలో సార్వత్రిక సమ్మె ప్రారంభం కానున్న తరుణంలో ఐక్యవేదికలోని పది కార్మిక సంఘాల నాయకులు న్యూఢిల్లీ నుండి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, హెచ్ఎంఎస్, సిఐటియు, ఎఐయుటియుసి, టియుసిసి, ఎస్ఇడబ్ల్యుఎ, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసి నాయకులు ఈ సంయుక్త ప్రకటనపై సంతకాలు చేశారు. ఆర్థిక వ్యవస్థ ఆందోళన కలిగించేస్థాయిలో క్షీణించిపోతూ, దేశంలో నిరుద్యోగం భయంపుట్టించేస్థాయిలో పెరిగిపోయి, 65 లక్షల ఉద్యోగ ఖాళీలను ఇంకా భర్తీ చేయకుండా వాటిస్థానంలో పద వీ విరమణ చేసిన

తరువాయి 12లో

### సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు

కర్షక సంఘాల మద్దతుతో దేశంలో కార్మికులు నిర్వహించే ఫిబ్రవరి 12 తేదీ నాటికి సమ్మెకు భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) జాతీయ కార్యదర్శివర్గం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కార్మికులు, భూమిలేని కూలీలు, రైతులు నిర్వహిస్తున్న సమైక్య సమ్మెపట్ల పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. దేశంలో కార్మిక,రైతుకూలీ వ్యతిరేక వైఖరిని ప్రభుత్వం మానుకోవాలని, నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలని, కార్మికులు,కర్షకుల ప్రయోజనాలను

తరువాయి 12లో

## థాయ్‌లాండ్‌లో మళ్లీ అనుతిన్ కూటమి ప్రభుత్వం



**బ్యాంకాక్:** ఆగ్నేయ ఆసియా దేశం థాయ్‌లాండ్ ఎన్నికల్లో ప్రధానమంత్రి భూమిజైతయ్ పార్టీ నాయకుడు అనుతిన్ ఛర్న్‌విరాకుల్ (60) విజయం సాధించారు. తామే గెలిచామని, కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ఆయన సోమవారం ప్రకటించారు. 500 స్థానాలున్న దిగువసభకు ఆదివారం ఎన్నికలు జరిగాయి. 251 సీట్లు గెలుచుకున్న వారికే అధికారం దక్కుతుంది. 94 శాతం ఓట్ల లెక్కింపు పూర్తయ్యేనాటికి భూమి జైతై పార్టీ 194 సీట్లు, ప్రతిపక్ష పీపుల్స్‌పార్టీ 118 సీట్లు, ఫూ థాయ్ పార్టీ 74 సీట్లు గెలుచుకున్నాయి. దేశంలో రాజ్యాంగ సంస్కరణలు కొనసాగించడానికి కూడా కొత్త పార్లమెంటుకు అధికారాన్ని ఇస్తూ రిఫరెండంలో ప్రజలు అనుమతి ఇచ్చారు. ప్రతిపక్ష పీపుల్స్‌పార్టీ నాయకుడు నత్తాఫాంగ్ రుయెంగ్ పన్యావుట్ (39) ఓటమిని అంగీకరించారు. గత ఏడాది సెప్టెంబరులో పీపుల్స్‌పార్టీ నాయకుడు పన్యావుట్ ప్రధానమంత్రి అనుతిన్‌కు మద్దతు ఇచ్చేందుకు అంగీకరించారు. ఆ రెండు పార్టీలు అధికార,ప్రతిపక్షాలుగా కొనసాగుతాయి. కానీ ఫూ థాయ్ పార్టీ మాత్రం ఈ ఎన్నికల ఫలితాలను తిరస్కరించింది. ఇక కొత్త ప్రభుత్వంలో కీలకపదవులన్నీ ప్రధానమంత్రి అనుతిన్ తన చేతుల్లోనే కేంద్రీకరించుకునేందుకు సిద్ధం అవుతున్నారు. సైనిక పాలననాటి రాజ్యాంగాన్ని సంస్కరించేందుకు మార్పులు చేసేందుకు రెఫరెండంలో ప్రజలు పార్లమెంటుకు పూర్తి అధికారాలు కట్టబెట్టారు.

# జపాన్ ప్రధాని తకైచీ చరిత్రాత్మక విజయం

## ఇక అందరికళ్లూ బడ్జెట్ సవాలుపైనే



టోక్యో: ఎగ్జిట్ పోల్స్‌లో పేర్కొన్నవిధంగానే జపాన్‌లో కన్జర్వేటివ్‌లు విజయం సాధించారు. దిగువసభకు జరిగిన ఎన్నికల్లో లిబరల్ డెమోక్రటిక్‌పార్టీ (ఎల్‌డిపి) కూటమి విజయభేరీ మోగించింది. ప్రధానమంత్రి సనే తకైచీ (65) సారథ్యంలో ఎల్‌డిపి కూటమి 352 స్థానాలు దక్కించుకుని తిరుగులేని విజయం సాధించింది. ఒక్క లిబరల్ డెమోక్రటిక్‌పార్టీ మాత్రమే కావాల్సిన మెజారిటీకంటే ఎక్కువగా మొత్తం 316 స్థానాలు సొంతం చేసుకుంది. ఇప్పటివరకూ లిబరల్ పార్టీకి దిగువసభలో మెజారిటీకంటే తక్కువగా 198 స్థానాలు మాత్రమే ఉండేవి. ఎల్‌డిపి భాగస్వామి జపాన్ ఇన్నొవేషన్ పార్టీ (జెఐపి) 36 స్థానాలు గెలుచుకుంది. జెఐపికి ఇంతకుముందు దిగువసభలో 34స్థానాలు మాత్రమే ఉండేవి. జపాన్‌ను ఇప్పటివరకూ 66 మంది ప్రధానమంత్రులు పాలించారు. ఇప్పుడు తకైచీ రెండోసారి మహిళా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. డెమోక్రటిక్‌పార్టీ ఆఫ్ జపాన్ నుండి 2012లో షింజో అబే నాయకత్వంలో తిరిగి అధికారం తీసుకున్న తర్వాత ఎన్నికల్లో లిబరల్ డెమోక్రటిక్‌పార్టీ ఘన విజయం సాధించడం మళ్ళీ ఇదే. స్థిరంగా దీర్ఘకాలం దేశాన్ని పాలించాలంటే చెక్కుచెదరని మెజారిటీ ఉండాలని బలంగా విశ్వసించిన తకైచీ అనుకున్న ఫలితాలు సాధించారు. ఇంతమాత్రంచేత దేశం తిరిగి మితవాదులచేతుల్లోకి వెళ్ళినట్లు కాదని కొందరు విశ్లేషకులు వ్యాఖ్యానించారు.

ఇక ఇప్పుడు దేశం యావత్తూ బడ్జెట్ పైనే దృష్టి సారించనున్నది. దేశంలో ఆర్థిక సవాళ్ళను తకైచీ సమర్థవంతంగా ఎదుర్కోవలసి ఉంది. ఇన్వెస్టర్లు తకైచీ ప్రకటించే ఆర్థిక ప్యాకేజీల కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవలికాలంలో జపాన్‌లో ధరలు పెరుగుతున్నాయి. చైనాతో యుద్ధ భయం కూడా పెరిగింది. గతంకంటే భిన్నమైన పరిస్థితులమధ్య ప్రశాంత జీవనం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. అధికారం చేపట్టిన మూడు నెలల స్వల్ప వ్యవధిలోనే మళ్ళీ ఎన్నికలకు వెళ్ళాలని, దిగువసభలో ఎవ్వరిపైనా ఆధారపడకుండా అనుకున్న నిర్ణయాలను తిరుగులేకుండా అమలు చేసేందుకు మెజారిటీ సంపాదించాలని తకైచీ తీసుకున్న నిర్ణయం సరైనదేనని ప్రజలు నిర్ధారించారు. జపాన్‌లో ఎల్‌డిపి–జపాన్ ఇన్నొవేషన్‌పార్టీలు కలిసి కూటమి ప్రభుత్వం నడుపుతున్నాయి. దిగువసభలో 233 స్థానాలు ఉంటే పాలనకు మెజారిటీ సంపాదించినట్లే. కానీ ఈ రెండుపార్టీలూ కలిసి అంతకంటే 132 స్థానాలు ఎక్కువ సంపాదించుకున్నాయి. దేశంలో 30 ఏళ్ళు లోపు వయసుగల 90 శాతం యువకులు తకైచీ పాలనకు మద్దతు తెలియజేశారని ఎన్నికలకు ముందు వెల్లడైన సర్వేను ఈ ఫలితాలు మరోసారి నిర్ధారించాయి.

### నరేంద్రమోదీ అభినందన

జపాన్ ప్రధానమంత్రి సనే తకైచీకి భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందనలు తెలియజేశారు. 'దిగువసభకు జరిగిన ఎన్నికల్లో చరిత్రాత్మకమైన ఘన విజయం సాధించినందుకు మీకు అభినందనలు' అని మోదీ ఎక్స్ వేదికగా సందేశం పంపించారు. భారత్–జపాన్ మధ్య ప్రత్యేకమైన, వ్యూహాత్మక–ప్రపంచవ్యాప్త భాగస్వామ్యం ఉందని, ప్రపంచ శాంతి, స్థిరత్వం, ప్రగతి సాధించడంలో ఇరు దేశాలభాగస్వామ్యం కీలకపాత్ర వహిస్తోందని పేర్కొన్నారు. 'మీ సమర్థవంతమైన నాయకత్వంలో భారత్–జపాన్ రెండు దేశాల మైత్రి ఉన్నతస్థాయిల్లోకి చేరుకుంటుందని మాకు ఎంతో విశ్వాసం ఉంది' అని పేర్కొన్నారు.

## ముగింపు దశలో బంగ్లాదేశ్ ఎన్నికల ప్రచారం

### అధికారవర్గానికి యూనస్ కృతజ్ఞతలు



**ఢాకా:** బంగ్లాదేశ్‌లో ప్రతిష్ఠాత్మకమైన సార్వత్రిక ఎన్నికలకు ప్రచార పర్వం ముగింపుదశలో ఉంది. ఒకవైపు బిఎన్‌పి (బంగ్లాదేశ్ నేషలిస్ట్‌పార్టీ), మరోవైపు జమాతే ఇస్లామ్, ఇతర కొత్తపార్టీలు అధికారంకోసం ఉవ్విళ్ళూరుతున్నాయి. ఈనెల 12వ తేదీన ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. బంగ్లాదేశ్‌లో 2024లో హసీనా ప్రభుత్వంపై తిరుగుబాటు, విద్యార్థుల హింసాత్మక ఉద్యమం తర్వాత మహ్మద్ యూనుస్ నాయకత్వాన తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వ హయాంలో బంగ్లాదేశ్‌లో అతి స్వల్పకాలంలో అనూహ్యమైన మార్పులు సంభవించాయి. మతవాదం వేళ్ళూనుకుంది. మైనారిటీలు రక్షణలు కోల్పోయారు. వారంతా హత్యలకు గురవుతున్నారు. ఆర్థిక పరిస్థితి తలక్రిందులైంది. కొత్త ప్రభుత్వంలో ఎవరు అధికారం చేపట్టినప్పటికీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం, ప్రాధాన్యతలు నిర్దేశించడం, కేటాయింపులు చేయడం, అన్ని వర్గాలను సంతృప్తి పరచడం అతిపెద్ద సవాలుగామారుతుంది. మరోవైపు జమాతే ఇస్లామీ మాత్రం ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తామూ కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా చేరతామని ప్రకటనలు గుప్పిస్తోంది. ఈ ప్రతిపాదనకకు బిఎన్‌పి తిరస్కరించింది.

ఇదిలా ఉండగా దేశంలో ఎన్నికల తర్వాత తాత్కాలిక ప్రభుత్వం రాజీనామా చేసి కొత్త ప్రభుత్వాన్ని ఆహ్వానించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో యూనస్ అధికారానికి కొద్ది రోజులే సమయం మిగిలి ఉండటంతో అధికారవర్గాలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అధికారులు కూడా ఆయనకు వీడ్కోలు పలికేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇన్నాళ్ళుగా తమ ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందించినందుకు బ్యూరోక్రాట్లకు, అన్ని వర్గాల కార్యదర్శులకు, మంత్రులకు మహ్మద్ యూనుస్ కృతజ్ఞతలు చెప్పారు. సోమవారం ఉదయం ఒక గంటసేపు ఆయన కార్యదర్శులు,మంత్రులతో సమావేశం నిర్వహించి ఈ కృతజ్ఞతల ప్రక్రియ పూర్తిచేశారు. దాదాపు 70మంది ఉన్నతస్థాయీ కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

### రాజకీయాలకు దూరంగా ఆర్మీ: బిఎన్‌పి

బంగ్లాదేశ్ నేషనలిస్ట్‌పార్టీ అధికారంలోకి వస్తే సైన్యాన్ని రాజకీయ ప్రభావం నుండి దూరంగా ఉంచుతామని ఆ పార్టీ అధ్యక్షుడు తారిఖ్ రెహ్మాన్ ప్రకటించారు. సిటీహోటల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తమ పార్టీ గెలిస్తే దేశంలో సైన్యాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోకుండా చాలా దూరంగా ఉంచుతామన్నారు.దేశంలో సైన్యం తన ప్రతిష్ఠ కోల్పోయిందని, ఈ ప్రతిష్ఠను పునరుద్ధరిస్తామని చెప్పారు. 2009లో పిల్కానాలో జరిగిన సామూహిక ఊచకోతల బాధిత కుటుంబాలు, సైనిక అధికారులతో జరిపిన సమావేశంలో మాట్లాడుతూ ఆయన పైవిధంగా భరోసా ఇచ్చారు.





## మార్చి 5న నేపాల్ ఎన్నికలకు రంగం సిద్ధం

**కాఠ్మండు :** నేపాల్‌లో మార్చి ఐదో తేదీన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోవైపు రాజకీయపార్టీలు ఎన్నికల ప్రచారంలో మునిగితేలుతున్నాయి. నేపాల్ దిగువసభలో 275 స్థానాలు ఉన్నాయి. ఏపార్టీ అధికారం చేపట్టాలన్నాగానీ 138స్థానాలు గెలుచుకోవాలి. నేపాలీ కాంగ్రెస్‌పార్టీ (నాయకుడు గగన్‌కుమార్ థాపా), సిపిఎన్ యుఎంఎల్ (నాయకుడు కె.పి.శర్మ ఓలి), ఎన్‌సిపి (నాయకుడు పుష్పకమల్ దహల్) పార్టీలుప్రధానంగా ఎన్నికల బరిలో ఉన్నాయి. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ, రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ, పీపుల్స్ సోషలిస్టు పార్టీ, జనమత్ పార్టీ, పీపుల్స్ సోషలిస్టుపార్టీ నే పాల్, ప్రగతిశీల్ లోక్‌తంత్రపార్టీలు కూడా ఎన్నికల బరిలో ఉన్నాయి. బ్యాలట్ పద్ధతిలో దిగువసభకు ఎన్నికలు జరుగుతాయి. దీంతో ఎన్నికల సంఘం ఇప్పటికే 12.25 మిలియన్ల బ్యాలెట్ పత్రాల ప్రింటింగ్ ప్రక్రియను పూర్తిచేసి వాటిని 11,000 బాక్సులలో భద్రపరచినట్లు ఎన్నికలసంఘం సహాయ అధికార ప్రతినిధి కుల్ బహదూర్ చెప్పారు. 44జిల్లాలో 100 నియోజకవర్గాలకు ఈ పత్రాలను పంపుతారు. మొత్తం ఎన్నికల ప్రక్రియకుగాను 20,323,000 బ్యాలెట్ పత్రాలు అవసరం అవుతాయని ఆయన చెప్పారు.

## ప్రచారం బంద్ (మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల సంఘం పర్యవేక్షిస్తోంది. మొత్తం 8,203 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ప్రతి కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ సౌకర్యం కల్పించారు. ఈ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ల ద్వారానే ఓటింగ్ జరగనుండటంతో 16,301 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టగా, సుమారు 25 వేల మంది పోలీసు సిబ్బందిని బందోబస్తుకు నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,900 సమస్యాత్మక, 1,400 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అన్ని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 24 గంటల భద్రతను ఏర్పాటు చేశారు.

**తాయిలాల పంపిణీపై నిఘా..**

ప్రచారం ముగియడంతో కొన్ని ప్రాంతాల్లో నగదు, మద్యం, తాయిలాల పంపిణీ జోరందుకోవడం గమనించిన ఎన్నికల యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని పోలింగ్ సిబ్బంది, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పోలింగ్ నుంచి కౌంటింగ్ ముగిసే వరకు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.2 కోట్లకు పైగా నగదు, మద్యం, ఇతర వస్తువులు జప్తు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

**అభ్యర్థులు – పార్టీ వారీగా పోటీ**

రాష్ట్రవ్యాప్తంగా 22,519 మంది అభ్యర్థులు 29,742 నామినేషన్లు దాఖలు చేయగా, పరిశీలన, ఉపసంహరణ అనంతరం 12,944 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. వీరిలో 14 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## అవిశ్వాస తీర్మానం?

(మొదటి పేజీ తరువాయి)

అడ్డుకున్నందుకు, కాంగ్రెస్ మహిళా ఎంపిలపై బిజెపి ఎంపి నిషికాంత్ దూబే చేసిన నిరాధార ఆరోపణలపై చర్యలు తీసుకోనందుకు, ఎనిమిది మంది ప్రతిపక్ష ఎంపిలను సస్పెండ్ చేసినందుకు స్పీకర్‌పై ఆవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి ఈ నోటీసు ఇస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. త్వరలో లోక్‌సభలో తీర్మానం ప్రవేశపెడతామని, ఎంపిల సంతకాలు సేకరిస్తున్నామని వారు చెప్పారు. ఇప్పటికే 103 మంది ఎంపిలు తీర్మానంపై సంతకాలు చేశారని, స్పీకర్‌పై ఎప్పుడు నోటీసు ఇవ్వాలనే దానిపై తుది నిర్ణయం మంగళవారం తీసుకుంటామని ఆ వర్గాలు తెలిపాయి. సోమవారం లోక్‌సభను మరుసటి రోజుకు వాయిదా వేసిన వెంటనే, రాహుల్ గాంధీ, టిఎంసికి చెందిన అభిషేక్ బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన అఖిలేష్ యాదవ్, డిఎంకెకు చెందిన టిఆర్‌బాలుతో కలిసి ఒక పరిష్కారం కనుగొని ప్రతిష్టంభనను ముగించడానికి బిర్లాను కలిశారు.

## ఐఎస్‌ఎస్‌కు రేపు నలుగురు వ్యోమగాములు

### ప్రయాణానికి స్పేస్‌ఎక్స్ రంగం సిద్ధం



**కేప్‌కేనెవరల్ :** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్)కు నలుగురు వ్యోమగాములు నిర్ణీత ప్రకారం బుధవారం బయలుదేరేందుకు నాసా ఏర్పాట్లు సిద్ధం చేసింది. అమెరికాలోని నాసాకు చెందిన కేప్ కేనవరెల్ స్పేస్ ఫోర్స్ అంతరిక్ష కేంద్రం నుండి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి నలుగురు వ్యోమగాములు బుధవారం (ఫిబ్రవరి11) ఉదయం 6.01 గమంటలకు స్పేస్‌ఎక్స్ ఫాల్కన్–9 వాహకనౌకలో బయలుదేరతారు. 12వతేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు డ్రాగన్ నౌక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి అనుసంధానం అవుతుంది. తర్వాత వారు నౌకలోంచి ఐఎస్‌ఎస్ కేంద్రంలోకి ప్రవేశిస్తారు. కాస్మొనాట్ ఆంద్రీ ఫెద్యయేవ్, నాసాకు చెందిన జెస్సికా మెయిర్ (కమాండర్), యూరోపియన్ స్పేస్ ఏజన్సీకి చెందిన జాక్ హథావే (పైలట్), సోఫియా అడెనోట్ (ఇద్దరూ మిషన్ స్పెషలిస్టులు) ఐఎస్‌ఎస్‌కు వెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరంతా ఈనెల ఆరోతేదీన కేప్ కేనవెరెల్ కేంద్రానికి చేరుకున్నారు. ఈ నలుగురు వ్యోమగాములూ ఎనిమిది నెలలపాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో గడుపుతారు. ఇటీవల ఫాల్కన్–9 వాహకనౌక అప్పర్ స్టేజీకి వెళ్ళిన తర్వాత ఒక సమస్య ఎదురు కావడంతో ప్రయోగంలో సమస్యలు ఎదురయ్యాయి. ఆ తర్వాత ఎఫ్ఎఎ దర్యాప్తు చేసి క్రూ–12 మిషన్ అంతరిక్ష యానం చేయడానికి పరిస్థితులు అనుకూలంగానే ఉన్నాయని, సురక్షితమైన విధానం అందుబాటులో ఉందని నిర్ధారించిన తర్వాత నలుగురు అంతర్జాతీయ వ్యోమగాలుమూ రోదసీలోకి బయలుదేరడానికి అనుమతి లభించింది. దీంతో స్పేస్ ఎక్స్ తిరిగి తాజాగా ఈ క్రూ–12 ప్రయోగానికి అన్ని ఏర్పాట్లు చేసింది. ఫాల్కన్ వాహకనౌక శిఖరాగ్రాన నలుగురు వ్యోమగాములు కూర్చున్న డ్రాగన్ నౌకను అమర్చి బుధవారం ఉదయం రాకెట్‌ను ప్రయోగిస్తారు.

### చంద్రుడిపై స్పేస్‌ఎక్స్ సొంత నగరం

చంద్రుడిపై రాబోయే పదేళ్ళలో స్పేస్ ఎక్స్ తన సొంత నగరం నిర్మించుకుంటుందని ఆ సంస్థ అధినేత ఎలాన్‌మస్క్ ప్రకటించారు. రాబోయే పదేళ్ళలో మార్టియన్ కాలనీ నిర్మాణంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తామని చెప్పారు. అక్కడినుండి రాబోయే తరాలు ఇతర గ్రహాలపైకి అడ్వాన్స్‌డ్ ప్రయోగాలు చేయడానికి ఎంతో వీలుగా ఉంటుందని ఆయన ప్రటించారు. చంద్రుడుపై సొంత నగరాన్ని నిర్మించుకున్న తర్వాత అక్కడి నుండి మార్స్ (అంగారకుడు లేదా కుజుడు) గ్రహంపైకి వెళ్ళేందుకు ప్రయోగాలను 20 ఏళ్ళపాటు స్పేస్ ఎక్స్ ఉద్ధృతగా కొనసాగిస్తుందని ప్రణాళిక వివరించారు.

## హాంగ్‌కాంగ్ పత్రికాధిపతి జిమ్మీకి 20ఏళ్ళ జైలు

### సమర్థించిన చైనా : ఖండించిన తైవాన్

**విక్టోరియా సిటీ:** 'యాపిల్ డైలీ' పత్రికాధిపతి, హాంకాంగ్‌లో అతిపెద్ద మీడియాసంస్థ 'నెక్ట్స్ డిజిటల్ మీడియా లిమిటెడ్' అధినేత జిమ్మీ లై (78)కు హాంగ్‌కాంగ్ న్యాయస్థానం 20 సంవత్సరాలు కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. ఈ తీర్పును చైనా ప్రభుత్వం సమర్థించగా, తైవాన్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. కోర్టు తీర్పును ఖండించింది. పత్రికా విలువలకు,పత్రికాస్వేచ్ఛకు ఈ తీర్పు విరుద్ధమని, వాక్‌స్వాతంత్ర్యాన్ని అణచివేత, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని తైవాన్ ప్రభుత్వం విమర్శించింది. తక్షణం తీర్పును రద్దు చేయాలని కోరింది. హాంగ్‌కాంగ్ ప్రజలు తమ హక్కులు రక్షించుకోవాలని పిలుపు ఇచ్చింది. హక్కుల సంఘాలు కూడా తీర్పును వ్యతిరేకించాయి. హాంగ్‌కాంగ్‌కు విస్తారమైన స్వాతంత్ర్యం కావాలంటూ 2019లో జరిగిన ప్రదర్శనలు యావత్ ప్రపంచం దృష్టినీ ఆకర్షించాయి. ఈ ప్రదర్శనలకు మద్దతు ఇచ్చి దేశంలో అశాంతి రెచ్చగొట్టారన్న ఆరోపణలపై 'యాపిల్ డైలీ' పత్రికాధిపతి జిమ్మీలైను పోలీసులు అరెస్టుచేసి విచారణ జరిపారు. కోర్టు ఆయనకు సోమవారం జైలు శిక్ష ఖరారు చేసింది.

## నిలుపుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

శరవేగంగా అభివృద్ధి చెందనుందన్నారు. రాబోయేరోజుల్లో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, ప్రజల ఆర్థిక స్థితి గతుల్లో మార్పులు చోటు చేసుకుంటాయని, పారిశ్రామిక, విద్యా,వైద్య రంగాలు మరింత అభివృద్ధి సాధిస్తాయని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుండి పెద్ద ఎత్తున నిధులు సమీకరించి నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధిని కొనసాగిస్తున్నామని చెప్పారు. మారుమూలు ప్రాంతాల్లో సైతం మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎర్త్ యూనివర్సిటీ తీసుకొచ్చామని, ఈ యూనివర్సిటీలో చదువుకునేందుకు దేశ విదేశాల నుండి విద్యార్థులు శాస్త్రవేత్తలు తరలిరాబోతున్నారని అన్నారు. సింగరేణి సౌజన్యంతో బస్టాండ్ ఏరియా రోడ్ల వెడల్పుతో పాటు నూతన బస్టాండ్ నిర్మాణానికి నిధులు తీసుకొస్తున్నామని చెప్పారు. సింగరేణి కార్మికుల సంక్షేమానికి అనేక పోరాటాలు చేసి కార్మికుల శ్రేయస్సుకు ఎర్రజెండా పాటు పడుతుందని తెలిపారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం కార్మికులు, కర్షకులు చేతివృత్తిదారుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి స్వార్థం లేకుండా కేవలం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పేదలకు అండగా ఉండేది ఎర్రజెండానే అని, ఈవందేళ్ల కాలంలో ఇది నిరూపితమైందని తెలిపారు. ప్రజా ఆశీర్వాదమే మనకు బలమని, కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి సిపిఐ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా సురపరిపాలనను స్వాగతిస్తున్నట్లు అవుతుందని అన్నారు. కార్పోరేషన్ వ్యాప్తంగా చక్కటి ఫలితాలు రానున్నాయని, మేయర్ పీఠం మనదే అని చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, కందుల భాస్కర్, ఎస్కే ఫహీమ్, వాసిరెడ్డి మురళీ, దుర్గరాశి వెంకన్న, మునిగడప వెంకటేశ్వర్లు, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, జక్కుల గట్టయ్య, క్రిష్టోఫర్, జహీర్, ఖయ్యూమ్, గోపి కృష్ణ, గుత్తుల సత్యనారాయణ, గుత్తుల శ్రీనివాస్, లావుడ్య వినాయక్, భూక్యా ధస్రు, జక్కుల రాములు, కొమారి హన్మంతరావు, గెద్దాడు నగేష్, వంగ వెంకట్, రమణమూర్తి, సందెబోయిన శ్రీనివాస్, మునిగడప పద్మ, భూక్య శ్రీనివాస్, ఎర్రవెల్లి శంకర్, కనుకుంట్ల సాహితి, పి ఇందిరా ప్రియదర్శిని, పోలమూరి ధనలక్ష్మీ, బానోత్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## మాట్లాడనీయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

సభ ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టినప్పుడు, ప్రతిపక్ష సభ్యులు కొన్ని సమస్యలను లేవనెత్తడం ప్రారంభించి, వాటిని తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధ్యక్ష స్థానంలో ఉన్న బిర్లా, ఈ సమస్యలను కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా లేవనెత్తవచ్చన్నారు. ప్రతిపక్ష నాయకుడితో సహా సభ్యులందరూ చర్చ సందర్భంగా మాట్లాడటానికి స్వేచ్ఛ ఉందని ఆయన అన్నారు.

ప్రతిపక్ష సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో ప్రణాళికాబద్ధమైన అంతరాయాలకు పాల్పడుతున్నారని బిర్లా విమర్శించారు. నిబంధనల ప్రకారం సభను నడవనివ్వాలని కోరారు. వివిధ సమస్యలపై నిరసనలు కొనసాగడంతో, స్పీకర్ సభ కార్యకలాపాలను కొద్దిసేపు వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు, బడ్జెట్‌పై చర్చను చేపట్టడానికి ముందు గాంధీని మాట్లాడటానికి అనుమతించాలని ప్రతిపక్ష పార్టీలు పట్టుబట్టాయి. అధ్యక్ష స్థానంలో ఉన్న కృష్ణ ప్రసాద్ తెన్నేటి బడ్జెట్‌పై చర్చను ప్రారంభించాల్సిందిగా థరూర్ పేరును పిలవగా, ప్రతిపక్ష సభ్యులు తమ పట్టుదలను వీడకుండా, ముందుగా గాంధీని మాట్లాడటానికి అనుమతించాలని డిమాండ్ చేశారు. చర్చ బడ్జెట్‌పై జరుగుతోందని, కాంగ్రెస్ పార్టీ తన ప్రధాన వక్తగా థరూర్ పేరును ఇచ్చిందని తెన్నేటి నొక్కి చెప్పారు. ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడటానికి అనుమతించవచ్చా లేదా అనే దానిపై తాను స్పష్టత పొందాల్సి ఉంటుందని ఆయన అన్నారు. బడ్జెట్‌పై మాట్లాడాలనుకుంటున్నారా అని ఆయన గాంధీని కూడా అడిగారు. ఇంతలో, థరూర్ తాను ప్రతిపక్ష నాయకుడికి అవకాశం ఇస్తున్నానని చెప్పారు. ఈ ప్రతిష్టంభన కొనసాగడంతో, తెన్నేటి సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు.

## మోదీకేం సంబంధం?

(మొదటి పేజీ తరువాయి)



రేవంత్ రెడ్డి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిఎం క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

'రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి మధ్య త్రిముఖ పోటీ జరుగుతోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న 12 ఏళ్ళ బిజెపి ప్రభుత్వ పాలనను, రాష్ట్రంలో పదేళ్ల బిఆర్ఎస్ దోపిడీని, ప్రస్తుతం అధికారంలో ఉన్న రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమాన్ని బేరీజు వేసుకుని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, భవిష్యత్‌ను ఆలోచించుకుని తీర్పు ఇవ్వాలి'' అని సిఎం రేవంత్ రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈ 12 ఏళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణకు ఏమైనా ప్రాజెక్టులు మంజూరు చేసిందా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పాలమూరు–రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా చేస్తామని ప్రధాని మోదీయే స్వయంగా ప్రకటించారని, కానీ మోదీ మూడు సార్లు ప్రధాని అయినా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, బిజెపి జాతీయ అధ్యక్షుడు, ఆ పార్టీ నేతలు మోదీని చూసి ఓటేయాలని ఎలా అడుగుతున్నారని నిలదీశారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారానికి వచ్చిన మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ సైతం తెలంగాణను అవమానించేలా మాట్లాడి ఓట్లు మాత్రం బిజెపికి వేయాలని అడుగుతున్నారని సిఎం విమర్శించారు. పన్నెండేళ్లుగా కేంద్రంలో మోదీ అధికారంలో ఉండి తెలంగాణకు చేసిందేమిటని సిఎం ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం మోదీని కలిసి అడుగుతామని, అవసరమైతే కేంద్రంతో కొట్లాడుతామని రేవంత్ రెడ్డి చెప్పారు. వరదల్లో నీటమునిగిన వస్తులన్నీ తిరిగిస్తామని జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో బిజెపి నేత బండి సంజయ్ హామీ ఇచ్చారు. బండి మునిగితే బండి, ఆటో మునిగితే ఆటో ఇస్తామని చెప్పారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చి వస్తువులన్నీ తిరిగిస్తామని ప్రకటించారు. బండి సంయ్ హామీలను నమ్మి జిహెచ్‌ఎంసిలో 50 మంది బిజెపి కార్పొరేటర్లను గెలిపిస్తే ఎన్నికలయ్యాక అడిగితే వస్తువులకు ఇన్సూరెన్స్ ఉంటుందని బండి సంజయ్ మాట మార్చారు. ఇన్సూరెన్స్ డబ్బులు వచ్చేదానికి బండి సంజయ్ రికమండేషన్ ఎందుకో'' అని సిఎం ప్రశ్నించారు. సత్రం భోజనానికి నెల్లూరు పెద్దారెడ్డి సిఫార్సు లేఖ ఇచ్చినట్లు బండి సంజయ్ వ్యవహారం ఉందని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణకు వచ్చిన ఐటిఐఆర్ ప్రాజెక్టును రద్దు చేశారని, హైదరాబాద్‌కు వచ్చిన సెమీ కండక్టర్ ప్రాజెక్టును ప్రధాని మోదీ ఒత్తిడి చేసి ఎపికి తరలించారని, ఇప్పుడు మోదీని చూసి ఓటేయాలని బిజెపి నేతలు అడుగుతుండడం విడ్డూరమని సిఎం అన్నారు.

**బిజెపి నేతల లైఫ్ లైనే ఎంఐఎం**

''బిజెపి నాయకులకు అసదుద్దీన్ ఒవైసీ దేవుడు, వీళ్లంతా పైకి రాముడి పేరు చెబుతారు. కానీ రోజు దండం పెట్టుకునేది మాత్రం ఒవైసీకి. రాముడి పేరు ఎన్ని సార్లు తలుచుకున్నారో తెలియదు. కానీ ఒవైసీ పేరు తలుచుకోకుండా వీళ్లకు రోజు గడవదన్నారు. బిజెపి నేతల 'లైఫ్ లైనే ఎంఐఎం'. అన్ని బిజెపి చేతుల్లో ఉన్నప్పుడు ఒవైసీని ఎందుకు నియంత్రించలేకపోతున్నారు. ఈ దేశంలో మిగతా రాజకీయ పార్టీల మాదిరిగానే ఎంఐఎం కూడా ఓ రాజకీయ సంస్థ. ఇంకెంత కాలం ఎంఐఎం పార్టీని భూతంగా చూపించి ఓట్లు అడుగుతారు'' అని సిఎం రేవంవ రెడ్డి అన్నారు. కేవలం మత విద్వేషాలను రెచ్చగొట్టి, కొంత మంది రాజకీయ నాయకులను భూతంగా చూపిస్తూ రాజకీయ మనుగడ సాగించడం వారి భావదారిద్ర్యానికి పరాకాష్ట అని, ఈ భావదారిద్ర్యాన్ని చూసి బిజెపికి ఓట్లు వేయాలా తెలంగాణ ప్రజలు ఆలోచించుకోవాలని సిఎం అన్నారు.

**ఏ ముఖం పెట్టుకుని బిఆర్‌ఎస్ మళ్లీ ఓట్లు అడుగుతున్నది?**

''తెలంగాణలో గత పదేళ్లు బిఆర్‌ఎస్సే అధికారంలో ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు సమస్యల పరిష్కారానికి బిఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని అడుగుతున్నారు సర్పంచ్ నుంచి మున్సిపల్ వరకు పెత్తనం బిఆర్‌ఎస్‌యే మీరే చెలాయించింది. ఇవాళ సమస్యలకు ప్రధాన కారణం కెసిఆర్, కెటిఆర్, హరీష్ కాదా? ఏ ముఖం పెట్టుకుని ఇపుడు మళ్లీ ఓట్లు అడుగుతున్నారు? అహంకారం, విద్వేష ప్రసంగాలతో గంజాయి, కొకైన్ తీసుకున్న వారిలా మాట్లాడుతున్నారు. దోపిడీకి అలవాటు పడ్డ ఇలాంటి వాళ్లకి ఓటు వేస్తే పరిస్థితి ఏంటి? మూడోసారి మళ్లీ ప్రజలను మోసం చేయాలని ప్రయత్నిస్తున్నారు. బిఆఆర్‌ఎస్‌ను యాసిడ్ పోసి కడిగితే తప్ప రాష్ట్రానికి పట్టిన పీడ వదలదు. మళ్లీ బిఆర్‌ఎస్ మొక్కను మొలవనివ్వద్దు'' అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

# ఎటు చూసినా కమీషన్లు, కబ్జాలే



ఎమ్మెల్యే మురళి నాయక్‌పై
డా.కె.నారాయణ మండిపాటు

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మున్సిపాలిటీ పాలకవర్గం రాకముందే రూ.60 కోట్ల మున్సిపాలిటీ పనులకు శంకుస్థాపనలు చేసి ఎమ్మెల్యే మురళీనాయక్ కశాతం కమీషన్ తీసుకున్నాడని, కబ్జాలకు తెర లేపి 3 ప్రధానమైన చోట్ల కబ్జా చేసేందుకు పైరవీలు చేస్తున్నాడని, ఇలాంటి మురళి నాయక్‌కు, కాంగ్రెస్ పార్టీని మానుకోట మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించాలని మానుకోట మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ పిలుపునిచ్చారు. సోమవారం మహబూబాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన 33, 18, 36, 22, 21 వార్డుల్లో సిపిఐ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి సిపిఐ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, ప్రశ్నించే గొంతుక ఉంటే ప్రజా సమస్యల పరిష్కారం మేలని అభ్యర్థించారు. మానుకోట మున్సిపాలిటీలో సిపిఐ నేతలను, ప్రశ్నించే గొంతుకలను రాకుండా మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ కుట్రలు చేశాడన్నారని, పొత్తులు అంటూ సిపిఐ గొంతు కోశాడని నారాయణ విమర్శించారు. మానుకోట మున్సిపాలిటీ ఎన్నికల్లో ఏడుగురు సిపిఐ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని వారిని గెలిపించి ప్రశ్నించే గొంతుకలను, ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేలా మున్సిపాలిటీ పాలకవర్గంలోకి పంపించాలని అభ్యర్థించారు. 33వ వార్డు అభ్యర్థి బి.అజయ్ సారథి రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి మున్సిపాలిటీలో ప్రజాయుద్ధ నౌక, ప్రశ్నించే గొంతుక ఉండేలా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, పంజాల రమేష్, సిపిఐ మున్సిపల్ ఎన్నికల అభ్యర్థులు 33వ వార్డు అభ్యర్థి బి.అజయ్ సారథి రెడ్డి, 36వ వార్డు అభ్యర్థి పెరుగు కుమార్, 18వ వార్డు అభ్యర్థి శేషపల్లి నవీన్, 22వ వార్డు అభ్యర్థిని చింతకుంట్ల శ్రీదేవి వెంకన్న, 21వ వార్డు అభ్యర్థిని ఎండి పాతిమా అబ్బాస్, 25వ వార్డు అభ్యర్థిని నర్రా సంధ్యా శ్రావణ్, 23వ వార్డు అభ్యర్థిని నాగెల్లి యాకమ్మ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా గొంతుక సిపిఐకి పట్టం కట్టండి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి
ఈటి.నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ
సభ్యుడు ఎం.బాలనరసింహ

**ప్రజాపక్షం/అమరచింత :** మున్సిపల్ ఎన్నికల్లో చీకటి ఒప్పందాలు అవకాశావాద నీచ రాజకీయాలకు సమాధి కట్టి ప్రజల కోసం అనేక పోరాటాలు చేసి జనం పక్షాన నిలబడి పోరాడుతున్న సిపిఐ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి.నరసింహ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ఎన్నికల ప్రచార ముగింపు కార్యక్రమంలో భాగంగా పట్టణంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సిపిఐ అభ్యర్థులుగా రెండవ వార్డు కే.భారతి, నాలుగో వార్డు అజ్జపాగు బాలేశ్వరమ్మ, ఆరోవ వార్డు ఎరకలి భీమన్న, ఎనిమిదవ వార్డు ఎం.డి.కుతూబ్‌లకు మద్దతుగా సిపిఐ శ్రేణులు అమరచింత పట్టణంలో డప్పుల దరువులతో కళాకారుల ఆటపాటలతో ఎర్రజెండాలు చేత పట్టి భారీ ర్యాలీ నిర్వహించి, వీధి సభలు నిర్వహించారు. సిపిఐ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ ప్రజలకు పిలుపునిచ్చారు.



సోమవారం ఎన్నికల ప్రచార ముగింపు కార్యక్రమంలో భాగంగా పట్టణంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులుగా రెండవ వార్డు కే.భారతి, నాలుగో వార్డు అజ్జపాగు బాలేశ్వరమ్మ, ఆరవ వార్డు ఎరకలి భీమన్న, ఎనిమిదవ వార్డు ఎండి కుతూబ్‌లకు మద్దతుగా సిపిఐ శ్రేణులు అమరచింత పట్టణంలో డప్పుల దరువులతో కళాకారుల ఆటపాటలతో ఎర్రజెండాలు చేత పట్టి భారీ ర్యాలీ నిర్వహించి, వీధి సభలు నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ మాట్లాడుతూ ప్రజల కోసం నిర్బంధాలు ఎదుర్కొని అనునిత్యం ప్రజలలో మమేకమౌతూ ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేస్తున్న సిపిఐ అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మాజీ కౌన్సిలర్ కే.విజయరాములు, మండల కార్యదర్శి ఏ.అబ్రహాం, పట్టణ కార్యదర్శి రవీందర్, సిపిఐ నాయకులు పి.శ్రీహరి, కలవతమ్మ, నరసింహ శెట్టి, పి.సురేష్, ఆర్.ఎన్.శంకర్, శ్రీరాములు, రమేష్, భాస్కర్, శ్యాంసుందర్, మోష, రఘు, గీతమ్మ, కృష్ణవేణి, సత్త్యమ్మ, పద్మావతి, శారద, గోవిందమ్మ, కళావతి, శృతి, లక్ష్మీనారాయణ, ఇజ్రాయేలు, సౌలు, ఎర్రన్న, క్రాంతి, కొంకోనిపల్లి వెంకటేశ్, అంజి తదితరులు ఉన్నారు.

# నగర సమగ్రాభివృద్ధికి సిపిఐ అభ్యర్థులను ఆదరించండి



సిపిఐ కార్యదర్శివర్గ సభ్యురాలు
పశ్య పద్మ

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నగర సమగ్రాభివృద్ధికై సిపిఐ అభ్యర్థులను గెలిపించండని, నగర సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. సోమవారం నగరంలోని 1, 17వ డివిజన్లలో సిపిఐ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న గొలుసుల రమేష్, బి.స్వప్నలను గెలిపించాలని రోడ్‌షో ప్రచారం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా డివిజన్లలో కార్నర్ సభలు నిర్వహించామని, ఈ సభలకు సిపిఐ నగర కార్యదర్శి ఓమయ్య అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నగరంలో ప్రజా సమస్యలు పరిష్కారం కావలంటే వార్డులు అభివృద్ధి చెందాలంటే కూడా నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడే సిపిఐ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఒకటో డివిజన్ పరిధిలో వార్డుల అభివృద్ధికి గత కార్పోరేటర్ అభ్యర్థి నిర్లక్ష్యం చేశాడని మారుమూల గ్రామాల్లో కూడా రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి చెందాయని కానీ నగర కార్పోరేషన్ పరిధిలోని 1వ డివిజన్ అభివృద్ధికి నోచుకోకపోవటం సిగ్గుచేటన్నారు. 17వ డివిజన్ గౌతంనగర్ అభివృద్ధికి సిపిఐ పార్టీ కట్టుబడి ఉందని ప్రజాసమస్యలతో పాటు చదువుకున్న యువకులకు అండగా పార్టీ నిలబడుతుందని హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కంజర భూమయ్య, సుధాకర్, రాజేశ్వర్, ఇమ్రాన్‌అలీ, అనిల్, తిరుపతి, భాగ్యలక్ష్మి, సాయగౌడ్, వెంకటేశ్వర్లు, స్వరూపరాణి, హన్మాండ్లు, రాధకుమార్, గోవర్ధన్, సుజాత నాయకులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లు తక్షణమే రద్దు చేయాలి

డిహెచ్‌పిఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
మారుపాక అనిల్ కుమార్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్న కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ నెల 12న చేపట్టనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కౌన్సిల్ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆరుట్ల రాజ్‌కుమార్, జేరుపోతుల కుమార్, వై ఉషాశ్రీలతో కలిసి హైదరాబాద్, మఖ్దూం భవన్‌లోని రాజ్‌బహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ కార్మిక వర్గ హక్కులను కాపాడే పోరాటంలో దళిత, బలహీన వర్గాల ప్రజలు ఐక్యంగా నిలబడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మికుల ఉద్యోగ భద్రత, వేతన, సంఘటిత హక్కులు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు డిహెచ్‌పిఎస్ కార్యకర్తలు చైతన్య కార్యక్రమాలు, ప్రచార యాత్రలు, సమావేశాలను నిర్వహించి సమ్మెను విజయవంతం చేసేందుకు కృషి చేస్తారన్నారు. కార్మిక వర్గం బలంగా ఉంటేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యవాదుల, శ్రామికులు ఈ నెల 12న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొని, కార్మిక వర్గానికి సంఘీభావాన్ని ప్రకటించాలని కోరారు.

# దోపిడీ వర్గాలకు వంతపాడే కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మికుల హక్కుల రక్షణకు ఈ నెల 12వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని, దోపిడీ వర్గాలకు వంతపాడే కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. సమాజంలోని వ్యాపారులందరూ తమ విక్రయిస్తున్న వస్తువుల ధరలు వారే నిర్ణయిస్తారని, ఇందులో కేంద్ర ప్రభుత్వ ప్రమేయం ఉండబోదని, కానీ సంపద సృష్టికర్తలైన రైతు తాను పండించిన పంటలకు తాను ధర నిర్ణయించలేరని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు తమ శ్రమకు తామే విలువను నిర్ణయించలేరని బోస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దోపిడీదారులైన పారిశ్రామిక వేత్త వారి శ్రమకు విలువను నిర్ణయిస్తారని, ఆ విలువ ప్రకారం కార్మికులు తమ బతుకుదెరువు కోసం పని చేయాల్సి వస్తుందని, దీనిని కూడా ప్రభుత్వం చూసీ చూడనట్టుగానే వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఈనెల 7వ తేదీన యాప్ ఆధారిత కార్మికులు దేశవ్యాపితంగా ఒకరోజు సమ్మె చేపట్టారని, వారిని మోసం చేయడానికి కేంద్రప్రభుత్వం అనేక రకాలుగా మోసపూరిత ప్రకటనలు చేసినప్పటికీ, వారు తమ నిర్ణయాన్ని మార్చుకోలేదన్నారు. వారు మరోసారి 12వ తేదీన జాతీయ సమ్మెలో పాల్గొంటామని ప్రకటించడం కార్మిక వర్గంలో నెలకొన్న పట్టుదల బహిర్గతమవుతుందని వి.ఎస్. బోస్ అన్నారు.

**ప్రజా వ్యతిరేక విధానాల వల్ల అన్ని వర్గాలలో అసంతృప్తి**
**ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్**

కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాల వల్ల అన్ని వర్గాలలో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడి, పెట్టుబడిదారి విధానాన్ని బొందపెట్టే రోజులు దగ్గరలో ఉన్నాయని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ హెచ్చరించారు. కార్మిక సంఘాలు అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 ముఖ్యమైన కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికులను కట్టుబానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్‌లను మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాన్ని వ్యతిరేస్తూ ఫిబ్రవరి 12న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు వామపక్ష పార్టీలు మద్దతు తెలిపినందుకు ధన్యవాదాలు తెలిపారు. దేశంలోని 10 కేంద్ర కార్మిక సంఘాలు, రైతు, సంఘాలు, రాజకీయాలకు అతీతంగా పోరాటాలకు సిద్ధం అవుతున్నారని, అన్ని వామపక్షపార్టీలు కార్మికుల సమ్మెకు ప్రత్యక్షంగా మద్దతు ఇస్తూ, పాల్గొంటున్నారని ఎస్.బాల్‌రాజ్ వెల్లడించారు.

# డాక్టర్ పి.సరస్వతికి కన్నీటి వీడ్కోలు



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** డాక్టర్ సరస్వతి 21 సంవత్సరాలుగా సిఆర్ ఫౌండేషన్‌లో ఉంటూ మృతి చెందారని ఆమె పార్థివ దేహన్ని సోమవారం సిఆర్ ఫౌండేషన్ అవరణలో సందర్శనార్థం ఉంచారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ ప్రధానకార్యదర్శి, మాజీ శాసనసభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కంభంపాటి అజయ్ కుమార్, కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, సిఆర్ ఫౌండేషన్ డైరెక్టర్, కోశాధికారి చెన్నకేశవరావు, సిఆర్ పాలిక్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కె.రజని లు విచ్చేసి డాక్టర్ సరస్వతి పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర సరస్వతి గత 21 సంవత్సరాలుగా సిర్ ఫౌండేషన్ ఆశ్రమంలోనే ఉంటూ సిఆర్ ఫౌండేషన్ ఆరోగ్య కేంద్రంలో ఆమె కంటి వైద్యురాలిగా 11 సంవత్సరాలుగా ఉచిత సేవలందించారని, ఆశ్రమ సలహామండలి సభ్యురాలిగా ఆశ్రమ అభివృద్ధికి, సిఆర్ ఫౌండేషన్ మహిళా సమాఖ్య, పలు సామాజిక కార్యక్రమాలకు చేపడుతూ ఎన్నో విదాలుగా తోడ్పాటు అందించారని, ఆమె మృతి సిఆర్ ఫౌండేషన్‌కు తీరని లోటు అని సంతాపం వ్యక్తం చేశారు. ఏఐటియూసి మాజీ కార్యదర్శి డా.బి.వి.విజయలక్ష్మి, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోస్యభట్ల కల్పన, సభ్యులు ప్రేమ పావని, పల్లా విజయ, కె.జ్యోత్స్న, డి.కృష్ణకుమారి, డాక్టర్ పి.రాజశ్రీ, వి.లలిత, సీనియర్ జర్నలిస్ట్ ఏబికె ప్రసాద్, మల్లంపాటి వెంకటేశ్వరరావు, హోమ్ కమిటీ సభ్యులు రాజేంద్రరావు, తమ్మారెడ్డి తాన్య, హోమ్ మేనేజర్ శ్రీనివాస్, ఆశ్రమవాసులు, వారి బంధుమిత్రులు తదితరులు నివాళులర్పించారు. తదుపరి ఆమె పార్థివదేహన్ని విద్యార్థుల వైద్య విద్య అవసరాల నిమిత్తం గాంధీ మెడికల్‌కు ఆమె కుమారుడు శ్రీనివాస్‌చే గాంధీ మెడికల్ కాలేజ్ విద్యార్థులు, అనాటమి డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సంగీత, డాక్టర్ వినయ్ సమక్షంలో అప్పగించారు. దివంగత డాక్టర్ సరస్వతి నేత్రాలు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆసుపత్రి బ్యాంకుకు దానం చేశారు. కార్యక్రమంలో అమ్మ ఐ, బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ తరపున ఈశ్వర లింగం, ఆర్గనైజేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 15 నాటికి సర్వే పూర్తి

సిఎస్ రామకృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను మార్చి 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారుడు, అగ్రిస్టాక్ చీఫ్ నాలెడ్జ్ ఆఫీసర్ రాజీవ్ చావ్లా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేశ్‌కుమార్, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ స్పెషల్ సెక్రెటరి రాజీవ్‌గాంధీ హన్మంతు, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్లు, ఎన్ ఐసి అధికారుల సహకారంతో డిజిటల్ క్రాప్ సర్వేను పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రంలో 10, 877 గ్రామాల్లో డిసిఎస్ సర్వే చేపట్టడం జరిగిందని అధికారులు తెలిపారు. సీజినల్ డిజిటల్ క్రాప్ సర్వే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలకు ఉపకరిస్తుందని, అదేవిధంగా స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి(జిఎస్‌డిపి) గణాంకాలకు ఈ సర్వే ఉపయుక్తంగా ఉంటుందని సిఎస్ పేర్కొన్నారు. దేశంలోని యుపి, బీహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక, ఒడిశా తదితర రాష్ట్రాల్లో డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ పూర్తైందని కేంద్ర ప్రభుత్వ సలహాదారుడు రాజీవ్ చావ్లా తెలిపారు. రాష్ట్రంలో డిజిటల్ క్రాప్ సర్వేకు సంబంధించి ఇప్పటి వరకు చేపట్టిన వివరాలను వ్యవసాయశాఖ సంచాలకులు గోపి ఉన్నతాధికారులకు వివరించారు.

# వెట్టిచాకిరి కొనసాగడం ఆందోళనకరం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బాండెడ్ లేబర్ సిస్టమ్ (రద్దు) చట్టం 1976కి 50 సంవత్సరాలు పూర్తి అయినా వెట్టిచాకిరి వివిధ రూపాల్లో కొనసాగుతుండటం ఆందోళనకరమన్నారు. వెట్టిచాకిరి దినోత్సవం సందర్భంగా తెలంగాణ పోలీస్ అకాడమీలో ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంయుక్తంగా వెట్టిచాకిరి అవగాహన పోస్టర్‌తో పాటు సెల్ఫ్ లెర్నింగ్ డిజిటల్ బాండెడ్ లేబర్ ట్రైనింగ్ మాడ్యూల్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. బాధితులను గుర్తించి రక్షించడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో పోలీసుల పాత్ర కీలకమని, శిక్షణ అవసరమని పేర్కొన్నారు. ఐజెఎం ప్రతినిధి అభిషేక్ జోషెఫ్ మాట్లాడుతూ.. చట్టం ఉన్నప్పటికీ కార్మికులకు హక్కులు పూర్తిగా అందటం లేదని, వారికి అవగాహన కల్పించేందుకు ఐజెఎం పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు డి.మురళీధర్, కవిత, వెంకటేశ్వర్లు, కె.ఆర్.కె.ప్రసాద్, మధుకర్ స్వామి, శ్రీరామమూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్లు ఘంటా వెంకట్రావ్, నాగేశ్వరరావు, నరహరి, రమణ, వి.శ్రీనివాసరావు, డాక్టర్లు ధనజ, రవి కుమార్, వరలక్ష్మి, డిఎస్‌పిలు సతీష్ కుమార్, ఆదూరి శ్రీనివాసరావు, ఎన్. రామారావు, సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

# టిజిఐసిసిసిలో ఎస్‌పిఒల భర్తీకి నోటిఫికేషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టిజిఐసిసిసి)లో తాత్కాలిక ప్రాతిపదికన స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు (డ్రైవర్లు)గా నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 28 ఖాళీలు భర్తీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ నియామకాలు తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎక్స్ సర్వీస్‌మెన్, మాజీ పారా మిలిటరీ బలగాల సిబ్బంది నుంచి మాత్రమే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఆధార్, ఓటర్ ఐడి, డ్రైవింగ్ లైసెన్స్ వంటి నివాస ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలి. దరఖాస్తుదారుల వయస్సు ఈ నెల 28 నాటికి 58 సంవత్సరాలు మించకూడదు. అలాగే సేవ నుంచి గత రెండు సంవత్సరాలలో పదవీ విరమణ చేసినవారు కూడా అర్హులే. ఎంపికైన వారికి నెలకు రూ.26,000 గౌరవ వేతనం చెల్లించనున్నారు. సెలవులు హక్కుగా ఉండవు. అవసరమైతే వేతనం లేకుండా సెలవులు మంజూరు చేస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు టిజిఐసిసిసి రిసెప్షన్ సెంటర్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చు. మరిన్ని వివరాలకు ఆర్‌ఐ ఎ.గోపాల్ రెడ్డి మొబైల్: 8712674111ను సంప్రదించవచ్చు.

# భారతదేశ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసే విధంగా మోదీ ప్రభుత్వం

సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు తలొగ్గి, భారతదేశ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసే విధంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవర్తిస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. అమెరికాతో జరిగిన వాణిజ్య ఒప్పంద వివరాలను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని, వాటిపైన చర్చించి, ఆమోదించిన తర్వాతనే ఆ అప్పంద పత్రాలపైన సంతకాలు చేయాలని, అప్పటి వరకు ఒప్పందాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఒప్పందం విషయంలో అమెరికాకు తలొగ్గి మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తే పర్యవసనాలు ప్రమాదకరంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. అమెరికాకు కేంద్ర ప్రభుత్వం గుడ్డిగా లొంగిపోయిందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందం ఫలితంగా రైతులు, కార్మికులు, ప్రజలు తీవ్రమైన నష్టానికి గురయ్యే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో పత్తి, సోయాబిన్, ఆహార ధాన్యాలు పండించిన రైతులు దెబ్బతినే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. జిరో టారీఫ్‌తో దిగుమతులు చేస్తే లక్షలాది ఎకరాలలో పంటలు పండించే రైతులు ఇబ్బందికి గురవుతారని, దేశ వ్యాప్తంగా దీనిని రైతు సంఘాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. వాణిజ్య ఒప్పందంపైన ఆర్థిక వేత్తలు చర్చిస్తున్నారని, మరోవైపు కేంద్ర ప్రభుత్వం మాత్రం గుడ్డిగా, సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే పద్ధతిలో ఒప్పందం చేసుకున్నదని దుయ్యబట్టారు. గతంలో నుంచి కూడా తక్కువ ధరకే రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ కొనుగోలు చేస్తున్నామని, దీనిపైన అమెరికా ఆంక్షలు విధించిందని, దీనిని ఉల్లంఘిస్తూ మరోసారి రష్యాతో కొనుగోలు చేస్తే మళ్లీ టారీఫ్‌లు పెంచుతామని, అమెరికానే మానిటరింగ్ చేస్తుందని వివరించారు. సార్వభౌమాధికారాన్ని విచ్ఛిన్నం చేసే పద్ధతిలో ఉన్న ఒప్పంద వివరాలను పార్లమెంట్ ముందు పొందుపర్చాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

# ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచారం

భూపాలపల్లిలో అమానవీయ సంఘటన

**ప్రజాపక్షం/భూపాలపల్లి/రేగొండ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా, రేగొండ మండలం పొనగండ్ల గ్రామంలో అమానవీయ ఘటన వెలుగుచూసింది. తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన వేళ.. ఓ చిన్నారిపై కామాంధులు అత్యాచారం చేశారు. ఆదివారం కావడంతో ఇంట్లోనే ఉన్న ఎనిమిదేళ్ల బాలికను అదను చూసి అపహరించుకుపోయి, తమ పైశాచికత్వాన్ని ప్రదర్శించారు. చిలుకూరి శ్రీకాంత్ అనే యువకుడు, మరో వ్యక్తితో కలిసి మద్యం మత్తులో చిన్నారిని ఎత్తుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టారు. అఘాయిత్యం చేసిన అనంతరం, ఏమీ ఎరుగనట్టుగా చిన్నారిని తీసుకువచ్చి ఆమె ఇంట్లోనే పడేసి వెళ్లడం వారి తెగింపునకు నిదర్శనం. యువకుల దాష్టీకంతో చిన్నారి పరిస్థితి ప్రస్తుతం అత్యంత విషమంగా ఉంది. బాధితురాలిని చికిత్స నిమిత్తం భూపాలపల్లి జిల్లాలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు ఈ ఘటనపై పోక్సో (పిఓసిఎస్ఓ) చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే, నిందితుల్లో ఒకరైన శ్రీకాంత్‌తో పాటు గతంలోనూ ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, బాధితురాలి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం అది. తల్లిదండ్రులు పొట్టకూటి కోసం పనికి వెళ్తే, నమ్మకంగా ఉండాల్సిన ఊరిలోనే ఇలాంటి మృగాళ్లు తిరగడం భయాందోళనకు గురిచేస్తోంది. మద్యం మత్తులో పసిమొగ్గను నలిపేసిన ఈ మృగాలను వెంటనే కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు.

**బాధిత కుటుంబసభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే జీఎస్ఆర్**

చిన్నారిపై జరిగిన అత్యాచార ఘటన దిగ్భ్రాంతికి గురి చేసిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభు త్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని మరియు వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. ఘటనపై వరంగల్ ఎంపి డా.కడియం కావ్య తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన అత్యంత దారుణమని పేర్కొన్న ఎంపి, చిన్నారిపై అమానుష ఘటనకు పాల్పడిన శ్రీకాంత్, గణేష్‌లకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని పోలీసు అధికారులను కోరారు. కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించి త్వరితగతిన న్యాయం చేయాలని సూచించారు. బాధిత చిన్నారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఫోన్ ద్వారా వైద్యులను అడిగి తెలుసుకున్న ఎంపి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు.




**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు
NIT No. 07/EE-II/Cir.43/SBZ/GHMC/2025-26, తేది: 07.02.2026
పని పేరు: జిహెచ్‌ఎంసి, ఎస్‌బిజెడ్, తార్నాక, డివిజన్-43లోని అన్ని వార్డులలో, జనవరి 2026 నుండి డిసెంబర్ 2026 వరకు గల వార్షిక కాలానికి వర్షపు నీటి కాలువలు / నాలాల పూడికతీత పనులు. (2026 సంవత్సరం కోసం). అంచనా విలువ / ఇసివి: రూ.36.00లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 09.02.2026న మ.1.00గం.ల నుండి 12.02.2026న మ.1.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక, జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్ జోన్, సెల్ నెం. 9704405076. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 15134-PP/CL/ADVT/1/2025-26, Date: 09-02-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: ఎల్.బి.నగర్ సర్కిల్-13**
షార్ట్ టెండర్ నోటీసు
NIT No. 36/EEC-13/LBNR/GHMC/2025-26, తేది: 09.02.2026
పని పేరు: నిర్వహణ పనులు - 01 నెం.లు. అంచనా విలువ : రూ.13.50లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 10.02.2026న మ.03.00గం.ల నుండి 13.02.2026న మ.03.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీ వి.కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-13, జిహెచ్‌ఎంసి. సెల్ నెం. 9701365519. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్.బి.నగర్ సర్కిల్-13, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 15164-PP/CL/ADVT/1/2025-26, Date: 09-02-2026

**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.
HMDA Act. 2008లోని సెక్షన్ 15 (4) ప్రకారం బహిరంగ ప్రకటన
(G.O.Ms.No.25 MA&UD Dept., తేది: 28.01.2026)
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం, 2008 (చట్టం నెం. 8 ఆఫ్ 2008)లోని సెక్షన్ 15లోని సబ్-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, ప్రభుత్వం G.O.Ms.No.538, MA&UD తేది:29-10-2001 ద్వారా ఆమోదించబడిన, నోటిఫై చేయబడిన సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ (CDA) మాస్టర్ ప్లాన్‌లో నిర్దేశించిన భూ వినియోగానికి ఈ క్రింది మార్పును చేస్తుంది.
G.O.Ms.No.538, MA&UD తేది:29-10-2001 ద్వారా ప్రభుత్వం ఆమోదించిన, నోటిఫై చేయబడిన సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ (CDA) మాస్టర్ ప్లాన్ ప్రకారం, గచ్చిబౌలి (గ్రామం), శేరిలింగంపల్లి (మండలం), రంగారెడ్డి (జిల్లా)లోని సర్వే నెం. 136/పి గుండా వెళ్ళే, శిల్పా లేఅవుట్‌ను గచ్చిబౌలి, మియాపూర్ రోడ్డుకు కలిపే సుమారు 1.5 కి.మీ. పొడవు గల ప్రతిపాదిత 36 మీటర్ల వెడల్పు గల మాస్టర్ ప్లాన్ రోడ్డును తొలగించడం.
పై వివరాలు http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయి.
సం/-
చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (RR)
DIPR R.O. No. : 15175-PP/CL/ADVT/1/2025-26, Date: 09-02-2026



## ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

### నల్లగొండ ఎంపి రఘువీర్ రెడ్డి

**ప్రజాపక్షం/హాలియా:** హాలియా మున్సిపాలిటీ రాష్ట్రంలోనే అత్యుత్తమమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం హాలియా మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ నా జన్మ స్థలమైన హాలియా దినదినాభివృద్ధి చెందుతూ మున్సిపాలిటీగా అవతరించిందని చెప్పారు. ప్రస్తుతం నేను నా తమ్ముడు సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి కలిసి హాలియాను రాష్ట్రంలోనే అత్యుత్తమమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులు అందరినీ భారీ మెజార్టీతో గెలిపించి హాలియాను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు తమకు వారదులను అందించాలని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన కొన్ని తప్పిదాల వలన ఈప్రాంతం కొంత వెనుకబాటు స్థానానికి గురి అయిందని తెలిపారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి కొండేటి మల్లయ్య,ఒకటో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గౌని రాజా రమేష్ యాదవ్, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి,కాకునూరు నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ధనమ్మశ్రీనివాస్ గెలుపు అభివృద్ధికి మలుపు



**ప్రజాపక్షం/చండూరు**: సిపిఐ అభ్యర్థి జెల్లా ధనమ్మశ్రీనివాస్ గెలుపు అభివృద్ధికి మలుపు అని ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్ అన్నారు. చండూరు మున్సిపాలిటీలోని 4వ వార్డు అభ్యర్థి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సిపిఐ అభ్యర్థి జెల్లా ధనమ్మశ్రీనివాస్ గెలుపును కాంక్షిస్తూ సోమవారం నేర్లకంటి శ్రీకాంత్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రేస్ పార్టీ బలపర్చిన సిపిఐ అభ్యర్థి జెల్లా ధనమ్మశ్రీనవాస్ కంకి కొడవలి గుర్తుపై అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లును కోరారు. 4వ వార్డులో జెల్లా ధనమ్మ గెలిపించుకుంటే అధికార కాంగ్రేస్ తో వార్డు అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని అన్నారు. వార్డులో ఉన్న డ్రైనేజీ , సిసి రోడ్లు ,ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు వంటి సమస్యలు పరిష్కారమవుతాయని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకుడు మాదగోని అరుణ్ గౌడ్, దోటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు ఓటేస్తే గోసపడుతాం

### మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట** : మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటువేస్తే మరింత గోసపడుతామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. మాజీ సిఎం కెసిఆర్ అన్నట్లుగా మళ్ళీ 2014కు ముందు రోజులు వచ్చాయన్నారు. రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో మీకేమి లాభం జరిగిందో ప్రజలు ఆలోచించాలన్నారు. సోమవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సూర్యాపేట పట్టణంలో బిఆర్ఎస్ భారీ రోడ్డుషో నిర్వహించింది. అనంతరం కొత్తబస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన వేదికపై ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. సిఎం రేవంత్ రెడ్డి ఆయన మంత్రి వర్గమంతా దోచుకునే పనిలో పడ్డారన్నారు. మంత్రుల మధ్య, సిఎం మధ్య సఖ్యత లేక ఒకరి బండారం ఒకరు భయటపెట్టుకుంటున్నారని అన్నారు. వీరి మధ్య పంపకాల పంచాయితీ కాదు రాసలీలల పంచాయితీలు పెట్టుకోవడం మరీ నీచమన్నారు. ఐఏఎస్, ఐపిఎస్ స్థాయి అధికారులపై కూడా అబండాలు వేస్తున్నారని పేర్కొన్నారు. గత పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో సూర్యాపేట పట్టణానికి వేల కోట్ల రూపాయలు తెచ్చి అభివృద్ధి పనులు చేశానని గుర్తు చేశారు. సూర్యాపేటకు మంజూరైన నిధులు వెనక్కి పంపిన దుర్మార్గం కాంగ్రెస్‌దన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి ఇస్లావత్ రాంచంద్రనాయక్‌తోపాటు ఆ పార్టీకి చెందిన పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులు పాల్గొన్నారు.

## సాయి శ్రీ ని గెలిపిస్తే డివిజన్ అభివృద్ధి

**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** 42వ డివిజన్ కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థిగా పబ్బు సాయిశ్రీ సందీప్‌ని గెలిపిస్తే డివిజన్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి అన్నారు.నల్లగొండ మున్సిపాలిటీ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, సిపిఐ పొత్తులో భాగంగా సోమవారం చివరి రోజు పట్టణంలోని 42వ డివిజన్‌లో కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థి పబ్బు సాయి శ్రీ సందీప్ గెలుపు కోసం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి సంపూర్ణ మద్దతు ఇచ్చి ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ కి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.ఈసందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ నల్లగొండ మున్సిపల్ కార్పొరేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ సిపిఐ పొత్తులో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగిందని ఈసందర్భంగా ప్రజల నుండి మంచి స్పందన వచ్చిందని తెలిపారు.ఈడివిజన్ ప్రజలు సాయి శ్రీ కి అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ నాయకులు ముండ్ల ముత్యాలు,పాణెం వెంకట్రావు,నల్ల నరసింహ,కృష్ణ య్య ఎమ్మార్పీఎస్ నాయకులు కత్తుల తులసిదాసు,సైదులు,టి.గిరి,కత్తుల మారయ్య,సముద్రాల రాజు,విషాని, ఆదమ్మ పూలమ్మ,రజిత తదితరులు పాల్గొన్నారు.



# హుజూర్‌నగర్ అత్యద్భుతంగా అభివృద్ధి చేస్తా

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

### అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు





**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 11 జరగనున్న మున్సిపల్, కార్పోరేషన్ ఎన్నికలలో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం జరుగుతుందని, హుజూర్‌నగర్ మున్సిపాలిటీలోని 28 వార్డులలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవనున్నారని హుజూర్‌నగర్ మున్సిపాలిటీని అత్యద్భుతంగా అభివృద్ధి చేస్తానని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రెండవ మున్సిపల్ సాధారణ ఎన్నికలలో భాగంగా సోమవారం హుజూర్‌నగర్ లోని 5వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిని యరగాని సుష్మ మురళిని, 6వ వార్డులో సుత్తికొడవలి నక్షత్రం గుర్తుపై పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్ధి శీలం నాగమణి శ్రీను, 10, 17 వార్డులో కంకి కొడవలి గుర్తుపై పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థులను, హస్తం గుర్తుపై పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మంత్రి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హుజూర్‌నగర్ మున్సిపాలిటిలో మిత్ర పక్షాలైన సిపిఐ, సిపిఎం కాంగ్రెస్ పార్టీల గుర్తులపై పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి తమ వార్డుల అభ్యున్నతికై తోడ్పడాలని అన్నారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలో మంత్రి ఉత్తమ్ చేసిన అభివృద్దిని వివరిస్తూ హుజూర్‌నగర్ మున్సిపల్ పరిధిలోగల అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పట్టణ శివారులో ఉన్న రామస్వామి గుట్టపై నిర్మిస్తున్న ఇందిర మోడల్ కాలనీలోని ఇళ్లను త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, డిసిసి ఉపాధ్యక్షులు ఎస్‌కె మన్సూర్ అలీ, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం పార్టీల నాయకులు, పాల్గొన్నారు.

### కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణ సమగ్ర అభివృద్ధికి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌అభ్యర్థులను గెలిపించాలని భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటి పరిధిలోని 13, 24, 25 వార్డుల అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తాను కోట్లాది రూపాయల నిధులతో పట్టణాన్ని అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. ఈ మూడు వార్డులలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, మంజూరు చేస్తానని భరోసా ఇచ్చారు. 13వ వార్డులో లోవోల్టేజీ విద్యుత్ సమస్యను, మంచినీటి సమస్యను తీరుస్తానని అన్నారు. అలాగే కోదాడలోని ఎర్రకుంట చెరువుకు ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. గ్రీన్ ట్రిబ్యునల్ కింద ఒక ఇళ్లు కూడా తొలగించరని, మంత్రిగా తాను హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌జానీ, అంబటికర శ్రీనివాస్, కందరబోయిన వీరస్వామి, మైసా రాంబాబు, వేలాద్రి, బాలిరెడ్డి, సుందరి వెంకటేశ్వర్లు, గురుమూర్తి, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

**ప్రజాపక్షం/చింతపల్లి** : ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని, గ్రామ అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ధైర్యపురి తండా గ్రామ సర్పంచ్ వాంకుడోత్ అనితదాసు అన్నారు. మండల పరిధిలోని ధైర్యపురి తండా గ్రామంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన గ్రామ ప్రజలు పలు సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, రోడ్డుపై ఉన్న ర్యాంపులను తొలగించాలని వివరించారు. గ్రామంలో మంచినీటి సమస్య లేకుండా చూడాలని, అదే విధంగా నూతన గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించాలని పలు సమస్యలను గ్రామసభ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనితదాసు మాట్లాడుతూ త్వరలో గ్రామపంచాయతీ నూతన భవనాన్ని నిర్మించుకొనుటకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మ, ఉప సర్పంచ్ చందర్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు బిచ్చ నాయక్, బాల్‌సింగ్ వార్డు సభ్యులు షాహెదా, శంకర్, వెంకటయ్య, జ్యోతి, జాంప, సంతోష్, రమేష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# నల్లగొండ అభివృద్ధే నా ధ్యేయం...

### అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రోడ్ షో



**ప్రజాపక్షం/నలగొండ :** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే డివిజన్‌లను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన ధ్యేయమని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల 14,15,16,17,3 డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మంత్రి రోడ్ షో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో ఇంకా మిగిలి ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,సీసీ రోడ్డును పూర్తి చేయడంతో పాటు సమస్యలు లేని కాలనీలుగా తీర్చిదిద్దారని అన్నారు.డివిజన్‌లో ప్రతి కాలనీకి 24 గంటలు తాగునీరు వచ్చే విధంగా ఇప్పటికే చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుందని మరోసారి స్పష్టం చేశారు. ఇతర పార్టీకి చెందిన అభ్యర్థులు గెలిస్తే వారితో ఎలాంటి ప్రయోజనం ఉండదని చర్లపల్లి,ఆర్జాల బావి,పాతపల్లె, శేషమ్మ గూడెం గ్రామాలలో ఎలాంటి సమస్యలు ఉన్న వాటన్నింటినీ పరిష్కరించే బాధ్యత నాదేనని హామీ ఇచ్చారు.ఈ ప్రచార కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బురి శ్రీనివాస్ రెడ్డి, తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి,డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్ పాల్గొన్నారు.



## మమత జ్యోతిబసును గెలిపించండి

**ప్రజాపక్షం/దేవరకొండ:** ఎన్నికలప్పుడు మాత్రమే ప్రజల వద్దకు వచ్చి ఓట్లు అడిగే వ్యాపారులకు కాకుండా నిత్యం ప్రజల్లో ఉండే సిపిఐ 10వ వార్డు అభ్యర్థి జూలూరు మమత జ్యోతిబసు కంకి కొడవలి గుర్తుపై ఓటేసి గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం 10వ వార్డు లో అభ్యర్థి మమత జ్యోతిబసు తో పాటు పార్టీ శ్రేణులతో కలిసి ముమ్మర ప్రచారం నిర్వహించి ప్రశ్నించే గొంతుక సిపిఐ అభ్యర్థి మమత జ్యోతిబసును కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడు ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, సహాయ కార్యదర్శులు జ్యోతిబసు, నగేష్, శివకుమార్, గిరిప్రసాద్, మల్లయ్య, శంశోద్దిన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అధికార పార్టీ అభ్యర్థులనే గెలిపించాలి

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** మున్సిపాలిటీ అన్ని రకాలుగా అభివృద్ధిలో అందలం ఎక్కాలంటే అధికార కాంగ్రెస్ పార్టీ బలపరిచిన చైర్మన్ కౌన్సిలర్ అభ్యర్థుల చేయి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. సోమవారం ఆయన పోచంపల్లి మున్సిపాలిటీలో సుడిగాలి ప్రచారం చేశారు. పోచంపల్లికి కావలసిన అత్యవసర సమగ్ర అభివృద్ధి కొనసాగాలంటే 13 వార్డుల అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి చైర్మన్ పీఠం కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 6వ వార్డు అభ్యర్థి గంజి జయమ్మ గణేష్, 7వ వార్డు అభ్యర్థి మంగళపల్లి లావణ్య రమేశ్‌లతో అన్ని సీట్లను గెలిచి క్లీన్ స్వీట్ చేయాలని ఓటర్లను ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో ఆయన వెంట చైర్మన్ అభ్యర్థి తడక వెంకటేశ్వర్లు, టౌన్ అధ్యక్షులు భారత లవ కుమార్, మండల అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, పోచంపల్లి బ్యాంకు చైర్మన్ రమేష్ పాల్గొన్నారు.

# 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిపిఐ మద్దతు

### సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, కార్పోరేట్ అనుకూల విధానాలను అవలంభిస్తున్న మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం 2025, విబిజిరామ్‌జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్‌బిసిలో 100శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతించడం లాంటి ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర కార్మిక సంఘాలు ఈనెల 12న జరుప తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిపిఐ పార్టీ సంపూర్ణ మద్ధతును తెలియజేస్తుందన్నారు. జిల్లాలో కార్మికులు, ప్రజాసంఘాలు ఈ సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి, యాజమాన్యాలకు లాభం చేకూర్చేలా ప్రమాదకరమైన 4 లేబర్ కోడ్లను తెచ్చిందన్నారు. వీటి వల్ల కార్మికులు ఈఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటి, పెన్షన్ వంటి సామాజిక భద్రతకు దూరమవుతారన్నారు. ఉద్యోగ భద్రత ఉండదన్నారు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో కార్మికుల పనిగంటలు పెంచుతూ చట్ట సవరణ జరిగిందని చెప్పారు. వీబీజిరామ్‌జీ చట్టం తెచ్చి కేంద్రం తన బాధ్యతల నుండి తప్పుకుంటుందని అన్నారు. బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గింపు, పని రోజులు తగ్గిస్తోందని తెలిపారు. విద్యుత్ సవరణ బిల్లు వల్ల సామాన్యులకు విద్యుత్ చార్జీలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, నాయకులు చామల అశోక్ కుమార్, అనంతుల మల్లేశ్వరి, బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్, దేశగాని హేమలత పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో 'పైళ్ల' మార్క్ పాలిటిక్స్





**ప్రజాపక్షం/యాదాద్రి** : రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతున్న భువనగిరి, పోచంపల్లి మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ రెండు మున్సిపాలిటీలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ సీనియర్ నేత పైళ్ల శేఖర్ రెడ్డి సారథ్యంలో గులాబీ దళం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. అభ్యర్థుల ఎంపిక నుంచి క్షేత్రస్థాయి ప్రచారం వరకు అన్నీ తానై వ్యవహరిస్తూ, పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ఆయన చేస్తున్న వ్యూహరచనలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. భువనగిరి నియోజకవర్గ గడ్డపై గులాబీ జెండాను రెపరెపలాడించేందుకు శేఖర్ రెడ్డి 'డబుల్ ఇంజన్' వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. కేవలం బిఆర్ఎస్ బలంపైనే కాకుండా, సిపిఐ, సిపిఐఎం ని కలుపుకొని కూటమిగా ఏర్పడి అధికార పార్టీ కాంగ్రెస్ కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. గత తొమ్మిదేళ్లలో చేసిన అద్భుత అభివృద్ధిని ఆయుధాలుగా చేసుకుని శేఖర్ రెడ్డి కాంగ్రెస్కు సవాల్ విసురుతున్నారు.

**క్షేత్రస్థాయిలో 'పైళ్ల' వ్యూహరచన :** భువనగిరిలోని 35 వార్డులు, పోచంపల్లిలోని 13 వార్డుల్లో కూటమి అభ్యర్థులను గెలిపించే బాధ్యతను శేఖర్ రెడ్డి తన భుజస్కంధాలపై వేసుకున్నారు. కాంగ్రెస్ ఎత్తులను చిత్తు చేస్తూ, గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భువనగిరి పోచంపల్లి పట్టణాల్లో చేసిన అభివృద్ధిని, ఇంటింటికీ అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఆయన ప్రచారంలో దూసుకుపోతున్నారు.

**చతురతతో కూడిన రాజకీయ వ్యూహం:**

**సీపీఐ, సీపీఎంలతో పొత్తు**

పైళ్ల శేఖర్ రెడ్డి కేవలం అభివృద్ధిపైనే కాకుండా, క్షేత్రస్థాయి రాజకీయ సమీకరణాలను చక్కదిద్దడంలోనూ తన మార్క్ చూపించారు.

సీపీఐ, సీపీఎం పార్టీలతో పొత్తు పెట్టుకుని, ఉమ్మడి శక్తితో ఎన్నికల బరిలోకి దిగారు. వామపక్షాల మద్దతుతో క్షేత్రస్థాయిలో క్యాడర్ను ఏకం చేస్తూ, ఓట్లు చీలనివ్వకుండా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఈ కూటమి కలయిక బిఆర్ఎస్కు భారీ ప్లస్ పాయింట్గా మారింది.

**హోరాహోరీ పోరు -కాంగ్రెస్ ఉక్కిరి బిక్కిరి :** భువనగిరిలోని 35 వార్డులు, పోచంపల్లిలోని 13 వార్డుల్లో ప్రతి ఓటరును స్వయంగా కలుస్తూ ప్రచార హోరును పెంచారు. పైళ్ల శేఖర్ రెడ్డి దూకుడును తట్టుకోలేక అధికార కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను, ముఖ్యంగా మంత్రి సీతక్క వంటి వారిని ప్రచారానికి రప్పించాల్సి వచ్చింది. ఇది పైళ్ల సృష్టించిన రాజకీయ ఒత్తిడికి నిదర్శనంగా కనిపిస్తోంది.

# వేధింపులు ఎక్కువై... బతుకు భారమై

### తనతోపాటు, తను కన్న బిడ్డలపై డీజిల్ పోసి నిప్పంటించిన గృహిణి

### మంటలు అంటుకొని గృహిణి, చిన్నారులకు తీవ్ర గాయాలు





**ప్రజాపక్షం/చింతపల్లి :** అత్తవారింటి వరకట్న వేధింపులతోపాటు శారీరక, మానసిక వేధింపులు తాళలేక ఓ గృహిణి డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతోపాటు, ఆమే కన్న బిడ్డలపై డీజిల్ పోసి నిప్పంటించిన హృదయవిదారక సంఘటన మండల పరిధిలోని హోమంతాలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికి ఎస్ఐ ఎమ్ రామ్మూర్తి, బాధితురాలి బంధువుల తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తక్కళ్ళపల్లి గ్రామానికి చెందిన గొడ్డటి లాలయ్య కుమార్తె శిరీషను హోమంతాలపల్లి గ్రామానికి చెందిన జబ్బు లక్ష్మయ్య పెద్ద కుమారుడైన జబ్బు శీనయ్యకు గత నాలుగు సంవత్సారాల క్రితం ఇచ్చి వివాహం చేయటం జరిగింది. కాల క్రమేనా శిరీష, శీనయ్య దంపతులకు రెండున్నర సంవత్సరాల మగబిడ్డ చర్రి, ఏడు నెలల ఆడబిడ్డ పప్పి సంతానం కలిగారు. వివాహ సమయంలో అనుకున్నంతా కట్నం శీనయ్యకు అప్పజెప్పటం జరిగింది. అయినా సంతృప్తి చెందని శీనయ్యతోపాటు అతని కుటుంబ సభ్యులు పలుమార్లు అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని శిరీష తన తండ్రికి తెలపగా, ఆయన నచ్చజెప్పి అత్తారింటికి పంపడం జరిగిందని ఆమె తండ్రి తెలిపారు. అయినప్పటికీ భర్త కుటుంబ సభ్యుల వేధింపులు తారాస్థాయికి చేరడంతో బాధ భరించలేని శిరీష సోమవారం ఉదయం తన ఇంటి ముందు ట్రాక్టర్‌లో డీజిల్ తీసి తనపై పోసుకోవడంతోపాటు, తన బిడ్డలయిన చర్రి, పప్పిలపై డీజిల్ పోసి నిప్పంటించింది. మంటలు తాలలేక తల్లి, చిన్నారులు తీవ్రంగా అరవడంతో చుట్టుపక్కల వారు గమనించి మంటలు ఆర్పి, వారిని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శిరీషతోపాటు చిన్నారులకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని ఓ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. బాధితురాలి భర్త శీనయ్య, అత్తమామా, మరిది, ఆడబిడ్డలపై శిరీష తండ్రి గొడ్డటి లాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

# 'సర్' ప్రక్రియకు అడ్డంకులు రానివ్వం

అవసరమైతే ఆదేశాలు జారీ చేస్తాం: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** బెంగాల్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక స మగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై నెలకొన్న వి వాదాల వేళ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎస్ఐఆర్ ప్రక్రియను ఎవరూ అడ్డుకోవడానికి అ నుమతించబోమని, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలు సహించబోమని అత్యున్నత న్యాయస్థానం హెచ్చరించింది. ఆ విషయంలో అవసరమైతే తగిన ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొంది. సిజెఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ ఎన్‌వీ అంజారియా నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై కోర్టు విచారణ జరిపింది. ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా పెద్ద ఎత్తున ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదం ఉందని, అర్హులైన ఓటర్లు తమ హక్కు కోల్పోయే అవకాశముందని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారీగా ఓట్ల తొలగింపు జరగొచ్చన్న అభిప్రాయాన్ని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన సిజెఐ, ఎస్ఐఆర్ ప్రక్రియకు ఎటువంటి అడ్డంకి రానివ్వమని, ఇది రాష్ట్రాలన్నీ గమనించాలని స్పష్టం చేశారు.

**డిజిపికి కోర్టు ఆదేశాలు**

విచారణ సందర్భంగా ఎన్నికల సంఘం (ఇసి) సమర్పించిన అఫిడవిట్‌ను కోర్టు పరిశీలించింది. ఎన్నికల అధికారులు జారీ చేసిన నోటీసులను కొందరు దుండగులు కాల్చివేశారని ఇసి ఆరోపించింది. ఇప్పటివరకు ఆ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని కూడా తెలిపింది. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆ విషయంపై వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని బంగాల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి)కు కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**అధికారుల చేతుల్లోనే!**

కేంద్ర ప్రభుత్వ తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ 'భారత రాజ్యాంగం దేశంలోని అన్ని రాష్ట్రాలకు సమానంగా వర్తిస్తుంది. ఎన్నికల ప్రక్రియను ఎవరూ దెబ్బతీయకూడదు' అని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సహకారం అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఇక, ఎస్ఐఆర్ ప్రక్రియలో సహాయంగా ఉపయోగించేందుకు బంగాల్ ప్రభుత్వం 8,505 గ్రూప్‌బి అధికారుల జాబితాను ఎన్నికల సంఘానికి అందజేసింది. వీరికి శిక్షణ ఇచ్చి అవసరమైన చోట వినియోగించవచ్చని కోర్టు సూచించింది. అయితే తుది నిర్ణయాలు మాత్రం ఎన్నికల రోల్ అధికారుల చేతుల్లోనే ఉంటాయని బెంచ్ స్పష్టం చేసింది. ఈ అధికారుల పనితీరు, బాధ్యతలు ఎలా ఉండాలన్నది ఎన్నికల సంఘమే నిర్ణయిస్తుందని తెలిపింది. మమతా బెనర్జీ తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్, మైక్రో అబ్జర్వర్ల నియామకం, పెద్దఎత్తున ఓటర్ల తొలగింపు వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. 'మాకు మాస్ ఎక్స్‌క్లూజన్ అస్సలు వద్దు. అర్హులైన ఓటరు ఒక్కరూ కూడా నష్టపోవద్దు' అని ఆయన కోర్టును కోరారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా సాగాలని పేర్కొంది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, దానిని కాపాడటం అందరి బాధ్యత అని వ్యాఖ్యానించింది. ఒకవేళ ఎక్కడైనా అవకతవకలు జరిగితే తక్షణమే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. మొత్తంగా చూస్తే, ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నది సుప్రీంకోర్టు స్పష్టమైన సందేశంగా మారింది.

# నరవణే పుస్తకంపై మోదీలో వణుకు

- అందుకే మోదీ లోక్‌సభకు రాలేదు
- ప్రధానిని బెదిరించేందుకు విపక్ష ఎంపిలు ప్లాన్ చేశారనేది అబద్ధం
- అలాంటి ఎంపిలను అరెస్టు చేయించి ఉండాల్సింది : రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ :** నరేంద్ర మోదీ రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు సమాధానం ఇవ్వడానికి విముఖత చూపుతూ లోక్‌సభకు రాకుండా డుమ్మా కొట్టారని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సోమవారం ఆరోపించారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే పుస్తకం అంశానికి భయపడే రాలేదన్నారు. సభ్యుల నుంచి ప్రమాదం ఉందన్న కారణంగానే మోదీ సభకు రాకుండే ఉండి ఉంటే... మోదీని బెదిరించిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయగలరా అని సవాల్ విసిరారు. అమెరికా ఒప్పందం, అది జరిగిన తీరు, దాని వల్ల రైతులపై పడే ప్రభావం వంటి అంశాల కారణంగా బడ్జెట్‌పై చర్చకు ప్రభుత్వం భయపడుతోందని ఆయన విమర్శించారు. సభ్యులు ప్రధానిని బెదిరించబోతున్నారని ప్రచారం చేస్తున్న ఈ ఆలోచనపై తాము చాలా కలత చెందామని, అయితే అలాంటి ప్రశ్నే లేదన్నారు. ప్రధానమంత్రి సభ్యుల వల్ల ముప్పుందని కాదు, తాను చెబుతున్న విషయాలపై జవాబు చెప్పేందుకు ధైర్యం లేకే సభకు రావడం లేదన్నారు. ఆయన ఇప్పటికీ భయపడుతున్నారని, ఎందుకంటే ఆయన సత్యాన్ని ఎదుర్కోలేరని రాహుల్ ఎద్దేవా చేశారు. 'మేము ఈ విషయాలను చెప్పడానికి అనుమతిస్తారని, ఆ తర్వాత చర్చ జరగాలని ఒప్పందం కుదిరింది' అని ఆయన అన్నారు. చర్చ జరగాలని ప్రతిపక్షం చాలా ఆసక్తిగా ఉందని రాహుల్‌గాంధీ చెప్పారు. 'కానీ ప్రభుత్వం ఏమి చెబుతుందో చూద్దాం. నా వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం, చర్చకు ప్రభుత్వం భయపడుతోంది. ప్రధాని సభకు రాలేదు. మేము చెప్పేదానికి ఆయన భయపడ్డారు, మొదటి అడుగుగా నరవణే పుస్తకాన్ని ఆయనకు అందించడానికి భయపడ్డారు' అని గాంధీ అన్నారు. 'నా అంచనా ప్రకారం, బడ్జెట్‌పై చర్చకు ప్రభుత్వం ఆందోళన చెందుతోంది, ఎందుకంటే అమెరికా ఒప్పందం, అది జరిగిన తీరు, మన రైతులపై దాని ప్రభావం వంటి అంశాలపై చర్చ జరగబోతోంది, ప్రభుత్వం అది జరగాలని కోరుకోవడం లేదు' అని ఆయన అన్నారు. నరవణే పుస్తకం విషయం వెలుగులోకి వచ్చినప్పుడు కొన్ని రోజుల క్రితం ఈ విషయం ప్రారంభమైందని గాంధీ చెప్పారు. 'నేను దాని గురించి మాట్లాడకూడదని ప్రభుత్వం కోరుకుంది. అందుకే వారు సభను అడ్డుకున్నారు. వారు నన్ను మాట్లాడనివ్వలేదు. ఇలా 34 సార్లు జరిగింది. మొదట, నేను ఒక పుస్తకాన్ని ఉటంకించకూడదని వారు అన్నారు, అప్పుడు నేను ఒక పుస్తకాన్ని ఉటంకించడం లేదని, ఒక పత్రికను ఉటంకిస్తున్నానని చెప్పాను. అప్పుడు వారు మీరు ఒక పత్రికను కూడా ఉటంకించకూడదని అన్నారు. అప్పుడు నేను దాని గురించి మాట్లాడతానని చెప్పాను. నేను దాని గురించి మాట్లాడటం వారికి ఇష్టం లేదు' అని ఆయన అన్నారు. నరవణే పుస్తకం ప్రచురించబడలేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తప్పుడు వాదన చేశారని రాహుల్ ఆరోపించారు. ఆ పుస్తకం ప్రచురించబడిందని, తాను ప్రతి రూడా లభించిందన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో ప్రతిపక్ష నాయకుడిని, మొత్తం ప్రతిపక్షాన్ని మాట్లాడనివ్వకపోవడం ఒక పెద్ద సమస్య. వారి సభ్యులలో ఒకరు పుస్తకాలను ఉటంకిస్తూ నీచమైన విషయాలు మాట్లాడారు, కానీ దాని గురించి ఏమీ అనలేదు. వారు ఎప్పుడు కావాలంటే అప్పుడు ఏది కావాలంటే అది చెప్పగలరు, కానీ ప్రతిపక్షం చెప్పకూడదనే విషయం మాకు నచ్చలేదు'అని ఆయన అన్నారు. కాంగ్రెస్ సభ్యుల సస్పెన్షన్, ప్రధానమంత్రిపై దాడి చేయాలనుకుంటున్నారనే వారిపై ఉన్న ఆరోపణలను చర్చించాల్సిన అంశాలుగా గాంధీ పేర్కొన్నారు.

**స్పీకర్ బిర్లాతో రాహుల్‌గాంధీ భేటీ**

ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సోమవారం కొంతమంది ప్రతిపక్ష నాయకులతో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. సభలో తాను లేవనెత్తాలనుకుంటున్న సమస్యల గురించి ఆయనకు తెలియజేశారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చ ప్రారంభమయ్యే ముందు మాట్లాడటానికి తనను అనుమతించాలన్న గాంధీ డిమాండ్‌పై ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్టంభన నెలకొనడంతో లోక్‌సభ కార్యకలాపాలు మరుసటి వాయిదా పడిన తర్వాత, కొన్ని నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశం జరిగింది. ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపిల సస్పెన్షన్ సమస్యను, మహిళా ఎంపిలపై చేసిన ఆరోపణలతో సహా పార్లమెంటుకు సంబంధించిన ఇతర సమస్యలను లేవనెత్తాలనుకుంటున్నట్లు రాహుల్‌గాంధీ స్పీకర్‌కు చెప్పారని వర్గాలు తెలిపాయి. గత వారం సభలో బిర్లా మాట్లాడుతూ, చాలా మంది కాంగ్రెస్ సభ్యులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సీటు వైపు వెళ్లి 'ఊహించని చర్య'కు పాల్పడవచ్చని తన వద్ద కచ్చితమైన సమాచారం ఉందని, అందుకే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చకు సమాధానం ఇవ్వడానికి ఆయన సభకు రాకూడదని తాను అభ్యర్థించానని పేర్కొన్నారు. స్పీకర్‌తో గాంధీ సమావేశమైనప్పుడు టిఎంసి నాయకుడు అభిషేక్ బెనర్జీ, డిఎంకె నాయకుడు టి.ఆర్. బాలు, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్ కూడా ఆయనతో పాటు ఉన్నారు. ప్రతిష్టంభనను ముగించడానికి లోక్‌సభకు చెందిన ఎనిమిది మంది ప్రతిపక్ష ఎంపిల సస్పెన్షన్‌ను రద్దు చేయాలని ప్రతిపక్ష నాయకులు స్పీకర్‌ను కోరారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం. నరవణే జ్ఞాపకాల పుస్తకంలోని కొన్ని భాగాలపై ఆధారపడిన ఒక వ్యాసం నుండి ఉటంకించడానికి గాంధీని సభాపతి అనుమతించకపోవడంతో ఈనెల 3 నుండి లోక్‌సభలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఆ వ్యాసంలో ఆయన 2020 నాటి భారత్-చైనా సంఘర్షణ గురించి ప్రస్తావించారు.



# శరద్ పవార్‌కు అస్వస్థత : ఆస్పత్రిలో చేరిక



**పుణె :** ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ అస్వస్థతకు గురయ్యారు. గత కొన్ని రోజులుగా ఆయన గొంతునొప్పి, దగ్గుతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే కుటుంబ సభ్యులు ఆయన్ను పుణెలోని రూబీ ఆస్పత్రికి తరలించారు. శరద్ పవార్ కొన్ని రోజులుగా గొంతునొప్పితో బాధపడుతున్నారని ఆయన సన్నిహితుడు తెలిపారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ పర్వేజ్ నేతృత్వంలోని బృందం శరద్ పవార్‌కు చికిత్స అందిస్తోంది. మరిన్ని వివరాలను తర్వాత వెల్లడిస్తామని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. 'శరద్ పవార్‌కు ముందుగా దగ్గు కోసం పరీక్షలు నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆయన్ను ఆసుపత్రిలో చేర్చుకోవాలా లేదా డిశ్చార్జ్ చేయాలా అనే దానిపై నిర్ణయం తీసుకుంటారు' అని రూబీ హాల్ క్లినిక్ చీఫ్ కార్డియాలజిస్ట్, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పర్వేజ్ గ్రాంట్ వెల్లడించారు. సోమవారం ఉదయం నుంచి దగ్గు కారణంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉందని పవార్ ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే ఎలాంటి రిస్క్ తీసుకోకూడదనే ఉద్దేశంతో ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపాయి. శరద్ పవార్‌తో ఆయన కుమార్తె, బారామతి పార్లమెంట్ సభ్యురాలు సుప్రియా సూలే కూడా పుణెలోని రూబీ హాల్ ఆసుపత్రికి వెళ్లారు.

# మావోయిజంతో వినాశనమే

మార్చి 31 కల్లా అంతం చేస్తాం: అమిత్ షా



**న్యూఢిల్లీ:** 'మావోయిజం ఏ సమాజానికి ఎప్పుడూ మేలు చేయలేదు. అది అడుగుపెట్టిన ప్రతిచోటా వినాశనం తప్ప అభివృద్ధిని కాంక్షించలేదు. కొలంబియా, పెరూ, కంబోడియా వంటి దేశాల చరిత్రే ఇందుకు నిదర్శనం. అందుకే చెబుతున్నా, మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని సమూలంగా తుడిచిపెడతాం' అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా కేంద్రం జగదల్‌పుర్‌లో సోమవారం జరిగిన 'బస్తర్ పాండుమ్-2026' ముగింపు ఉత్సవాల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ, నక్సల్స్ అంతానికి డెడ్‌లైన్ విధించారు.

**తుపాకీకి తుపాకీతోనే బదులు**


అమిత్ షా తన ప్రసంగంలో మావోయిస్టులకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. 'మేము ఎవరితోనూ యుద్ధం చేయాలనుకోవడం లేదు. మా పోరాటం మా గిరిజన సోదర-సోదరీమణుల రక్షణ కోసమే. కానీ ఎవరైనా చేతిలో ఆయుధం పట్టుకుంటే, వారికి ఆయుధంతోనే సమాధానం చెబుతాం. ఐఇడిలు అమర్చి అమాయక పిల్లల ప్రాణాలు తీస్తున్నారు. పాఠశాలలను, ఆసుపత్రులను తగులబెడుతున్నారు. ఇంతటి క్రూరత్వం ఎక్కడి నుంచి వచ్చింది? సాయుధ పోరాటాన్ని ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేస్తుంది' అని ఆయన తేల్చిచెప్పారు. మావోయిస్టుల వల్ల దశాబ్దాలుగా నష్టపోయిన బస్తర్ ప్రాంతం ఇప్పుడు అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందని షా పేర్కొన్నారు. డిసెంబర్ 2027 నాటికి బస్తర్ ప్రాంతంలోని 7 జిల్లాల్లోని ప్రతి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం అని హామీ ఇచ్చారు. వచ్చే ఐదేళ్లలో దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన గిరిజన ప్రాంతంగా బస్తర్‌ను మారుస్తామన్నారు.

**రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానం**

బస్తర్ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పడమే ప్రధాని మోదీ లక్ష్యమని షా అన్నారు. తుపాకులు, పేలుడు పదార్థాలు బస్తర్ గుర్తింపు కాదని, ఇక్కడి సంస్కృతే అసలైన గుర్తింపు అని ఉద్ఘాటించారు. 'బస్తర్ పాండుమ్' ఉత్సవాల్లోని 12 విభాగాల్లో గెలుపొందిన టాప్3 విజేతలను రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానిస్తామని, అక్కడ వారు తమ కళలను ప్రదర్శించి విందులో పాల్గొంటారని ప్రకటించారు. పోలీసుల త్యాగాలను స్మరిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

# మీరు బిజెపి ఒత్తిడికి లొంగారు

లోక్‌సభ స్పీకర్‌కు కాంగ్రెస్ మహిళా ఎంపిల లేఖ



**న్యూఢిల్లీ :** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ మహిళా ఎంపిలు సోమవారం ఘాటు లేఖ రాశారు. ప్రధాని మోదీ సభకు గైర్హాజరు కావడాన్ని సమర్థించే క్రమంలో, స్పీకర్ తమపై నిరాధార ఆరోపణలు చేశారని అన్నారు. అధికార పార్టీ ఒత్తిడి మేరకే ఆయన ఈ విధంగా చేశారని ఆరోపించారు. సభకు నిష్పక్షపాత సంరక్షకుడిగా వ్యవహరించాలని వారు ఓం బిర్లాను కోరారు. గత గురువారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో చర్చ ప్రారంభించారు. అయితే దీనిపై సమాధానం ఇచ్చేందుకు రావద్దని ప్రధాని మోదీని తాను కోరానని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. ఎందుకంటే, కాంగ్రెస్ సభ్యులు ప్రధాని సీటు వైపు దూసుకొచ్చి, 'కొన్ని ఊహించని అవాంఛనీయ చర్యలకు' పాల్పడే అవకాశం ఉందని తనకు కచ్చితమైన సమాచారం ఉందని ఆయన సభలో చెప్పారు. ఒకవేళ ఎంపిలు ఏదైనా అవాంఛనీయ చర్యలకు పాల్పడి ఉంటే, దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలు తునాతునకలయ్యేవని వ్యాఖ్యానించారు. దీనిపై ప్రియాంక గాంధీ ఘాటు రిప్లై ఇచ్చారు. 'మోదీపై ఎవరైనా దాడి చేస్తారనడం పచ్చి అబద్ధం. ప్రధాని స్పీకర్ వెనుక దాక్కుంటున్నారని' విమర్శించారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ మహిళా ఎంపీలు తాజాగా ఆయనకు లేఖ రాశారు. ఈ లేఖలో ప్రియాంక గాంధీ, జ్యోతిమణి, ఆర్ సుధా, వర్షా గైక్వాడ, జ్యోత్స్నా మహంత్ తదితరులు సంతకాలు చేశారు.

**ఆ భయంతోనే మోదీ గైర్హాజరు**

'మోదీ నేతృత్వంలోని ప్రజా వ్యతిరేక ప్రభుత్వంపై మే ము నిరంతరంగా పోరాడుతున్నాం, ప్రశ్నిస్తున్నాం. అందుకే మమ్మల్ని టార్గెట్ చేస్తున్నారు. ప్ర ధాని సభకు రాకపోవడానికి కారణం మా నుంచి ముప్పు ఉండడం కాదు. కేవలం భయం వల్లనే ఆయన రాలేదు. ప్రధానికి ప్రతిపక్షాలను ఎదుర్కొనే ధైర్యం లేదు. మేము ప్రేమ, శాంతి, రాజ్యాంగ విలువలు, మానవ గౌరవాన్ని నమ్మే కాంగ్రెస్ సభ్యులం. మాకు హింస, బెదిరింపులపై నమ్మకం లేదు. మేము ధైర్యవంతమైన మహిళా ప్రతినిధులం. మేము బెదిరింపులకు భయపడం' అని కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఆ లేఖలో పేర్కొన్నారు.

**రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు!**

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో రాహుల్ గాంధీ మాట్లాడాలని అనుకున్నారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణె రాసిన పుస్తకంలోని అంశాలను ఆయన ప్రస్తావించాలని భావించారు. కానీ గత నాలుగు రోజులుగా ప్రతిపక్ష నేత అయిన రాహుల్‌కు స్పీకర్ మాట్లాడే అవకాశం కల్పించలేదు. దీనిని కాంగ్రెస్ మహిళా ఎంపిలు తీవ్రంగా ఖండించారు. ఇది ఏ విధంగానూ సమర్థించలేని చర్య అని వారు పేర్కొన్నారు.

**స్పీకర్ పక్షపాత ధోరణి**

అధికార పక్షం ఒత్తిడితో స్పీకర్, ఇండియా కూటమికి చెందిన 8 మంది ఎంపిలను సస్పెండ్ చేశారని, కానీ మాజీ ప్రధానులపై అసభ్యకరంగా మాట్లాడిన బిజెపి ఎంపిలపై ఎలాంటి చర్య తీసుకోలేదని కాంగ్రెస్ మహిళా ఎంపిలు ఆరోపించారు. ఈ విషయంపై తాము స్పీకర్‌ను కలిసినప్పుడు, తాను ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూస్తున్నాన్ని చెప్పారని, దీనిని బట్టి ఆయన స్వతంత్ర నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని అర్థమవుతోందని వారు ఎద్దేవా చేశారు. 'స్పీకర్ పదవిపై, స్పీకర్‌పై మాకు వ్యక్తిగతంగా గౌరవం ఉంది. అయితే ఓం బిర్లా నిరంతరం అధికార పార్టీ ఒత్తిడిలో ఉన్నారని స్పష్టమవుతోంది. కష్టకాలంలో సరైన నిర్ణయాలు తీసుకున్న వ్యక్తిగా చరిత్ర మిమ్మల్ని గుర్తుంచుకోవాలి. అంతేకానీ, రాజ్యాంగ విలువలు దెబ్బతీసే వారి ఒత్తిడికి లొంగిపోయిన వ్యక్తిగా ఉండకూడదు. స్పీకర్ పదవి అనేది పార్లమెంట్ గౌరవాన్ని కాపాడడానికి, నిష్పక్షపాతంగా, పార్టీలతో సంబంధం లేకుండా సభ్యులందరి హక్కులను పరిరక్షించడానికి ఉద్దేశించిన రాజ్యాంగబద్ధమైన పదవి అని మహిళా ఎంపిలు తమ లేఖలో పేర్కొన్నారు.

# తెలంగాణ అటవీ శాఖ అభివృద్ధికి జైకా రుణ సహాయం

- 5 సంవత్సరాల కాలానికి రూ.1270 కోట్ల ప్రాథమిక ప్రతిపాదన..
- అటవీ అధికారులతో జపాన్ ప్రతినిధుల భేటీ..




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ అటవీ శాఖను సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జెఐసిఎ) నుంచి రుణ సహాయం పొందేందుకు అటవీ శాఖ ప్రాథమిక ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఈ మేరకు అరణ్యభవన్‌లో అటవీ దళాల ముఖ్య సంరక్షణాధికారి డాక్టర్ సి.సువర్ణ అధ్యక్షతన జపాన్ నుంచి వచ్చిన జైకా ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా డాక్టర్ సువర్ణ తెలంగాణ రాష్ట్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలపై జైకా ప్రతినిధులకు వివరించారు. పచ్చదనం పెంపు లక్ష్యంగా వనమహోత్సవం కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే జైకా ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధి, టైగర్ రిజర్వ్‌ల బలోపేతం, వన్యప్రాణి సంరక్షణ, అర్బన్ ఫారెస్ట్ డెవలప్మెంట్, విస్తృత ప్లాంటేషన్ కార్యక్రమాలు, క్షీణించిన అడవుల పునరుద్ధరణ, అటవీ అగ్నిప్రమాదాల నివారణ వంటి పలు కీలక కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు నిర్ణయించారు. జైకా సహకారంతో 5 సంవత్సరాల కాలానికి రూ.1270 కోట్ల విలువైన ప్రాథమిక ప్రతిపాదనను సిద్ధం చేశారు. మొత్తం వ్యయంలో 85 శాతం నిధులను జైకా నుంచి రుణ రూపంలో, మిగిలిన 15 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలని ప్రతిపాదనలో పొందుపరిచారు. ఈ సందర్భంగా జైకా ప్రతినిధులు మాట్లాడుతూ, భారత్-జపాన్ ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే దిశగా ప్రస్తుతం భారత్‌లోని పది రాష్ట్రాల్లో అటవీ రంగానికి సంబంధించిన ప్రాజెక్టులను జైకా అమలు చేస్తోందని వారు తెలిపారు. తెలంగాణ అటవీ శాఖ ప్రతిపాదించిన అభివృద్ధి కార్యక్రమాలు సమగ్రంగా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉన్నాయని ప్రశంసించారు. డాక్టర్ సి. సువర్ణ మాట్లాడుతూ..ప్రస్తుత పరిస్థితుల్లో జైకా ప్రాజెక్ట్ అటవీ శాఖకు అత్యంత అవసరం. గతంలో ప్రపంచ బ్యాంకు సహకారంతో వచ్చిన నిధులను మా శాఖ విజయవంతంగా అమలు చేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం క్యాంపా నిధులు తగ్గుతున్న నేపథ్యంలో, జైకా వంటి అంతర్జాతీయ సహకార ప్రాజెక్టులు అటవీ శాఖ అభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి అని పేర్కొన్నారు. అటవీ రంగాన్ని ఆధునికీకరణ దిశగా తీసుకెళ్లడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ఈ జైకా సహకారం కీలక పాత్ర పోషించనుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా జైకా ప్రతినిధులను తెలంగాణ ప్రభుత్వం తరఫున అటవీ శాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో జైకా ప్రతినిధులు ఇహాచినాట్సు, షిమోజో హిటోమీ , జైకా భారతీయ ప్రతినిధి సిద్ధార్థ్ పరమేశ్వరన్,అటవీశాఖ అధికారులు వినయ్ కుమార్, రత్నాకర్ జౌహరి, ప్రియాంక వర్గీస్, ఎస్.జె. ఆశ, క్షితిజతో పాటు ఆయా జిల్లాల ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

# 111 ఏళ్ల జాన్ మోరిస్ ఫైర్ ఇంజిన్‌కు జాతీయ స్థాయి గౌరవం

స్టేట్స్‌మన్ వింటేజ్ ర్యాలీలో రెండు ప్రతిష్టాత్మక ట్రోఫీలు





**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే లాలాగూడ వర్క్‌షాప్ సిబ్బంది అంకితభావానికి మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. 111 ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన 'జాన్ మోరిస్ ఫైర్ ఇంజిన్ 2026'లో నిర్వహించిన 59వ స్టేట్స్‌మన్ వింటేజ్, క్లాసిక్ కార్ ర్యాలీలో రెండు ప్రతిష్టాత్మక ట్రోఫీలను గెలుచుకుని దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది.ఈ నెల 8న న్యూఢిల్లీలో జరిగిన ఈ ర్యాలీలో, స్టేట్స్‌మన్ భవనం నుంచి గ్రేటర్ నోయిడా మీదుగా జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వరకు సుమారు 90 కిలోమీటర్ల దూరం ప్రయాణించిన జాన్ మోరిస్ ఫైర్ ఇంజిన్, తన అరుదైన వారసత్వ విలువతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా వాహనానికి 'ఇండియన్ ఆయిల్ హెరిటేజ్ ప్రిజర్వేషన్ ట్రోఫీ','ఆటోమోటివ్ ట్రస్ట్ బ్రిటిష్ హెరిటేజ్ ప్రిజర్వేషన్ ట్రోఫీ'లతో సత్కారం లభించింది. 1914లో తయారైన ఈ ఫైర్ ఇంజిన్‌ను అప్పట్లో హైదరాబాద్‌లోని హెచ్ఇహెచ్ నిజాం స్టేట్ రైల్వే వినియోగించింది. ప్రస్తుతం ఇది న్యూఢిల్లీలోని నేషనల్ రైల్ మ్యూజియంలో ప్రముఖ ప్రదర్శనగా ఉంది. ప్రపంచంలోనే అరుదైన ఫ్రూస్‌బరీ, ఛాలెంజర్ సాలిడ్ టైర్లు, ఒరిజినల్ అ గ్నిమాపక పరికరాలు, అజాక్స్ గన్ మెటల్ ట్విన్ పంప్ వంటి అసలైన భాగాలతో ఇప్పటికీ సురక్షితంగా నిలిచిన ఏకైక ఫైర్ ఇంజిన్‌గా దీనికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ చారిత్రక వాహనాన్ని అద్భుతంగా సంరక్షిస్తున్నది మాత్రం సికింద్రాబాద్ రైల్వే లాలాగూడ క్యారేజ్ వర్క్‌షాప్ సాంకేతిక బృందమే. వారి నైపుణ్యం, అంకితభావమే ఈ విజయానికి మూలకారణంగా నిలిచింది. రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్ జాన్ మోరిస్ ఫైర్ ఇంజిన్‌ను పరిశీలించి లాలాగూడ వర్క్‌షాప్ సిబ్బందికి రూ.50,000 నగదు బహుమతి ప్రకటించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ కూడా వర్క్‌షాప్ బృందాన్ని అభినందిస్తూ, జాన్ మోరిస్ ఫైర్ ఇంజిన్‌కు జాతీయ స్థాయిలో వచ్చిన గుర్తింపు దక్షిణ మధ్య రైల్వేకు గర్వకారణం అని పేర్కొన్నారు.వారసత్వ సంపద సంరక్షణలో లాలాగూడ వర్క్‌షాప్ మరోసారి దేశానికి ఆదర్శంగా నిలిచిందని రైల్వే వర్గాలు వెల్లడించాయి.

# 54వ అఖిల భారత అంతర్-రైల్వే జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో దక్షిణ మధ్య రైల్వే అద్భుత విజయం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కోల్‌కతాలో ఈ నెల 4 నుంచి 6 వరకు నిర్వహించిన 54వ అఖిల భారత అంతర్-రైల్వే జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ (పురుషులు మహిళలు) లో దక్షిణ మధ్య రైల్వే జట్టు అద్భుత విజయాన్ని సాధించింది. ఈ పోటీల్లో ఎస్‌సిఆర్ జట్టు స్వర్ణం, వెండి, మూడు కాంస్య పతకాలు సాధించి ఘన విజయాన్ని నమోదు చేసింది. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సోమవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ క్రీడాకారులను అభినందిస్తూ, కఠిన శ్రమ, క్రీడాస్ఫూర్తి, నిబద్ధతను ప్రశంసించారు.

# జీవితంలో ఏదీ సులువుగా ఉండదు..



పరీక్షా పే చర్చలో విద్యార్థులతో మోదీ

**న్యూఢిల్లీ :** సాంకేతికత మనం పనిచేసే విధానాన్ని మారుస్తుందని, దాన్ని అర్థం చేసుకుని అవసరానికి తగినట్లుగా వినియోగించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. అంతేగానీ సాంకేతికతే మిమ్మల్ని బానిసలుగా మార్చుకునే పరిస్థితికి వెళ్లొద్దని సూచించారు. 'పరీక్షా పే చర్చ' రెండో ఎడిషన్‌లో భాగంగా పలువురు విద్యార్థులతో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా కెరీర్ పురోగతికి సంబంధించి వారికి విలువైన సూచనలు చేశారు. విద్యార్థులు వెలిబుచ్చిన సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. క్రమశిక్షణ, ప్రేరణ ఈ రెండింటిలో ఏది ముఖ్యం..? అన్న ప్రశ్నకు.. ఆ రెండింటినీ పోల్చకూడదని అన్నారు. ఎంత స్ఫూర్తి పొందినా ఆచరణలో క్రమశిక్షణ లేకపోతే సత్ఫలితాలు పొందలేరని అన్నారు. సమయపాలన, స్థిరత్వం, స్వీయ క్రమశిక్షణే మన ప్రేరణను అర్థవంతమైన ఫలితాలుగా మారుస్తుందని చెప్పారు. ఎఐతో ఉద్యోగాలు పోతాయన్న భయాలు నిజమేనా..? అన్న ప్రశ్నకు సాంకేతికత మన పనితీరును మెరుగుపరుస్తుందని చెప్పారు. దాన్ని సరిగ్గా వినియోగించుకుంటే ఎఐకి విద్యార్థులు భయపడాల్సిన పనిలేదన్నారు. టెక్నాలజీతో ఎలా పనిచేయాలన్నది నేర్చుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. జీవితంలో ఏదీ సులువుగా ఉండదన్నారు. విద్యార్థులకు ఐదు ట్రావెల్ డెస్టినేషన్స్ చెప్పండి..? అని అడుగగా.. ముందు మన సొంత ప్రాంతాలపై దృష్టిపెట్టాలని చెప్పారు. మన జిల్లా, నగరం, రాష్ట్రంలో ఉన్న ముఖ్యమైన ప్రాంతాల జాబితాను రాసుకోవాలన్నారు. ఆ తర్వాత ఎక్కడికి వెళ్లాలో ఎంచుకోవాలని చెప్పారు. అనంతరం మన సమీపంలో ఉన్న ప్రాంతాల విశిష్టతను తెలుసుకుంటే, అది భవిష్యత్తులో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. మంచి నాయకుడిగా ఎలా మారాలి..? అన్న ప్రశ్నకు మన విధివిధానాలకు ఎన్నటికీ భయపడకూడదని చెప్పారు. విధేయత, నిబద్ధతతో పనిచేయాలన్నారు. నిలకడగా సరైన పని చేయడమే నిజమైన నాయకత్వమని చెప్పారు. లీడర్‌షిప్‌నకు ముఖ్యమైన లక్షణం మీ ఆలోచనలను కనీసం 10 మందికైనా స్పష్టంగా తెలియజేయగలడమని అన్నారు.

# మున్సిపోల్స్‌కు రంగం సిద్ధం

తెలంగాణ రాష్ట్రంలో నిర్ణీత పరిపాలనాకాలం ముగిసిన 116 పురపాలక సంఘాలు, 7 పురపాలక కార్పొరేషన్‌లకు ఈనెల 11(బుధవారం) నిర్వహిస్తున్న పోలింగ్‌కు రాజకీయ పక్షాల ప్రచారానికి సోమవారం సాయంత్రం 5గంటలకు తెరపడింది. అయితే ఇంటింటికీ ప్రచారం, ఓటుకు నోటు, ఇతర ప్రలోభాల పంపిణీ, చాటుమాటు బేరసారాలు ఇప్పుడే మొదలవుతాయి. ఓటర్లను ప్రభావితం చేసే ఈ అవినీతి పద్ధతులకు అడ్డుకట్టపడాలంటే పోలీసు యంత్రాంగం మాత్రమే సరిపోదు. రాజకీయ పార్టీల కార్యకర్తలు పరస్పరం నిఘా పాటించటం అవసరం. పోటీలోని ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి తరపున చైర్మన్ క్యాండిడెట్లు లేదా పార్టీల హంగుదారులు ఓటర్లను ప్రలోభపెట్టటంలో పోటీపడటం స్థానిక ఎన్నికల్లో సహజ ప్రక్రియగా సాగుతున్నందున పరస్పర నిఘాతో అవినీతిని అరికట్టాలనుకోవటం పేరాశే అవుతుంది. వర్థిల్లుతున్న ప్రజాస్వామ్య వ్యవస్థలో మూడవ దొంతర పాలనా వ్యవస్థ అయిన స్థానిక సంస్థల్లో (పంచాయతీరాజ్, మున్సిపల్) ప్రజలెన్నుకున్న పాలకవర్గాల పాలన ఎప్పుడూ ఆహ్వానించదగిందే.

**తెలంగాణ రాష్ట్రంలో ఇవి రెండవ దఫా పురపాలక ఎన్నికలు. తొలి ఎన్నికలను అప్పటి అధికార పార్టీ టిఆర్ఎస్ స్వీప్ చేసింది – ఇప్పుడు మనుగడకు ప్రాకులాడుతోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం మాదే అంటున్న బిజెపి ఈ ఎన్నికల్లో బలపరీక్ష చేసుకుంటోంది. పాలక కాంగ్రెస్ పార్టీ తమ రెండేళ్ల పాలన ఫలితాలను వివరిస్తూ అత్యధిక మెజారిటీ పురపాలికలపై జెండా ఎగురవేయగలమన్న ధీమాతో ఉంది. ఇక ఓటరు దేవుళ్లదే నిర్ణయం!**

73,74 రాజ్యాంగ సవరణలు ఆ సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించాయి. పార్లమెంటు, అసెంబ్లీల వలె స్థానిక సంస్థలకు కూడా ఐదేళ్ల పదవీకాలం ముగిసేలోపు విధిగా ఎన్నికలు జరపాలని ఆ సవరణ చట్టాలు నిర్దేశించాయి. అయితే రిజర్వేషన్‌లు వంటి అంశాల నిర్ణయాధికారం రాష్ట్ర ప్రభుత్వాల చేతిలో ఉన్నందున పాలకపార్టీల అనుకూలతలనుబట్టే ఎన్నికల నిర్ణయం జరుగుతోంది. ఇది వాంఛనీయం కాదు.

2014 లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన దరిమిలా పదేళ్లపాటు రాష్ట్రాధికారంతోపాటు స్థానిక సంస్థల పాలన కూడా దాదాపు పూర్తిగా టిఆర్ఎస్/బిఆర్ఎస్ చేతిలోనే ఉంది. కాబట్టి గ్రామాలు, పట్టణాల్లో పౌర వసతుల ప్రస్తుత స్థితిగతులకు ఆ పార్టీదే బాధ్యత. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన గ్రామ పంచాయతీల ఎన్నికల్లో 60శాతంపైగా తమ పార్టీకి లభించినట్లు ఆ పార్టీ క్లెయిం చేసింది. అయితే కిందపడినా పైచేయి మాదే అన్నట్లు బిఆర్ఎస్ పల్లెలు తమ పార్టీకే పట్టం కట్టాయని ప్రచారంలో పెట్టింది. బిజెపి గొప్పలకు పోదామన్నా గ్రామీణులు ఆ అవకాశం ఇవ్వలేదు. అందువల్ల ఈ మున్సిపల్ ఎన్నికలపై ఆ పార్టీ ఆశలు పెట్టుకుంది.

ఈ స్థానిక ఎన్నికలకు పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నావిస్‌ను ప్రచారానికి దించింది. రాష్ట్ర నాయకులు అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దూకుడు ప్రదర్శించారు.

ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టులు, ఎంఐఎం, ఇంకా ఇతరులు చెదురుమదురుగా పోటీలో ఉండగా ప్రధాన పోటీ ముఖ్యంగా కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి మధ్య జరుగుతోంది. రాజకీయ పార్టీల గుర్తులపై జరిగే ఈ ఎన్నికల్లో ఫలితాలపై ఎన్ని క్లెయిములకు అవకాశం లేదు. ఏ పార్టీ ఎన్ని వార్డులు, ఎన్ని చైర్మన్, మేయర్ పదవులు దక్కించుకుంటుందో స్పష్టంగా తేలుతుంది. కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను తమ రెండేళ్లపాలనకు గీటురాయిగా తీసుకుంది. ముఖ్యమంత్రి సహా, మంత్రులు, ఎమ్మెల్యేలు నిర్దిష్టమైన బాధ్యతలతో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు.

ముఖ్యమంత్రి స్వయంగా మిర్యాలగూడ, చొప్పదండి, నిజామాబాద్ రూరల్, పరిగి, భూపాలపల్లి బహిరంగసభల్లో ప్రసంగించారు. కాగా తమ పార్టీ పునరుజ్జీవనానికి ఈ ఎన్నికలను ఉపయోగించుకుంటున్న బిఆర్ఎస్ ముమ్మర ప్రచారం చేబట్టింది. రాష్ట్ర కేంద్రంనుంచి వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు, అసెంబ్లీలో పార్టీ ఉపనాయకుడు తన్నీరు హరీష్‌రావు ప్రధానంగా ఉత్తర తెలంగాణా జిల్లాలైన కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, మెదక్ జిల్లాలపై కేంద్రీకరించారు. కాగా కెసిఆర్ కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఫార్వర్డ్‌బ్లాక్ చిహ్నంపై కనీసం ఓ వందమంది అభ్యర్థులను పోటీ చేయించారు.

ఈ ఎన్నికల్లో ప్రచారస్థాయి దిగజారింది. ముఖ్యంగా మూడు ప్రధాన పార్టీల నేతలు స్థానిక అభివృద్ధికి తమ ప్రణాళికలగూర్చి కాకుండా సునాయాసంగా రాజకీయ నిందారోపణలు చేసుకున్నారు. భాష నేలబారుగా సాగింది. అందువల్ల ఓటర్లు అవేవీ పట్టించుకోకుండా, స్థానికంగా అభ్యర్థు ల పూర్వాపరాలు, సమస్యలను పరిష్కరించగల సామర్థ్యం, అభివృద్ధికి దోహదం చేయగల చొరవ తదితర అంశాలను దృష్టిలోకి తీసుకుని సమర్థులకు ఓటు చేయాలి. విత్తనంబట్టేకదా వృక్షం ఫలాలనిస్తుంది. అందువల్ల ఓటు వేసేటపుడు తప్పు నిర్ణయం తీసుకుంటే ఆ తర్వాత చింతించినా నిష్ఫలం.

ఈ ఎన్నికల తదుపరి మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల ఏర్పాటు నిమిత్తం ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల నిర్వహణ పూర్తిచేస్తే స్థానిక సంస్థల్లో ప్రజాస్వామ్యయుతంగా ప్రజాప్రాతినిధ్య పాలన ఏర్పాటు సంపూర్ణమవుతుంది.



## అసోం సిఎంపై చట్టపరంగా ముందుకు

**నాకు, నా భార్యకు పాకిస్థానీ ఏజెంట్ అలీ తౌఖీర్ షేక్‌తో సంబంధాలు ఉన్నాయని అసోం సిఎం హిమంత బిశ్వశర్మ చేసిన వ్యాఖ్యలు పచ్చి అబద్ధం. 2013లో తన పాకిస్థాన్ పర్యటన గురించి సిట్ అధికారులు నన్ను ఎన్నడూ ప్రశ్నించలేదు. ప్రజల మధ్యలో మతపరమైన విద్వేషాలు సృష్టించేందుకు హిమాంత శర్మ ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. తన భార్య, మైనర్ పిల్లలపై అసంబద్ధమైన ఆరోపణలు చేసినందుకుగాను అసోం సిఎం వ్యాఖ్యలపై చట్టపరంగా ముందుకు వెళ్తాం. ఆయన మాట్లాడిన వీడియో ఆధారంగా కేసు నమోదు చేయాలి. నా భార్య ఉద్యోగ సంబంధమైన పనికోసం మాత్రమే పాకిస్థాన్ పర్యటనకు వెళ్లింది.**

– లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్



## వైవిధ్యభరిత వ్యవసాయ ఉత్పత్తులను సాధించలేమా!

అనాదిగా మన సుస్థిర వ్యవసాయ రంగం పప్పుధాన్యాలతో (పల్సెస్) అవినాభావ సంబంధాలను కలిగి ఉంది. చూడడానికి చిన్న సైజులో కనిపించినప్పటికీ పప్పుల్లో విలువైన పోషకాలు, పేదల పల్లెంల్లో చోటు, రుచిరమైన ఆహార పదార్థాలుగా ప్రాధాన్యతతో పాటు నేల సత్తువ పెంచడానికి ఇవి దోహదపడుతున్నాయి. కొంత మేరకు ఖరీదు తక్కువగా ఉంటూ సంపన్నుల నుంచి కడు పేదవాడి వరకు అందరూ పప్పును దాదాపు నిత్యంవాడడం జరుగుతున్నది. లెగ్యూమ్స్‌గా పిలువబడే పప్పుల్లో ముఖ్యమైనవిగా పెసర, కంది, శనగ, మినుములు, బొబ్బర్లు, సోయా బీన్స్ లాంటి పలురకాలు ఉంటాయి.

**పప్పుధాన్యాల ప్రాధాన్యం:** పప్పు ధాన్యాల పలు ముఖ్యమైన ప్రయోజనాలను బట్టి వాటి ఉత్పత్తులను వంటల్లో వాడడం, ప్రోటీన్లకు మూల పోషకాలుగా భుజించడం, కొవ్వులు తక్కువగా ఉండడం, కరిగే స్వభావం కలిగిన పీచు పదార్థాలు ఉండడం కొలెస్టరాల్‌తో పాటు బ్లడ్ షుగర్స్‌ను తగ్గించగల ఉత్తమ పోషకాహారంగా గుర్తిస్తూ, అన్ని వర్గాల కుటుంబాలు వాటి వాడకాన్ని పెంచడానికి ప్రయత్నాలు చేస్తే ఆరోగ్యకరమైన పౌర సమాజం నిర్మితం అవుతుంది. హృదయనాళ సంబంధ, మధుమేహం, స్థూలకాయ అనారోగ్యాలు రాకుండా పప్పులను మన భోజనంలో ఇమడ్చుకోవాలి. పప్పుధాన్యాల వాడకంతో అందులోని ఆంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్, లాంటి ముఖ్యమైన పోషకాలు శరీరానికి అందించబడతాయి. పప్పులు ఉత్తమ ఆహార పదార్థాలే కాకుండా ఆహార పదార్థాల నష్టాలను, ఆహార వ్యర్థాలను తగ్గిస్తాయి.

**ఆహార భద్రత, నేల నాణ్యత పెంపు:** పప్పులను పండించే రైతులు వాటిని తమ ఆహార పదార్థాలుగా తినడమే కాకుండా ఆర్థిక రాబడికి మార్కెటింగ్ కూడా చేస్తూ కుటుంబాల ఆహార భద్రతతో పాటు ఆర్థిక స్థిరత్వానికి కూడా దోహదపడుతున్నాయి. నేలలో నత్రజని నిల్వలు పెంచగల పప్పులు నేల నాణ్యతను సహితం పెంచుతాయి. పంట మార్పిడి, సాగు పద్ధతుల్లో వైవిధ్యత సాధించడంతో పాటు తెగుళ్ల నివారణ, పురుగులను దూరంగా ఉంచడం కూడా సుసాధ్యం అవుతున్నది. ఇతర ఆహార ధాన్యాలతో పోల్చితే పప్పులను పండించుటకు తక్కువ నీరు అవసరం అవుతున్నది. ఒక కిలోగ్రామ్ పప్పును పండించడానికి దాదాపు 1250 లీటర్ల నీరు అవసరం కాగా ఒక కేజీ పంది మాంసానికి 13,000 లీటర్ల నీరు వినియోగించబడుతున్నది.ఉత్తమ ఉత్పత్తులు, ఉత్తమ పోషక విలువలు, ఉత్తమ వినియోగం, ఉత్తమ పర్యావరణం, ఉత్తమ ఆరోగ్య జీవనం, ఉత్తమ జీవన విధానాలకు పప్పుధాన్యాలు అనాదిగా దోహదపడుతున్నాయి. అన్ని వర్గాల ప్రజలకు కావలసిన పప్పుధాన్యాలతో సమ్మిళిత, సుస్థిర, వినియోగాలతో పేదవాడి కండల్లో శక్తి ఊరుతుంది, ఆరోగ్యం పటిష్టమవుతుంది. ఇలాంటి పప్పుధాన్యాల పట్ల సామాన్య జనాల్లో అవగాహన కలిపించడం మనందరి కనీస కర్తవ్యం అని నమ్మాలి.

(10 ఫిబ్రవరి ప్రపంచ పప్పుధాన్యాల దినం సందర్భంగా)

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి,** 9949700037

# ఎప్‌స్టెయిన్ బూతు పురాణంలో “భారతీయ” ప్రముఖులు



ఎం.కోటేశ్వరరావు

ఎప్‌స్టెయిన్ ఫైల్స్! ఈ మాట వినగానే వివాదాస్పద కాశ్మీరీ ఫైల్స్ సినిమా గుర్తుకు వస్తుంది. అమెరికా లో జెఫ్రీ ఎప్‌స్టెయిన్ స్వంత విమానాల్లో తిరిగేంత ధనవంతుడు, ఫైనాన్సర్, ఘరానా పైరవీ, తార్పుడుగాడు. వాడి దగ్గర ఉన్న ఫైల్స్ ఓ బూతుసినిమా అనుకుంటే దాని లో మన దేశానికి చెందిన ప్రముఖులు ప్రధాని నరేంద్రమోదీ నుంచి ప్రభుత్వ ప్రాపకం ఉన్న పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ వరకు కొందరు నటించినట్లు ప్రస్తావనలు ఉన్నాయి. నీలి చిత్రాల్లో నటించటం అంటే ‘ఏ’ దృశ్యాల్లోనే పాల్గొనాల్సిన అవసరం లేదు. అసలేం జరిగింది? ట్రంప్ సర్కార్ విధిలేక బయటపెట్టిన లక్షలాది ఆ ఫైళ్లలో ప్రముఖ దర్శకురాలు, న్యూయార్క్ నగర వామపక్ష మేయర్ జోహ్రాన్ మమదానీ తల్లి మీరా నాయర్ పేరు కూడా ఉంది. ట్రంప్‌ను సవాల్ చేసి ప్రపంచ పెట్టుబడిదారీ కుంభస్థలంగా భావించే నగరానికి 34ఏండ్ల మమదానీ ఎన్నికయ్యాడు. అవకాశం కోసం చూస్తున్న అమెరికాలో వామపక్ష వ్యతిరేకులు, వారి అడుగుజాడల్లో నడిచే హిందూత్వ శక్తులు రెచ్చిపోయాయి. కృత్రిమ మేథతో రూపొందించిన చిత్రాల్లో ఒకదానిలో బాలుడిగా ఉన్న జోహ్రాన్ మమ్‌దానీ, మీరానాయర్, బిల్‌క్లింటన్,జెఫ్రీ ఎప్‌స్టెయిన్ ఉన్నారు. ఆ ఫొటోలను ఎక్స్‌లో పెట్టటంతో లక్షలాది మంది చూశారు. ఇద్దరు పెద్ద ఉగ్రవాదులతో ఒక చిన్న ఉగ్రవాది అన్నారు. మమదానీకి శిక్షణ ఇచ్చింది ఎప్‌స్టెయిన్ అన్న అర్థం వచ్చేలా ఫొటోల కింద వ్యాఖ్య రాశారు.

మన దేశంలో హిందూత్వ ప్రచారం చేస్తున్న ఖాతాలలో జైపూర్ డైలాగ్స్ ఒకటి. అలెక్స్ జోన్స్ పోస్టు చేసిన ఫేక్ ఫొటో వీడియోను అది షేర్ చేసింది. మమదానీ అసలు తండ్రి ఎప్‌స్టెయిన్ అని వర్గాలు తెలిపాయి అంటూ వ్యాఖ్య చేశారు. ఇదే విధంగా వాయిస్ ఆఫ్ హిందూస్ పేరుతో ఉన్నవారు కూడా దాన్ని ప్రచారంలో పెట్టారు. నిజమేమిటో తల్లి చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలా అనేకమంది వాటిని వైరల్ చేశారు. దీని వెనుక ముస్లిం వ్యతిరేక వామపక్ష భావజాల వ్యతిరేక ఉన్మాదం స్పష్టంగా కనిపిస్తోంది. మీరా నాయర్ అమెరికాలో చదువుకున్న రోజుల్లో ఆమెకు టీచర్‌గా ఉన్న మిచెల్ ఎపిస్టెయిన్‌తో 1970దశకం చివరిలో వివాహం జరిగింది. కొన్ని సంవత్సరాల తరువాత విడిపోయారు. ఈ ఎప్‌స్టెయిన్‌కు, తార్పుడు ఎపిస్టెయిన్‌కు కుటుంబం, ఇతరత్రా ఎలాంటి సంబంధాలు లేవు. ఒకరు ఆర్టిస్టు కాగా మరొకడు నేరగాడు. మీరా నాయర్ ఎలాంటి తప్పూ చేయనప్పటికీ ఆ పార్టీలో పాల్గొనటాన్ని అవకాశం గా తీసుకొని మమదానీ వ్యతిరేకులు, వారితో గొంతుకలిపిన హిందూత్వశక్తులు పెద్ద ఎత్తున కృత్రిమ ఫొటోలు సృష్టించి అక్రమ సంబంధాలను అంటగట్టారు. జోహ్రాన్ తండ్రి ఎప్‌స్టెయిన్ అని ప్రచారం చేశారు. ఎన్నికల్లో నిజాలను దాచి తమను మోసం చేశారంటూ మమదానీ అభిమానుల ముసుగులో కొందరు న్యూయార్క్‌లో ప్రదర్శన చేశారు. అయితే నిజ నిర్ధారణ చేసిన వారు అవన్నీ తప్పుడు ప్రచారాలని, ఎలాంటి వాస్తవం లేదని తేల్చారు.

ఎప్‌స్టెయిన్ ఫైల్స్‌లో పేర్లున్న మన ప్రముఖుల గురించి చూద్దాం. వారికి ఆ తార్పుడు గాడు అమ్మాయిలను సరఫరా చేసినట్లు గానీ, వాడి నేరాలలో భాగస్వామ్యం ఉన్నట్లు గానీ ఇప్పటి వరకు వెలువడిన పత్రా ల్లో లేదు. ఇప్పటికి ఆరులక్షల పేజీలు వెల్లడి కాగా ఇంకా బయటకు రావాల్సినవి ఉన్నాయి. ఇక్కడ అసలు సమస్య అలాంటి అవాంఛనీయ వ్యక్తితో విలువలు వలువల గురించి కబుర్లు చెప్పేవారు సంబంధాలు ఎందుకు పెట్టుకున్నారన్నదే బయటకు రావాల్సిన అంశం. తెరవెనుక ఇవన్నీ సాధారణమే అంటారా అదైనా చెప్పండి. మోదీ ఆన్ బోర్డ్ అనే ఇమెయిల్లో ప్రధాని పేరు ప్రస్తావన ఉంది. ఆ తార్పుడుగాడితో 2014–17 సంవత్సరాలలో కేంద్రమంత్రి హరదీప్ సింగ్ పూరీ ఐదుసార్లు కలిసినట్లు వెల్లడైంది. ఐఎఫ్ఎస్ అధికారి అయిన పూరీ 2014 జనవరిలో బిజెపిలో చేరారు. అంతకు ముందు 1974 నుంచి 2013వరకు విదేశాంగశాఖ అధికారిగా వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం పెట్రోలియం శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు.

ప్రధాని నరేంద్రమోదీ గురించి జెఫ్రీ ఎప్‌స్టెయిన్, డోనాల్డ్ ట్రంప్ మాజీ వ్యూహకర్త స్టీవ్ బనాన్ మధ్య నడిచిన ఇమెయిల్స్‌లో ప్రస్తావన ఉంది. తాను ట్రంప్ అధికార యంత్రాంగం భారత ప్రధాని కార్యాలయ అధికారులకు మధ్యవర్తిగా ఉన్నట్లు ఎప్‌స్టెయిన్ పేర్కొన్నాడు. 2017 జూలై ఆరున మోదీ ఇజ్రాయెల్ పర్యటన ముగిసిన తరువాత కతార్‌కు చెందిన జబోర్ వై అనే వ్యక్తి(కతార్ రాచకుటుంబానికి చెందిన వ్యక్తి అని వార్తలు)కి మెయిలు పంపాడు. దానిలో “భారత ప్రధాని మోదీ సలహా తీసుకున్నారు. అమెరికా అధ్యక్షుడికి మేలు చేకూర్చేందుకు ఇజ్రాయెల్‌లో నృత్యం చేశారు, పాట పాడారు. వారు కొద్ది వారాల ముందు కలుసుకున్నారు, అది పని చేసింది” మోదీ ఇజ్రాయెల్ పర్యటన ఖ్యాతి తనదే అని కూడా పేర్కొన్నాడు. ఒక భారత ప్రధాని తొలిసారిగా ఇజ్రాయెల్‌ను సందర్శించటమే గాక తరువాత విదేశాంగ విధానంలో నిర్ణయాత్మక మార్పులు చేసిన ఖ్యాతి మోదీకి దక్కిందన్నది స్పష్టం. ఈ ఫైళ్లలో ఉన్న అంశం మీద మన విదేశాంగశాఖ స్పందించింది. ప్రధాని పర్యటన నిజమే గానీ శిక్షపడిన ఒక నేరగాడు పేర్కొన్న అంశాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, ఎప్‌స్టెయిన్ లేదా ఇతర విదేశీ సలహాల ప్రభావంగానీ పర్యటన మీద లేదని వ్యాఖ్యానించింది. ఆ సమయంలో ఎప్‌స్టెయిన్ ట్రంప్ యంత్రాంగంతో సంబంధాలలో ఉన్నాడన్నది, భారత వ్యవహారాల్లో వేలుపెట్టాడన్నది వాస్తవమే అన్నది కొందరి అభిప్రాయం. ఇప్పుడున్న పరిస్థితిలో నిజానిజాలను ఎవరూ బయటపెట్ట రన్నది వేరే చెప్పనవసరం లేదు.

నరేంద్రమోదీ నేరుగా కలిసినట్లు ఎప్‌స్టెయిన్ కూడా చెప్పలేదు. అతగాడి హవా నడిచిన సమయంలో కేంద్రమంత్రి హరదేవ్ సింగ్ పూరీ 2014–17 సంవత్సరాలలో ఐదుసార్లు కలిసినట్లు ఎప్‌స్టెయిన్ దినచర్య డైరీలో పూరీ పేరు ఉంది. మూడు సార్లు న్యూయార్క్ నివాసంలో భేటీ అయినట్లు స్పష్టంగా ఉంది. నరేంద్రమోదీ అధికారానికి వచ్చిన తరువాత 2014 నవంబరులో భారత డిజిటల్ ఎకానమీ, పెట్టుబడులకు ఉన్న మంచి అవకాశాల గురించి పూరీ ఒక మెయిల్ పంపారు. సిలికాన్ వాలీలోని, టెక్ కంపెనీల ఉన్నతాధికారులు, పెట్టుబడిదారులతో పూరీని కలిపేందుకు చురుకుగా ఎప్‌స్టెయిన్ పనిచేసినట్లు ఒక మెయిల్లో ఉంది. లింక్డ్ ఇన్ కంపెనీ స్థాపకుడితో భారత్‌లో పెట్టుబడి అవకాశాల గురించి పూరీ చర్చించినట్లు కూడా వెల్లడైంది. తాను ఎనిమిదేండ్లు న్యూయార్క్‌లో ఉన్నానని, మూడు సార్లు కలిసింది నిజమే అని అంతర్జాతీయ పీస్ ఇనిస్టిట్యూట్‌లో పనిచేస్తుండగా మూడుసార్లు కలిసింది నిజమే అని, అది పని సంబంధంగా, చాలా పరిమితమైన కలయిక అని, తనకు అతగాడి నేరజీవితం గురించి తెలియదని వైర్ పోర్టల్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా పూరీ చెప్పారు. అంతర్జాతీయ శాంతి వ్యవహారాల్లో ఎప్‌స్టెయిన్‌కు ఉన్న సంబంధం ఏమిటో ఒక రాయబారిగా పూరీ ఏమి చర్చించారో అంతుబట్టదు. ఆ భేటీల తరువాతే హరదేవ్‌సింగ్ పూరీ కేంద్రమంత్రివర్గంలో 2017లో చేరారు. చిత్రం ఏమిటంటే ఈ ఫైళ్ల గురించి తొలి సమాచారం 2025 నవంబరులోనే వెల్లడైంది. ఇదంతా వట్టిదే అని అప్పుడు బిజెపి ప్రతినిధి ప్రదీప్ భండారీ కొట్టి పడేశారు. ఇప్పుడు ఆ పెద్దమనిషి తలెక్కడ పెట్టుకున్నారో తెలియదు.

రిలయన్స్ కమ్యూనికేషన్స్ పేరుతో మందిని ముంచిన అనిల్ అంబానీ నడిపిన వ్యవహారాలు ఎప్‌స్టెయిన్ ఫైల్స్‌లో స్పష్టంగా ఉన్నాయి. 2017మార్చినెల 16న అంబానీ పంపిన ఒక వర్తమానం ఇలా ఉంది. “హలో నేను ఢిల్లీలో ఉన్నాను. జారెడ్(ట్రంప్ అల్లుడు జారెడ్ కుషనర్) మరియు బానన్ (స్టీవ్ బానన్ ట్రంప్ ప్రధాన వ్యూహకర్త)లను నేను కలుసుకొనేందుకు మీ సాయం కావాలని “నాయకత్వం” (ప్రధాని కార్యాలయం)వాంఛిస్తున్నది. దయచేసి సలహా ఇవ్వండి. ప్రధాని వాషింగ్టన్ పర్యటన జరపబోతున్నారు” అని అనిల్ అంబానీ పేర్కొన్నాడు.

ఇదంతా ఆ తరువాత 2017 జూన్‌లో జరిపే అమెరికా పర్యటనకు ముందు జరిగింది.2017 నుంచి 2019వరకు అనిల్ అంబానీ ఎప్‌స్టెయిన్ మధ్య నిరంతర సంబంధాలు ఉన్నట్లు ఫైళ్లలో బయటపడింది. వారేమి చర్చించుకున్నారంటే అమెరికా, భారత్‌లో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, పెట్టుబడి వ్యూహాలు, ట్రంప్ యంత్రాంగంతో అప్పాయింట్‌మెంట్లు, మోదీ అమెరికా, ఇజ్రాయెల్ యాత్రల గురించి. ప్రధాని ఇజ్రాయెల్ పర్యటనకు ముందు, ఇజ్రాయెల్ మాజీ ప్రధాని ఎహుద్ బరాక్‌ను ఎలా కలుసుకోవాల్సిందీ ఒక మెయిల్‌లో ఎప్‌స్టెయిన్ అంబానీకి సూచించాడు. ఇద్దరి మధ్య సమావేశం ఏర్పాటు చేస్తానని చెప్పాడు.

మోదీ పర్యటనపై ఇజ్రాయెల్ వ్యూహం గురించి చర్చించారు. ఆ సమయంలో అనిల్ అంబానీ రిలయన్స్ డిఫెన్స్ లిమిటెడ్ కంపెనీ ఇజ్రాయెల్ ప్రభుత్వరంగ సంస్థ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ కంపెనీతో సంయుక్త ప్రాజెక్టు నడుస్తున్నది. మోదీ సర్కార్ రాఫెల్ విమానాల కొనుగోలు ఒప్పందంలో అనిల్ అంబానీ పాత్ర, అతగాడికి ఆ విమానాలను తయారు చేసే ఫ్రెంచి కంపెనీ దసాల్ట్‌తో విమానాల విడిభాగాల తయారీపేరుతో కుదిరిన ఒప్పందం గురించి తెలిసిందే. అంతకు ముందు అంబానీలు ఎన్నడూ ఆ రంగంలో లేరు. అనిల్ అంబానీ దివాలా ప్రకటించినపుడు 2019లో తనకు 75 కోట్ల డాలర్ల రుణ సేకరణకు సలహా ఇవ్వాలని ఎప్‌స్టెయిన్‌ను కోరినట్లు వెల్లడైంది. వీటి గురించి వివరణ కోరగా అంబానీ కంపెనీ నుంచి స్పందన లేదని మీడియాలో వార్తలు వచ్చాయి. రాజకీయ నేతలు, వాణిజ్య కంపెనీల యజమానుల సంబంధాలు గురించి ఈ ఉదంతం వెల్లడిస్తున్నది.

# కొత్త లేబర్ కోడ్‌లు అమలు సాధ్యమేనా?



**ఎస్.బాల్‌రాజ్**
ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
8074246685

కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ ఒకటి నుండి నాలుగు కొత్త లేబర్ కోడ్‌ల అమలుకు సంసిద్ధం అవుతున్నది. 1923 నుండి 1996 వరకు అనేక చారిత్రాత్మక పోరాటాలు, ఉద్యమాలు చేసి, సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి ఈ కార్మిక వ్యతిరేక కోడ్‌లను తెచ్చింది. నాటి రవి అస్తమించని సామ్రాజ్యవాది బ్రిటీష్ పాలకుల మెడలు వంచి, అదే విధంగా దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని, కార్మికులకు ప్రయోజనాలు కావాలని చేసిన పోరాటాలలో వేలాది కార్మికులను చిత్రహింసలకు గురిచేసిన, కాల్చిచంపినా వెనుకడుగు వేయని కార్మికవర్గం ఉద్యమాలు, పోరాటాలు చేసి, అమరుల త్యాగాల ఫలితంగా కార్మిక చట్టాలను సాధించుకుంది, స్వాతంత్ర్య దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక శాఖలపై, యాజమాన్యాలపై కార్మికులు చేసిన పోరాటాల ఫలితంగా, సమ్మెచేసే హక్కు, వేతనాలు, పి.ఎఫ్, ఇయస్ఐ, గ్రాట్యుటీ చట్టాలను సాధించుకొని అమలు చేయించుకుంటున్న కార్మికవర్గ గొప్ప పోరాటాల చరిత్ర సువర్ణ అక్షరాలతో లిఖించబడుతుంది.

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారానికి వచ్చి హిందుత్వ ఎజెండా, ఆలోచన విధానంతో పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు, బడా వ్యాపారస్తులకు మేలు చేస్తూ, వారి ఆస్తులు పెంచుకొనే విధంగా సహకరిస్తున్నది, 140 కోట్ల ప్రజలలో 60 కోట్ల మంది కార్మికులు, 30 కోట్ల రైతులు, 10 కోట్ల మంది పేద, మధ్య తరగతి ప్రజలు, అన్ని విద్యార్హతలు ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించకుండా ప్రజలకు, కార్మిక, రైతులకు వ్యతిరేకంగా మోడీ పాలన కొనసాగుతున్నది. భారతదేశాన్ని మతతత్వ ఎజెండాతో ముందుకు తీసుకోపోయే ఆలోచనతో మెజార్టీ ప్రజలకు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం నిలబడుతున్నది.

కరోనా కాలంలో 2019–2020 సంవత్సరాలలో పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ లేకుండా 4 లేబర్ కోడ్‌లకు ఆమోదం పొందింది. ఇప్పుడు మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను నోటిఫై చేసి ఏప్రిల్ ఒకటి నుండి అమలు చేస్తామని కార్మిక వర్గానికి సవాల్ చేస్తున్నది.

కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను అమలులో భాగంగా అందరికి కనీస వేతనాలు అమలు చేస్తామని చెబుతోంది. కాని 1948లో తెచ్చిన కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయకుండా, అన్ని రంగాలలో పనిచేస్తున్న కార్మికవర్గానికి కనీస వేతనాలు అమలు చేస్తామంటున్నది. కార్మికవర్గ పోరాటాన్ని గౌరవించి 4 లేబర్ కోడ్‌లను అమలు చేయకుండా, 29 చట్టాలను తు.చ. తప్పకుండా అమలు చేయాల్సిందిపోయి మోడీ కోడ్‌ల అమలుకై శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నది.

కార్మికవర్గాన్ని దోపిడీ చేసే కోడ్‌ల అమలులో భాగంగా, దేశంలోని 60 కోట్ల మంది కార్మికులకు వెంటనే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు, నియామక పత్రాలు ఇవ్వాలి, కార్మిక సంఘాలు సమ్మెలు చేస్తూ డిమాండ్ చేస్తున్నా దున్నపోతుపై వర్షం పడ్డ చందంగా పాలక వర్గాలు వ్యవహరిస్తున్నాయి.

సంవత్సరానికి 180 రోజులు పనిచేస్తే జీతంతో కూడిన సెలవులు వర్తింపచేస్తామని కేంద్ర ప్రభుత్వం దగాకోరు మాటలు చెబుతున్నది.

యాజమాన్యాల దయా దాక్షిణ్యాలతో స్త్రీ కార్మికులు రాత్రిపూట 8 గంటల నుండి 12 గంటలు పనిచేయాలని నిబంధన పెట్టిన కోడ్‌లు ఎంతో దుర్మార్గమైనవి.

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చట్టాన్ని అమలు చేస్తూ స్త్రీ, పురుష కార్మికులకు వ్యత్యాసంలేని వేతనాలు చెల్లించలేని కేంద్ర ప్రభుత్వంతో కార్మికవర్గం పోరాడుతుంటే మాటలతో కాలం గడుపుతున్నది.

మహిళలకు 26వారాలు ప్రసూతి సెలవులు ఇవ్వాలన్న మోడీ తెస్తున్న కోడ్‌ల వలన యాజమాన్యాలు మహిళా కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వకుండా 6 నెలల వేతనం ఎగకొట్టేందుకు, మహిళా కార్మికురాలను పనినుండి తొలగించి, కొత్తవారిని నియమించుకుంటుంటే గుడ్లు అప్పగించి చూస్తుంది ప్రభుత్వం. మహిళలు పనిచేసే చోట పసిపిల్లలకు క్రెచ్‌సెంటర్లు పెట్టి మహిళా ఉద్యోగుల పిల్లలకు పాలు, గుడ్లు, పండ్లు, బలమైన పోషక ఆహారం అందిస్తూ మహిళా ఉద్యోగులతో పనిచేయించాలన్న బిజెపి పాలకులు గర్భిణితో ఉన్నప్పుడే పనినుండి తొలగించిన తర్వాత బాలల సంరక్షణ కేంద్రాలు శిశు సంరక్షణలేని ఆనాధ కేంద్రాలుగా మిగిలిపోతాయి తప్ప కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయలేదు.

మహిళలు ఇంటి నుండి పనిచేసే అవకాశం అన్ని కోడ్‌లలో చేర్చారు. తెలంగాణాలో 8 లక్షల మంది బీడీ కార్మికులు, దేశవ్యాపితంగా 5 కోట్ల మంది బీడీ కార్మికులు పనిచేస్తుంటే నెలకు వెయ్యి రూపాయలు వేతనం రావటం లేదు. మహిళలు ఇంటి నుండి పనిచేసినా ఎటువంటి ప్రయోజనాలను కోడ్‌లలో కల్పించలేదు. ఇయస్ఐ, పిఎఫ్ చట్టాలు అమలు చేస్తున్నా, కనీస వేతనాల మాటేలేదు.

కార్మికులందరికి 8 గంటలకన్న ఎక్కువ గంటలు పనిచేసినా అదనపు వేతనాలు చెల్లించాలన్న నిబంధనలను అమలు చేసే స్థితిని ఏ ఒక్క కోడ్‌లో పొందుపర్చలేదు. అదే విధంగా కార్మికులకు బోనస్ చెల్లిస్తామని, ఒక సంవత్సరకాలం సర్వీస్ పూర్తిచేస్తే గ్రాట్యుటీ చెల్లిస్తామని, కార్మికులందరికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్న కోడ్‌లను కేంద్ర ప్రభుత్వమే అమలు చేయకపోతే ప్రైవేటు యాజమాన్యాలు అమలు చేస్తాయా కార్మికవర్గం ఆలోచించాలి.

కార్మికులందరికి ప్రతి సంవత్సరం తప్పనిసరిగా ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయడం, కార్మికులు అందరికీ ఇయస్ఐ పథకాన్ని అమలు చేసే బదులు అనేక ప్రయోజనాలు ఉన్న ఇయస్ఐ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ భవిష్యత్తులో ఇయస్ఐ హాస్పిటల్స్ ఎత్తివేస్తారు. ప్రైవేటీకరణకు ద్వారాలు తెరుస్తారు.

కార్మికవర్గం పోరాటాలు, ఉద్యమాలతో కార్మికుల నష్ట పరిహార చట్టం 1923, కార్మికులు యూనియన్‌లు పెట్టుకొనే హక్కు చట్టం 1926, వేతనాల చెల్లింపు చట్టం 1936, పారిశ్రామిక వివాదాల పరిష్కార చట్టం 1947, కనీస వేతనాల చెల్లింపు చట్టం 1948, ఫ్యాక్టరీల చట్టం 1948, కార్మిక రాజ్య బీమా ఇయస్ఐ చట్టం 1948, ప్రావిడెంట్ ఫండ్ చట్టం 1952, ప్రసూతి ప్రయోజనాల చట్టం 1961, బోనస్ చెల్లింపు చట్టం 1965, కాంట్రాక్టు కార్మికుల పర్మినెంట్ చేసే చట్టం 1970, గ్రాట్యుటీ చెల్లింపు చట్టం 1972, బాలకార్మిక నిషేధ చట్టం 1986, దుకాణాల ఉద్యోగులు సమగ్ర చట్టం 1988, ఉద్యోగుల పెన్షన్ పథకం 1995ను అమలు చేయుట, భవన నిర్మాణ మరియు ఇతర కార్మికుల సంక్షేమ చట్టం 1996, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయుట, స్త్రీ, పురుషులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించే, 1976 చట్టం, బీడీ, సిగార్స్ వర్కర్స్ సంక్షేమ సెస్సు చట్టం 1976, బీడీ వర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ చట్టం 1976, వెట్టి నిర్మూలన చట్టం 1976, సినీ వర్కర్స్ మరియు సినిమా థియేటర్ వర్కర్స్ రెగ్యులరైజేషన్ యాక్ట్ 1981, కోల్‌మైన్స్, పి.ఎఫ్.చట్టం, గనుల పరిశ్రమల కార్మికుల పర్మినెంట్ 1948, ఎంప్లాయీస్ పెన్షన్ చట్టం 1995, ఇండస్ట్రియల్ ఎంప్లాయిమెంట్ స్టాండింగ్ ఆర్డర్ చట్టం 1946, వలస కార్మికుల చట్టం 1976, మెటర్నిటీ బెనిఫిట్స్ చట్టం 1961, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ చట్టం 1961, ప్లాంటేషన్ లేబర్ చట్టం 1951, సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ చట్టం 1976, వారంతపు సెలవుల చట్టం 1942, జర్నలిస్టుల మరియు ఉద్యోగుల చట్టం 1955 వంటి అనేక చట్టాలు కార్మికులు పోరాడి సాధించుకున్నవి. మోడీ బిజెపి ప్రభుత్వం 29 చట్టాలను సమూలంగా రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తెచ్చింది. మోడీ సర్కార్ కార్మికవర్గ వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలో 40 కోట్ల మంది కార్మికులు, రైతులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని 10 కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు పిలుపిచ్చాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు పాల్గొని సమ్మెను విజయవంతంచేసి కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడుదాం.

## సేవ్ తెలంగాణ....ఓట్ ఫర్ బిజెపి

**ప్రజాపక్షం/కరీంనగర్:**మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలిచ్చే తీర్పు కాంగ్రెస్ అవినీతి, అరాచక పాలనకు చెంప పెట్టు కావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలిచ్చే తీర్పు ద్వారా అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. 'సేవ్ తెలంగాణ...ఓట్ ఫర్ బిజెపి'అనే నినాదానికి అనుగుణంగా కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. రేపు జరగబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజల తీర్పు తెలంగాణలో మార్పుకు సంకేతం కావాలన్నారు.

## 11న వేతనంతో కూడిన సెలవు మంజూరు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి వాణిజ్య, దుకాణం,వ్యాపార సంస్థలలో పని చేసే కార్మికులకు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పనిచేసే ఉద్యోగులు సిబ్బందికి వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీహర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని దుకాణ, వాణిజ్యసంస్థల యజమానులకు, వ్యాపార సంస్థల యజమానులు ఫిబ్రవరి 11 బుధవారం రోజున మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తమ దుకాణ, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పని చేయుచున్న కార్మికులకు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని అన్నారు. ఫిబ్రవరి 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, పోలింగ్ జరిగే సమయంలో షిఫ్ట్ లో ఉన్న ఉద్యోగులకు, ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు సిబ్బందికి కూడా తప్పనిసరిగా వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ షాప్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 1988 చట్ట ప్రకారము యజమానులు తప్పనిసరిగా మూసివేసి కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని,లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రైతు కూలీలు తప్పనిసరిగా పిపిఇ ధరించాలి



**ప్రజాపక్షం/ముత్తారం :** రైతు కూలీలు, రైతులు వ్యవసాయ పనుల్లో, పురుగుమందుల పిచికారీ సమయంలో తప్పనిసరిగా వ్యక్తిగత రక్షణ పరికరాలను (పిపిఇ) ధరించాలని ఆర్ ఏ ప్రాజెక్టు ఫీల్డ్ అధికారి కలవేన మధుకర్ అన్నారు.సోమవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మధుకర్ మాట్లాడుతూ వ్యవసాయ కూలీల ఆరోగ్యం దృష్ట్యా, పొలాల్లో పనిచేసేటప్పుడు తగిన భద్రతా ప్రమాణాలు పాటించాలని అన్నారు.పిపిఇ వాడటం వల్ల పురుగుమందుల వల్ల కలిగే నరాల బలహీనత, ఊపిరితిత్తుల సమస్యలు,చర్మ ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ లభిస్తుందని వారు అన్నారు. అలాగే ఫాస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

## 12వ తేదీన ఒక్కరోజు దేశవ్యాప్త సమ్మె

**ప్రజాపక్షం/రామగిరి :**ఆర్జీ3 ఏరియా కార్మిక సంఘాలు అన్ని కలిసి జెఎసి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఒసిపి 2 లో గేట్ మీటింగ్ సమావేశం ఏర్పాటు చేసి ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగాఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవి.రావు , ఐఎన్టియుసి నుండి మనోహర్ ,టిబిజికెఎస్ నాగేల్లి. సాంబయ్య ,సిఐటియు కొమురయ్య హాజరై వాల్ పోస్టర్ విడుదల చేసి తదనంతరం మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నాలుగులేబర్ కోడ్ ల రద్దు చేయాలికాంట్రాక్ట్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారము సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలిసింగరేణికి చెల్లించాల్సిన అప్పు సుమారు 47 వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలి.బొగ్గు తీసే పనుల్లో పర్మినెంట్ కార్మికులనే నియమించాలి.నూతన బొగ్గు గనులు ఏర్పాటు చేయాలి.ఇలా మరెన్నో కార్మికుల హక్కులు కాల రాస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 12వ తారీకు న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు అందరు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్జీ 3 బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్సి రెడ్డి ఏఎల్పి పిట్ సెక్రెటరీగంగాధర్ ,సిహెచ్పి పిట్ సెక్రటరీ గంధం. శ్రీనివాస్ , ఓసిపి2 ఫిట్ సెక్రెటరీ సురేష్ , నాన్ ఆపరేషన్ ఫిట్ సెక్రెటరీ పోశం జిఎం చర్చల కమిటీ ప్రతినిధులు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్, సేఫ్టీ వర్క్ కమిటీ మెంబర్స్, క్యాంటీన్ టెంపుల్ కమిటీ మెంబర్స్,తదితర కార్మికులు పాల్గొన్నారు.

## మార్చి 31వరకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు పొడిగింపు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:**2025–26 విద్యా సంవత్సరంలో పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్‌ల దరఖాస్తు గడువు మార్చి 31 వరకు పొడిగించడం జరిగిందని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పి.నరేష్ కుమార్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని ప్రభుత్వ,ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న వివిద జూనియర్,డిగ్రీ,వృత్తి విద్య,ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న మైనారిటీ విద్యార్థిని,విద్యార్థులు,అందరూ వారి అర్హతలను బట్టి ఉపకార వేతనాలను https://telanganaepass.cgg.gov.in వెబ్ సైట్ లో మార్చి 31, 2026 లోపు ఫ్రెష్, రెన్యువల్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ఆయా కళాశాల ప్రిన్సిపాల్ ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి



**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో ఈ నెల 11న జరుగనున్న ఎన్నికల్లో ఓటర్లు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల సౌకర్యార్థం ఎన్నికల కమిషన్ అనుమతించిన గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటిని చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వాహణకు అన్ని రకాల చర్యలు చేపటిటనట్టు పేర్కొన్నారు. అనంతరం ఎన్నికల నిర్వాహణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో నిర్వహించనున్న ఎన్నికల సమాగ్రిని జనరల్ అబ్జర్వర్ ఖర్గాడే ఖాళీ చరణ్‌తో పాటు కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. మోడల్ ప్రవర్తనా నియామవళిని కఠినంగా అమలు చేయాలన్నారు. అదనపు కలెక్టర్లు బీఎస్ లత, రాజ గౌడ్ తదితరులు ఉన్నారు.

# అర్థరహిత ఆరోపణలు చేయొద్దు

రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్/హుస్నాబాద్:**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, ప్రజా పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఆశీర్వదించాలని రాష్ట్ర రవా ణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నా రు. సోమవారం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఏ ర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, మాజీ ఎమ్మెల్యేలు ఆరేపల్లి మోహన్, కోడూరి సత్యనారాయణ, పడాల రాహుల్, ఆర్టీఏ మెంబర్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, అల్ఫోర్స్ నరేందర్ రెడ్డిలతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను దివంగత నేత సత్యనారాయణ రావు కార్పొరేషన్ గా చేశారని, ప్రస్తుతం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటున్నామని, కరీంనగర్‌లో ఏ అభివృద్ధి జరిగిన అది కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే జరిగిందన్నారు. నియోజకవర్గం ఎమ్మెల్యేగా, మంత్రి గా ఉండి ఒక్కరికి కూడా డబుల్ బెడ్ రూం ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు చొప్పున ఇస్తూ పేద ప్రజలకు గూడు కల్పించిందన్నారు. అభివృద్ధి సంక్షేమం రెండు జోడెద్దుల్లా పని చేస్తామని, మేము ఎంఐఎంతో కుమ్మక్కయ్యామని మాట్లాడుతున్నారని, అలాంటి ఆధారాలు ఉంటే చర్యలు తీసుకోవాలని, అర్థరహితమైన ఆరోపణలు మంచిది కాదన్నారు. బిఆర్ఎస్, బిజెపిలోపాయికారి ఒప్పందం చేసుకున్నారని, అభ్యర్థుల ఎంపిక లో అలయ్ బలయ్ తీసుకొని ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు.

**జిల్లా కేంద్రంతో సమానంగా అభివృద్ధి చేసి చూపిస్తా**

నేడు హుస్నాబాద్‌లో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో 20వార్డులకు 20 వార్డులు గెలిపించండి,హుస్నాబాద్‌ను జిల్లా కేంద్రంతో సమానంగా అభివృద్ధి చేసి చూపిస్తానని తెలంగాణ బిసి రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడు హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రచార సభలో పట్టణ ఓటర్లకు హామీ ఇచ్చారు. సోమవారం పట్టణంలో పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తు కార్నర్ మీటింగ్‌లో ముగింపు సభల్లో ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ హుస్నాబాద్ 75 ఏళ్ల చరిత్రలో మొదటి సారిగా మంత్రి పదవి అవకాశం వచ్చింది. తన పదవి కాలంలో హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి జిల్లా కేంద్రంతో సమానంగా అభివృద్ధి చేస్తానని ,హుస్నాబాద్‌ను విద్య, వైద్య, పారిశ్రామిక, వ్యవసాయ, రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. హుస్నాబాద్ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు తెచ్చామని అన్నారు. తెలంగాణ ముఖ్య మంత్రి పిసిసి అధ్యక్షుడిగా హుస్నాబాద్‌కు వచ్చినప్పుడు తల్లి నుండి బిడ్డను వేరు చేశారని హుస్నాబాద్‌ను బలవంతంగా సిద్దిపేటలో కలిపారని దానిని మళ్లీ కరీంనగర్‌లో కలుపుతామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి అండదండలతో హుస్నాబాద్‌కు అన్ని రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలతో ముందుకు పోవుటకు రూట్ మ్యాప్ చేస్తున్నాం అన్నారు. హుస్నాబాద్ అభివృద్ధి జరగాలంటే మున్సిపల్ కాంగ్రెస్ ను గెలిపించండి ఈ సమావేశంలో నాయకులు కేడం లింగమూర్తి, శివయ్య, చిత్తారి పద్మరవిందర్, అకుల రజిత వెంకన్న, అయా వార్డు అభ్యర్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి

రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూ పట్టణాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు,రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తేనే పట్టణాలు మరింత అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జెండా చౌరస్తా వద్ద మున్సిపల్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన యుద్ధ భేరి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుతోపాటు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. నిరుపేదలకు త్వరలోనే ఇంటి స్థలాలను కేటాయించి గేటెడ్ కమ్యూనిటీ కాలనీ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో త్వరలోనే ఐటీ పార్కు ఏర్పాటు చేయబోతున్నట్లు, ఆటో కార్మికుల కోసం ఆటో నగర్ నిర్మాణానికి స్థల సేకరణ కూడా చేస్తున్నామని ప్రకటించారు. రూ. కోటితో జిల్లా కేంద్రంలో అంబేద్కర్ స్టడీ కోచింగ్ సెంటర్ భవన నిర్మాణం. అత్యాధునిక ఎకరాలతో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. అర్హులైన రైతులందరికి రూ. 2లక్షల రుణ మాఫీ అందించామని, సన్న వడ్లకు రూ.500 బోనస్ చెల్లించిన ఘనత కాంగ్రెస్ సర్కారుదేనన్నారు.పెద్దపల్లి మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి పెద్దపల్లి పట్టణ ప్రజలు అన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే వి జయరమణారావు మాట్లాడుతూపెద్దపల్లి మున్సిపాలిటీలో 36 మంది కాంగ్రెస్ అభ్యర్థులను కౌన్సిలర్లుగా గెలిపించే బాధ్యత ప్రజలదేనని, పట్టణాభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే ప్రకటించారు. ఎమ్మెల్సీ భానుప్రసాద్రావు మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచిన వెంటనే పారదర్శకంగా జవాబుదారీతనంతో ప్రజలకు సేవ చేసి గుర్తింపు పొందాలని సూచించారు . పట్టణాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎన్నికల ఇన్చార్జి బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిపరులకు అప్పగిస్తే అధోగతే

రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి మున్సిపాలిటీని పొరపాటున అవినీతి పరులకు అప్పగిస్తే అదోగతి పాలు అవుతుందని, ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పించిన ధర్మపురి ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే ధర్మపురి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిచేస్తానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి ఓటర్లకు పిలుపు నిచ్చారు. సోమవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో చివరి రోజు ధర్మపురి పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. ధర్మపురి పట్టణంలోని పటేల్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీ చౌక్,నంది చౌరస్తా అంబేద్కర్ జంక్షన్ మీదుగా ఎస్ఎచ్ ఫంక్షన్ హాల్ వరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా పటేల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన తరువాత సిసిరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం చేస్తున్నామని మంత్రి వివరించారు. రానున్న రోజుల్లో ధర్మపురి పట్టణాన్ని,ఆలయాన్ని అభివృద్ధిచేయాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజారిటీలో 15మంది కాంగ్రెస్ కౌన్సిలర్లను గెలిపించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. రెపరెపలాడిన కాంగ్రెస్ జెండాలు.,మున్సిపల్ ఎన్నికల చివరి రోజు ప్రచారంలో ధర్మపురిలో ఎక్కడ చూసిన కాంగ్రెస్ పార్టీ జెండాలు రెపరెపలాడాయి. పట్టణంలోని 15వార్డుల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు ర్యాలీకి తరలివచ్చారు. మూడు రంగుల జెండాతో మంత్రి లక్ష్మణ్ కుమార్ ముందుకు సాగగా మంత్రిని అనుసరిస్తు మహిళలు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వెంట ర్యాలీగా ముందుకు సాగారు.

## ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని.. ఓటర్లు తమ ఓటు హక్కును తప్పకుండ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి హైమావతి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 11తేదీన జిల్లాలో హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నాయని, ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. నాలుగు మున్సిపాల్టీల్లో మొత్తం 72 వార్డులకు ఎన్నికలు జరుగనుండగా 176 పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1069 పోలింగ్ సిబ్బందిన నియమించినట్లు తెలిపారు. మొత్తం 18 రూట్లకు 22 జోనల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేస్తున్నట్లు తెలిపారు. 31 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి, 31 మంది మైక్రో అబ్జర్వర్లను క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో 100శాతం వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్నిమున్సిపాల్టీల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు పోలింగ్ సిబ్బందికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 13న ఓట్ల లెక్కింపుకు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాల్టీకి 14 టెబుల్స్, మిగత మూడు మున్సిపాల్టీల్లో 7 టెబుల్స్ చొప్పున ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఎన్నికలకు జిల్లాలోని 4 మున్సిపాలిటీల్లో కలిపి మొత్తం 1లక్ష 1వెయ్యి 85 మంది ఓటర్లు కలరని,వారందరు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీస్ శాఖ ద్వారా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 11వ తేదీన ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరుగనున్న జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీలోని ఓటర్లు తప్పకుండ తమ ఓటు హక్కును 100 శాతం వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు.

## ఓటు వేయండి... అందుబాటులో ఉంటా..

సిపిఐ అభ్యర్థి గడిపె మల్లేశ్ ఇంటింటా ఎన్నికల ప్రచారం



**ప్రజాపక్షం / హుస్నాబాద్:** ఒక్కసారి అశీర్వదించి ఓటు వేసి దీవించండి మీకు అందుబాటులో ఉంటా మీకష్టాల్లో పాలు పంచుకుంటా నంటు సిపిఐ 17 వార్డు అభ్యర్థి గడిపె మల్లేశ్ సోమవారం పట్టణంలో ఇంటింటా బ్యాలెట్ పేపర్‌తో అందిరికి తమ గుర్తు చూపిస్తు కంకి కొడవలి గుర్తుపై మీ ఓట్లను వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణంలో చాడ వెంకటరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో డిపో వెనుకాల జంగాలకు, కొమటి రాజమీరు కాలని లో చాల మంది ఇళ్లు లేని పే దలకు ఇళ్ల స్థలాలను ఇప్పించామని గుర్తు చేశారు. పట్టణంలో ఎక్కడ పేదలకు ఆన్యాయం జరిగిన సిపిఐ పార్టీ అం డగాఉంటుందని తెలిపారు. డబ్బుకు మీ ఓటు అమ్ముకుంటే అభివృద్ధి అనేది అంధకారం అవుతుందని సూచించారు. అందుకే మీకు ఎల్లవేళల అందుబాటులో ఉంటూ మీ బిడ్డగా గడిపె మల్లేశ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి అభివృద్ధికి బాట వేయాలని ఓటర్లను మల్లేశ్ అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, రాజ్‌కుమార్, మల్లారెడ్డి , గూడ పద్మ, బత్తుల బాబు, పాల్గొన్నారు.

## ప్రచార కార్యక్రమాలపై నిషేధం

**ప్రజాపక్షం/కరీంనగర్:**మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న పరిధిలో సోమవారం (ఫిబ్రవరి 09వ తేదీ) సాయంత్రం 5:00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అ మలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసేంత వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, ఎంసిసి బృందాలు, పోలీస్ అధికారులు అందరూ కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా మద్యం షాపులను మూసివేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పురస్కరించుకుని ఈ నెల 13న కూడా మద్యం దుకాణాలు మూసివేయాలని, కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలు లో ఉంటుందని తెలిపారు.

## మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**ప్రజాపక్షం/చొప్పదండి:**చొప్పదండి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా అభివృద్ధి చేసి ఆ దర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. చొప్పదండి పట్టణ ంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార ంలో మాట్లాడారు. చొప్పదండి పట్టణంలో మినీ స్టేడియం నిర్మాణానికి, కుడి చెరువు మినీ ట్యా ంకు బండ్‌గా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. చొప్పదండిని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు సిఎం హామీ ఇచ్చారని పేర్కొన్నారు. 11న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరికీ ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## డబుల్ బెడ్ రూమ్‌లు పూర్తి :ఇన్‌చార్జి కలెక్టర్

హౌసింగ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పిఆర్ శాఖల అధికారులతో సమీక్ష

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూంలను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదా యంలో హౌసింగ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పీఆర్ శాఖల అధికారులతో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వేములవాడ, కొండాపూర్, మద్దికుంట, బద్దెనపల్లి, తంగళ్ళపల్లిలో డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు కొనసాగుతుండగా వాటిపై సమీక్షించారు. ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో ఆరా తీశారు. ఆయా ఇండ్ల పనులను గృహ నిర్మాణ శాఖ ఆద్వర్యంలో చేపట్టి ..త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సాజిద్, ఆర్ అండ్ బీ ఈఈ నరసింహాచారి, డీఈ శాంతయ్య, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.50 కోట్లతో సుల్తానాబాద్ మున్సిపల్‌కు నూతన శోభ

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:**మున్సిపల్ ను మరో 50 కోట్లాది రూపాయలతో అద్భుత నగరంగా తీర్చిదిదెందుకు కృషి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సోమవారం చివరి రోజు మున్సిపల్ పరిధిలోని 15 వార్డుల అభ్యర్థులతో కలిసి మున్సిపాలిటీలో పూసాల ఆరెపల్లి నుండి భారీ బైక్ ర్యాలీని అన్ని వార్డుల మీదుగా నిర్వహించారు. అనంతరం స్థానిక తెలంగాణ చౌరస్తా అంబేద్కర్ కూడలి వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై ఓటు వేసి15 వార్డుల కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన రెండు సంవత్సరాల కాలంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఉన్న సాన్నిత్యంతో పెద్దపల్లి నియోజకవర్గంలో నీళ్లు పారినట్లు నిధులను పారించానని 1000 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను చేపడుతున్నారని అన్నారు. తాను అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలోనే ప్రజల కోరిక మేరకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నానని సుల్తానాబాద్‌లో నాలుగు కోట్లతో నూతన బస్టాండ్ నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానని తెలిపారు. సుల్తానాబాద్ చెరువుతోపాటు కుంటాలను బతుకమ్మ ఘాటుగా తీర్చిదిద్దామని అన్నారు. చెరువును అద్భుతంగా మలచి సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేసి ప్రజలు సాయంత్రం వేళల్లో ఉల్లాసంగా గడిపే విధంగా అద్భుత నగరంగా మారుస్తామని అన్నారు. సుల్తానాబాద్ పట్టణం నిరంతర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, ఇప్పటికే సుల్తానాబాద్ పట్టణాన్ని రెండు సంవత్సరాల కాలంలో 20 కోట్లతో అభివృద్ధి చేశామని అన్నారు.పెద్ద చెరువును ఎనిమిది కోట్ల 50 లక్షలతో మినీ ట్యాంక్ బండ్ గా ఏర్పాటు చేస్తామని ఐబి పాత భవనాన్ని కూల్చి వేసి 4 కోట్లతో నూతన భవనాన్ని నిర్మాణం చేస్తామని ప్రకటించారు. తెలంగాణ చౌరస్తా నుండి గట్టేపల్లి క్రాసింగ్ వరకు 7 కోట్ల 50 లక్షలు తో సెంట్రల్ లైటింగ్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. చిరు వ్యాపారులకు 65 లక్షల రూపాయలతో నూతన షెటర్ల నిర్మాణం చేపట్టి అందించామన్నారు. తన సొంత ఖర్చులు 8 లక్షలు అయినా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద నూతన ఐలాండ్ నిర్మాణం చేపడతానని అలాగే మజీద్ చౌరస్తా నుండి గట్టేపల్లి చౌరస్తా వరకు డబుల్ రోడ్డు నిర్మాణం సెంటర్ లైటింగ్ నిర్మాణం చేపడతానని తెలిపారు. ముఖ్యమంత్రి తో తనకున్న సాహిత్యం ద్వారా సంతకం చేపించి మరీ నిధులు తీసుకువచ్చి నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 15 వార్డ్ కౌన్సిలర్లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభివృద్ధికి బాటలు వేయాలని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని పాత భవనాలను తొలగించి నూతన భవనాల నిర్మాణం చేపట్టి మైదానాన్ని అద్భుతంగా మలచి వర్షపు నీరును బయటికి వెళ్లేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఉగాది అనంతరం శ్రీరాంపూర్ చౌరస్తా పూర్తిగా వెలుగులతో అద్భుతంగా మలుస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్ మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాశరావు, ఆయిల రమేష్, శ్రీగిరి శ్రీనివాస్,జూపల్లి తిరుమల్ రావు, 15 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థుల తోపాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



## సమ్మెకు దూరంగా ఉండాలి

మందమర్రి ఏరియా జిఎం.రాధాకృష్ణ

**ప్రజాపక్షం/మందమర్రి :** ఈనెల 12వ తేదీన కొన్ని కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపుకు కార్మికులు దూరంగా ఉండి విధులు హాజరై లక్ష్య సాధనకు సహకరించాలని మందమర్రి ఏరియా జిఎం ఎన్.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం జిఎం కార్యాలయంలో ఏరియా అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన సమ్మె నేపథ్యంలో కీలక వ్యాఖ్యలు చేశారు. కొన్ని జాతీయ కార్మిక సంఘాలు వివిధ డిమాండ్లతో ఫిబ్రవరి 12న ఒకరోజు సమ్మెకు పిలుపునిస్తు సింగరేణి కార్మికులు కూడా ఇందులో పాల్గోనాలని కోరుతున్నారు. అయితే ఈ సమ్మె డిమాండ్లలో ఎక్కువభాగం సింగరేణి కార్మికులకు మాత్రమే సంబంధించినవి కావని, సింగరేణి యాజమాన్యం పరిధిలో పరిష్కరించగల అంశాలు కూడా కావని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థకు సంబంధించిన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఎల్లప్పుడు ఉందని పేర్కొన్నారు. ఈ కీలక సమయంలో ప్రతిరోజు సాధించే ఉత్పత్తి ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. ఈ సమావేశంలో సింగరేణి అధికారులు పాల్గొన్నారు.



## ఓట్ల లెక్కింపు సిబ్బంది విధులపై స్పష్టమైన అవగాహన

కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్ :** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి తమ బాధ్యతలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట సమావేశ మందిరంలో ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనబోయే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని సిబ్బందికి మార్గనిర్దేశం చేవారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియలో ప్రతి ఓటు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ,ఎటువంటి సందేహాలు వచ్చినా పై అధికారులను సంప్రదించి నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు.అలాగే సంబంధిత ఫారములను పకడ్బందీగా పూరించి, మొత్తం ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్ కుమార్,డిఈవో భోజన్న,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌బిఐ ఫైనాన్షియల్ లిటరసీ వీక్ 2026 పోస్టర్ల ఆవిష్కరణ

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 13 వరకు నిర్వహించనున్న ఫైనాన్షియల్ లిటరసీ వీక్ 2026 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవైసీ యువర్ ఫస్ట్ స్టెప్ టు సేఫ్ బ్యాంకింగ్ అనే అంశంపై ఈ యేడాది ఫైనాన్షియల్ లిటరసీ వీక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో నో యువర్ కస్టమర్ నిబంధనలపై అవగాహన పెంపొందించటం సెంట్రల్ కెవైసి రిజిస్ట్రీ ప్రాముఖ్యత, ఖాతా భద్రత, కేవైసీకి సంబంధించిన మోసాల నివారణ, మనీ మ్యూలింగ్ వంటి అంశాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో కూడా పట్టణ స్వయం సహాయక సంఘాలు, వార్డు స్థాయి సంఘాల సమావేశాల ద్వారా ఫైనాన్సియల్ లిటరసీ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరముందని అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ సునీల్ పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి పథకం నిరుపేదలకు అండ

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** నిరుపేదింటి ఆడపడుచు వివాహానికి కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాలు అండగా నిలుస్తుందని డిసిసి అధ్యక్షుడు ఏలే మల్లిఖార్జున్ స్పష్టం చేశారు. ఆయన సోమవారం జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్ మండలకేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో లబ్ధిదారులకు సిఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ప్రజా సంక్షేమానికి, పేదల అభ్యున్నతికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదింటి తల్లి దండ్రులకు వారి కుమార్తె వివాహం భారం కావద్దన్న సంకల్పంతో కళ్యాణ లక్ష్మి , షాదీముభారక్ ద్వారా ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిట్లం ఎఎంసి చైర్మెన్ చీకోటి మనోజ్‌కుమార్, నిజాంసాగర్ తహసీల్దార్ సాయిభుజంగరావు, ఎంపిడిఒ శివకృష్ణ, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## బిజెపికి ఓటు వేస్తే మోరిలో వేసినట్లే

మాజీ మంత్రి హరీష్ రావు

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** బిజెపికి ఓటు వేస్తే మోరీలో వేసినట్లేనని సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. సోమవారం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నర్సాపూర్ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. అనంతరం బస్టాండు ఎదుట కార్నర్ మీటింగ్ లో పాల్గొని హరీష్ రావు మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు. ఇద్దరూ బడే బాయ్, చోటే బాయ్ అనుబంధం ఉందన్నారు. దీంతో కేంద్ర బడ్జె ఆంధ్రకు నిధులు కేటాయించగా తెలంగాణకు గుండు సున్న ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాల పాలనలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైద అన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వ విధానాలతో విదేశాలలో ఉన్న భారతీయులు అనేక అవస్థలు పడుతున్నారని ఆయన గుర్తు చేశారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నర్సాపూర్ అభివృద్ధికి ఎటువంటి నిధులు కేటాయించలేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్ మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్ తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ మండల అధ్యక్షులు భోగ శేఖర్ మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్ కౌన్సిలర్ అభ్యర్థులు నాయకులు.పాల్గొన్నారు

# ఒంటరి ప్రచారానికి తెరలేపిన అభ్యర్థులు

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో ఈనెల 11వ తేదీన జరుగనున్న కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా సోమవారం చివరి రోజున ప్రచార పర్వం అధికారికంగా ముగిసింది. ఐదు గంటల నుండి అన్ని పార్టీల డివిజన్‌ల అభ్యర్థులు తమ ప్రచార రథాల మైకులు మూగబోయాయి. ఇక ఓటరు దేవుళ్ళు తమ తీర్పును ఇవ్వడానికి మరొక రోజు గడువు ఉండటంతో అభ్యర్థులు ఓటర్ల చుట్టూ ఒంటరిగా తిరుగుతూ తమకు ఓట్లు వేసి గెలిపించాలని ప్రాధేయపడే పనిలోపడ్డారు. ప్రచారానికి చివరి రోజు కావడంతో సోమవారం అంతకు ముందు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 వార్డులలో ఎవరికి వారు బరిలో ఉన్న అభ్యర్థులంతా అట్టహాసంగా ప్రచారాన్ని చేపట్టారు. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలతో పాటు ఇండిపెండెంట్‌లు, ఇతర పార్టీల నుండి బరిలో నిలిచిన డివిజన్ అభ్యర్థులు తమ సత్తా చాటుకునే విధంగా ఎక్కువ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు, వార్డు ప్రజలతో భారీగా ఊరేగింపులు నిర్వహిస్తు ప్రచారాన్ని చేపట్టారు. ఇదిలా ఉండగా అధికార కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు మూడు రోజులపాటు కార్నర్‌మీట్‌లలో తనదైన శైలిలలో ప్రచారాన్ని హోరెత్తించారు. మంచిర్యాలను ఏ విధంగా అభివృద్ధి చేసిందో వివరిస్తునే కార్పొరేషన్ అభివృద్ధికి 60 మందికి 60 మందిని గెలిపిస్తే రాష్ట్రంలో ఎక్కడా లేని అభివృద్ధి ఇక్కడ చేసుకోవచ్చని అభయమిచ్చారు. అలాగే ఎమ్మెల్యే సతీమణి, మాజీ డిసిసి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, వారి తనయుడు కూడా ఈసారి ప్రచారంలో హుషారుగా పాల్గొని ఇంత కాలం చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. వీరితో పాటు కాంటోన్మెంటు ఎమ్మెల్యే గణేష్ కూడా వివిధ వార్డులలో ప్రచారాన్ని విస్తృతంగానే నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, ఆయన తనయుడు విజిత్‌రావు అన్ని డివిజన్‌లలో తమ అభ్యర్థులను గెలిపించుకోవడానికి విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. ఇక బిజెపి పార్టీ కాంగ్రెస్, స్థానిక ఎమ్మెల్యేపై విమర్శలు గుప్పిస్తునే బిజెపిని ఆదరించాలని మోదీ పాలనను ఆదర్శంగా కార్పొరేషన్ అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌తో పాటు ఆయన సతీమణి, ఇతర బిజెపి నాయకులు ఓటర్లను కలుస్తు ప్రచారం చేశారు. ఇక స్వతంత్ర అభ్యర్థులు మాత్రం తమను చూసి తాము ఇంతకాలం చేసిన అభివృద్ధిని చూసి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. మొత్తానికి 11వ తేదీన జరుగనున్న మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రచారపర్వం పూర్తి కావడంతో ఇక మిగిలిన ఒక్క రోజులో రాజకీయాలు ఏ విధంగా మారనున్నాయో చూడాల్సి ఉంది.

## తలసేమియా బాధితులకు రక్తదానం

గొల్లపల్లి సర్పంచ్ గడీల శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/కొండాపూర్ :** కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామములో సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ సౌజన్యంతో తలసేమియా భాదితులకు ఆదివారం రక్తదాన శిభిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి గ్రామ యువకులు, పెద్దలు, గ్రామ పంచాయతీ సభ్యులు ఉత్సాహంగా, స్వచ్ఛందంగా రక్త దాన కార్యక్రమంలో పాలుపంచుకొని రక్త దానం చేశారు. గొల్లపల్లి గ్రామస్థులను రక్త దానశిబిర నిర్వాహకులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనం రక్తదానం చేయడం వలన ఇంకొకరి జీవితంలో వెలుగు నిండుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యం

మాజీ మంత్రి వేణుగోపాల చారి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ దూసుకుపోతోంది. సోమవారం పట్టణంలోని వార్డుల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమం కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో నిర్మల్ మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి అప్పాల కావ్య గణేష్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కుచారి శ్రీహరిరావు, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి కలిసి పాల్గొని పట్టణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శీను, ఆమెడ శీను, మంగళరావు పోశెట్టి, కూన నరేందర ఆకుల హరీష్ సహా పలువురు నాయకులు పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

**ప్రజా క్షేత్రంలో తిరుగులేని ఆధిక్యం..** వార్డుల్లోని గల్లీ గల్లీలో కాంగ్రెస్ నాయకులకు ప్రజలు హారతులతో, పూలమాలలతో నీరాజనాలు పలుకుతున్నారు. ప్రజల నుంచి వస్తున్న ఈ అపూర్వ స్పందన చేస్తుంటే,ఇతర పార్టీల అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ నిర్మల్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రచారంలో కార్యకర్తల నినాదాలతో నిర్మల్ పట్టణం మారుమోగిపోతోంది.

శాంతియుత ఎన్నికల కోసం

## సెక్షన్ 163 యాక్ట్ అమలు

రామగుండం సిపి అంబర్ కిశోర్ ఝా

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** శాంతియుత ఎన్నికల నిర్వహణ కోసం రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్టు అమలులో ఉంటుందని రామగుండం సిపి అంబర్ కిశోర్ ఝా వెల్లడించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్ పరిధిలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, చెన్నూర్, క్యాతనపెల్లి, బెల్లంపల్లి, లక్షెట్టిపేట మున్సిపాలిటీలలో మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరి 11న జరుగనున్న నేపథ్యంలో మున్సిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 9 సాయంత్రం ఐదు గంటల నుండి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఈ యాక్టు అమలులో ఉంటుందని తెలిపారు. ఈనెల 13వ తేదీ ఉదయం 8 గంటల నుండి కౌంటింగ్ , ఫలితాలు వెల్లడింపు పూర్తయ్యే




వరకు సెక్షన్ 163 యాక్టు అమలులో ఉంటుందని వివరించారు. ఈ అంక్షల కాలంలో నలుగురికి మించి గుంపులుగా చేరడం పూర్తిగా నిషేధమని తెలిపారు. ఎన్నికల వాతావరణాన్ని ఉద్రిక్తం చేసే రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కవ్వింపు చర్యలు, గొడవలకు దారి తీసే ప్రవర్తన ఏదైనా చోటుచేసుకున్నట్లయితే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధినిర్వహణలో ఉన్న పోలీసులు, అటవీ అధికారులు, కేంద్ర బలగాలు, హోంగార్డులు , ఎస్‌పిఒలకు ఈ నిషేధాలు వర్తంచవని స్పష్టం చేశారు. చట్టపరమైన అనుమతి లేకుండా ఊరేగింపులు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని, పోలింగ్ కేంద్రాల ఒక కిలోమీటర్ పరిధిలో కర్రలు, కత్తులు, తుపాకులు వంటి మరణాయుధాలతో సంచరించడం పూర్తిగా నిషేధమని సిపి వివరించారు. తాత్కాలిక నిర్మాణాలైన షామియానాలు, పందిళ్ళు ఏర్పాటు చేయడానికి కూడా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. మైకులు, లౌడ్‌స్పీకర్‌ల ద్వారా పాటలు ప్రసారం చేయడం, సభలు నిర్వహించడం ప్రజలను ఒక వర్గం మీద మరొక వర్గం మీద రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేయడం నిషేధమని తెలిపారు. ఎన్నికల సమయంలో చట్టబద్ధమైన అధికారాన్ని ధిక్కరించే విధంగా ప్రకటనలు, ప్లకార్డులు, గుర్తులు ప్రదరించడం కూడా చట్టవిరుద్ధమని తెలిపారు.



## ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలలో పకడ్బందీగా ఏర్పాట్లు : కెలెక్టర్ హరిత

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** రెండవ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని డిఎవి పాఠశాలలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం, కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూం, పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 11వ తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కాగజ్‌నగర్ మున్సిపాలిటీలోని 30 వార్డులకు గాను 85 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికలలో పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి, సామాగ్రి విధులు నిర్వహించే సిబ్బందికి, సామాగ్రి పంపిణీ సిబ్బందికి భోజన వసతులు, ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. స్టాంగ్ రూంలో సిసి కెమెరాలు, బందోబస్తు కల్పించాలని, ఈనెల 13వ తేదీన జరుగనున్న కౌంటింగ్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, తహసీల్దార్ మధుకర్, సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్ :** ప్రజలంతా మున్సిపల్ ఎన్నికలలో స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం ఉదయం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి, ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో ఓటరు అవగాహన పెంపొందించుటకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఈ ర్యాలీని, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జెండా ఊపడం ద్వారా ప్రారంభించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత తెలిపేలా నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో పలు పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




ర్యాలీ ముగిసిన అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన గొప్ప వరమని తెలిపారు. ఓటరుకు ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని వివరించారు.ఇటీవలి గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఓటర్లు పెద్ద ఎత్తున పాల్గొని స్ఫూర్తిని చాటారని వివరించారు. ఇదే విధంగా మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని, పట్టణాలలో ఓటింగ్ శాతాన్ని పెంచాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలందరూ బ్యాంకింగ్ కెవైసిని ఎప్పటికప్పుడు పూర్తిచేసుకుంటూ ఉండాలని తెలిపారు. కెవైసి ప్రక్రియ పూర్తి చేసుకోవడం వల్ల సైబర్ మోసాలకు గురికాకుండా సురక్షితంగా ఉండగలుగుతామని పేర్కొన్నారు. బ్యాంకింగ్ అధికారులు పెద్ద ఎత్తున కెవైసి ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్‌కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, సిపిఒ జీవరత్నం, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, డిఇఒ భోజన్న, ఎక్సైజ్ అధికారి ఎంఎ రజాక్, డివైఎస్ఒ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్, గ్రామీణాభివృద్ధి శాఖ, బ్యాంకింగ్ అధికారులు పాల్గొన్నారు.

## నిరుపేదల పక్షపాతి కాంగ్రెస్

టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్మల్ పట్టణంలోని గాంధీ చౌక్ ప్రాంతంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేవ్వర్ విస్తృతంగా పర్యటించారు.కాంగ్రెస్ అభ్యర్థి మేడారం అపర్ణ ప్రదీప్ విజయాన్ని కాంక్షింస్తూ ఆయన గడప గడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ..గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వని కొత్త రేషన్ కార్డులను,అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తుచేశారు.నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు.బుధవారం జరగబోయే ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పిసిసి మెంబర్ సదా సుదర్శన్,అమెడ శ్రీధర్,మేడారం ప్రదీప్ తదితర నాయకులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/బోధన్ :** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పట్టణాలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా సోమవారం బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు 2వ వార్డు మీర్ గౌస్, 3వ వార్డు రేఖం రేణుక దాసు, నాల్గవ వార్డు సమీనా మన్నన్, 22వ వార్డు మిద్దెల రామరాజు, 23వ వార్డు సహనా సుల్తానా నాజిర్ అలీ లకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర గత ప్రభుత్వ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు. అభివృద్ధి పేరుతో డబ్బులు దండుకున్నారే తప్ప రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంపల్లి ఎల్లయ్య, శరత్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, సాయి కృష్ణ, స్వామి తదితరులు పాల్గొన్నారు

## వ్యక్తి అదృశ్యం ఘటనలో కేసు నమోదు

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** మండలంలోని కోనాతాండా గ్రామానికి చెందిన బోడ ప్రేమ్‌సింగ్(35) అనే వ్యక్తి 2025 సం.లో జూలై 21 నుండి కనిపించకుండా పోయినట్లు ప్రేమ్‌సింగ్ భార్య బోడా గంగుబాయి నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై శివకుమార్ పేర్కొన్నారు. ఇంటి నుండి వెళ్ళిన క్షణం నుండి తమకు తెలిసిన వారు, బంధువుల వద్ద ప్రేమ్‌సింగ్ ఆచూకీ కొరకు వెతికినప్పటికి ఫలితం లేకపోవడంతో ప్రేమ్‌సింగ్ భార్య గంగుబాయి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అదృశ్యమైన వ్యక్తి 5 అడుగుల ఎత్తు, ఛామనఛాయ రంగు, కోలముఖం కలిగి ఉండి ప్యాంటు షర్టు ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు సెల్ 8712686172, 8712666221 నిజాంసాగర్ ఎస్సై శివకుమార్‌కు సమాచారం అందించాలని కోరారు.

## దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు

**ప్రజాపక్షం/మెదక్ :** గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా సబ్బండ వర్గాలను మోసం చేస్తున్న దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలో భారాస జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ ఆధ్వర్యంలో 31 వార్డుల బిఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా స్థానిక ఐబి నుంచి రాందాస్ చౌరస్తా వరకు పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ఎన్నికల ప్రచారంలలో మెదక్ చర్చి, ఏడుపాయల అమ్మవారి సాక్షిగా ఇచ్చిన హామీలు నెరవేర్చలేక మాట తప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి రాలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు, బిసి రిజర్వేషన్ల విషయంలో మోసం చేసిందన్నారు. బిసిలకు బిఆర్ఎస్ పార్టీ వంద శాతం టికెట్లు కేటాయించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు ఎవరికీ భయపడవద్దని వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ప్రతి ఒక్కరూ ధైర్యంగా కారు గుర్తుకు ఓటేసి బిఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని హరీష్ రావు కోరారు. మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ మెదక్ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి వచ్చిన నాయకులు ప్రజలను భయపెడుతున్నారని తెలిపారు. ఎన్నికల ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, మాజీ ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు మల్లికార్జున్ గౌడ్, బట్టి జగపతి, నియోజకవర్గ ఇన్చార్జ్ తిరుపతిరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, ఆంజనేయులు, జీవన్ రావుతో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

కేసు నమోదు

**ప్రజాపక్షం/పాపన్నపేట :** అటవీ ప్రాంతంలో పేకాట స్థావరం పై పాపన్నపేట ఎస్ఐ, స్పెషల్ పోలీసులు దాడి చేసి 13, వేల నాలుగు వందలు జప్తు చేసి పేకాట రాయుళ్ళ పై కేసు నమోదు చేసి నట్లు పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని అన్నారం అటవీ ప్రాంతంలో శంకరంపేట మండలం లోని చందంపేట గ్రామానికి చెందిన ఇరువురు తోపాటు అన్నారం గ్రామానికి చెందిన మరొకరు కలసి పేకాట ఆడుతున్నారన్న విశ్వాసనియ సమాచారం మేరకు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ స్పెషల్ పోలీసులు దాడి చేసి 13 వేల నాలుగు వందల రూపాయల తోపాటు ముగ్గురిని అదుపులోకి తీసుకొని పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## భీమ్‌గల్‌ను తోడేళ్ల బారి నుండి కాపాడుకుందాం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** భీమ్‌గల్ మున్సిపాలిటీని రాబందులు, బకాసురుల బారి నుండి కాపాడుకోవాల్సిన బాధ్యత పట్టణ ప్రజలందరిపై ఉందని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం భీమ్‌గల్‌లో చివరి రోజు నిర్వహించిన బిఆర్ఎస్ అభ్యర్థుల భారీ ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మి ప్రజలు మోసపోయారని వేముల విమర్శించారు. ఒకసారి నమ్మితే మోసం చేసినవాడిది తప్పు రెండోసారి కూడా నమ్మితే నమ్మిన వాడిదే తప్పు అవుతుందని పేర్కొంటూ ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్లలో భీమ్‌గల్‌లో ఒక్కపైసా పని కూడా జరగలేదని ధ్వజమెత్తారు. మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లను బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే నిలిచిపోయిన పనులన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీమ్‌గల్ మున్సిపల్ అభ్యర్థులు, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## రామాయంపేట అభివృద్ధిని అడ్డుకున్నది హరీష్‌రావే

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

**ప్రజాపక్షం/రామాయంపేట :** రామాయంపేట అభివృద్ధిని అడ్డుకొని ఇక్కడకు వచ్చిన నిదులు, ప్రభుత్వ కార్యాలయాలను సిద్ధిపేటకు తరలించి పట్టణ ప్రజలను మోసం చేసింది మాజీ మంత్రి హరీష్‌రావు అని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. సోమవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారం చివరిరోజు పట్టణంలో నిర్వహించిన సమావేశానికి మైనంపల్లి హన్మంతరావుతో పాటు మైనంపల్లి రోహిత్‌రావు హాజరయ్యారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ రామాయంపేటను అభివృద్ధి చేశామంటున్న హరీష్‌రావు దత్తత తీసుకొని ఏం చేశారో చూపించాలన్నారు. మల్లె చెరువును సుందరీకరణ, విద్యుత్ దీపాలు బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిందని చెబుతున్న హరీష్‌రావుకు సిగ్గుండాలని ఘాటుగా విమర్శించారు. ఇప్పటికి మల్లె చెరువు అలాగే ఉందని తాము అధికారంలోకి వచ్చాక కోటి 50లక్షల నిదులు కేటాయించడం జరిగిందన్నారు. 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో జరుగని అభివృద్ధి అధికారం లేకుండా ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎన్నికల ఇంచార్జ్ చిట్కుల మహిపాల్‌రెడ్డి, సరాపు యాదగిరితో పాటు కౌన్సిలర్ అభ్యర్థులు గజవాడ లావణ్య, సుకుమార్, గుగులోతు రవినాయక్, బైరం స్వప్న, ఏసుగారి పుష్పాంజలి, పుట్టి సందీప్, గజవాడ నాగరాజు, కన్నాపురం రమేష్‌గౌడ్, దేవుని రంజిత్, ఎనిశెట్టి శ్రీవాణి అశోక్ గుప్తా, డాకి శ్యామల స్వామి, పోచమ్మల నవనీత గణేష్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

# భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌పై ఉత్కంఠ..

## ఐసిసి చెప్పినట్టే వింటామని బిసిసిఐ వెల్లడి !



పొట్టి ప్రపంచకప్‌లో భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌పై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ఇండియాతో మ్యాచ్‌ను బాయకాట్ చేస్తామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రకటించడంతో ఫిబ్రవరి 15న హై ఓల్టేజ్ మ్యాచ్ ఉంటుందా? ఉండదా? అని కోట్లాది మంది చర్చించుకుంటున్నారు. ఇప్పటికే పాక్ బోర్డుకు శ్రీలంక క్రికెట్ ఈ–మెయిల్ పంపగా.. ఐసిసి ప్రతినిధి సైతం మంతనాలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఇండో–పాక్ మ్యాచ్‌పై భారత క్రికెట్ నియంత్రణ మండలి తమ నిర్ణయాన్ని వెల్లడించింది. ఐసిసి, ఆసియా క్రికెట్ మండలి ఈవెంట్లలోనే తలపడుతున్న భారత్, పాకిస్థాన్ జట్లు టి–20 వరల్డ్ కప్‌లో ఢీకొనడంపై అనిశ్చితి కొనసాగుతోంది. మూడు డిమాండ్లకు అంగీకరిస్తేనే ఇండియాతో ఆడుతామని ఐసిసికి పాక్ బోర్డు స్పష్టం చేసినందున.. ఐసిసి నిర్ణయం కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. ఈ విషయంలో బిసిసిఐ మాత్రం స్పష్టతతో ఉంది. ఫిబ్రవరి 15న భారత జట్టు కొలంబో వెళ్తుందని ఇదివరకే ప్రకటించిన బిసిసిఐ .. తాజా పరిణామాలపై స్పందించింది. ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా సోమవారం మాట్లాడుతూ తాము ఐసిసి నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నాడు. 'లీగ్ దశలో ఫిబ్రవరి 15న కొలంబోలో జరగాల్సిన మ్యాచ్‌పై నేను ఇదివరకే స్పందించాను. ఐసిసి తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా మేము నడుచుకుంటాం. ఈ విషయంలో బిసిసిఐ చెప్పాల్సింది, చేయాల్సిందేమీ లేదు' అని పార్లమెంట్ ప్రాంగణంలో రాజీవ్‌శుక్లా మీడియాతో తెలిపాడు. బాయ్‌కాట్ వార్తలపై ఇటీవలే కెప్టెన్ సూర్యకుమార్‌యాదవ్ సైతం మీడియా సమావేశంలో మాట్లాడాడు. 'ఫిబ్రవరి 15న కొలంబో వెళ్తున్నాం. ఆ రోజుకు ఫ్లైట్‌బుక్ చేసుకున్నాం. మ్యాచ్ ఆడమని వారే(పాక్ బోర్డు) అన్నారు. మేము ఆడేందుకు సిద్ధంగాఉన్నాం' అని వెల్లడించాడు. అంతకుముందు సైకియా స్పందిస్తూ.. ఫిబ్రవరి 15న భారత జట్టు కొలంబో వెళ్తుంది. మ్యాచ్ సమయానికి ఆటగాళ్లంతా స్టేడియం చేరుకుంటారు. మ్యాచ్ రద్దయిందని రిఫరీ ప్రకటించాకే టీమిండియా బృందం స్వదేశానికి బయల్దేరుతుంది' అని పేర్కొన్నాడు.

### మ్యాచ్ ఆడేందుకు పాకిస్థాన్ మూడు షరతులు

టి–20 వరల్డ్ కప్‌లో ఇండియాతో ఫిబ్రవరి 15వ తేదీన జరగనున్న మ్యాచ్ ఆడబోమని పాకిస్థాన్ చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఆ మ్యాచ్‌ను నిర్వహించేందుకు ఐసిసి తమ వంతు ప్రయత్నం చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఇద్దరు సభ్యుల బృందం పాకిస్థాన్ వెళ్లింది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ మోషిన్ నఖ్వీతో చర్చలు నిర్వహించారు. భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు మూడు కీలక షరతులు పాకిస్థాన్ పెట్టినట్లు తెలుస్తోంది. ఓ మీడియా కథనం ప్రకారం ఆ షరతులు ఇలా ఉన్నాయి. పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు వార్షిక నిధులను ఐసిసి పెంచాలని కోరింది. ఇక ఇండియా, భారత్ మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లను పునరుద్ధరించాలని ఐసిసిని అభ్యర్థించింది. అయితే ఇండియా, పాక్ మధ్య మ్యాచ్ జరుగుతున్న సమయంలో.. ఆటగాళ్లు ఆన్‌ఫీల్ ఎథిక్స్ పాటించాలని, ప్లేయర్లు అందరూ షేక్ హ్యాండ్ ఇచ్చుకోవాలని పాక్ క్రికెట్ బోర్డు ఐసిసిని కోరినట్లు తెలుస్తోంది. ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను కలిసిన తర్వాత తుది నిర్ణయం వెల్లడించనున్నట్లు నఖ్వీ తెలిపారు.

# తొలి మ్యాచ్‌లో జింబాబ్వే పంజా



పొట్టి ప్రపంచకప్ జింబాబ్వే తొలి అడుగు ఘనం గా వేసింది. కొలంబోలోని సిన్హలీస్ స్పోర్ట్స్ క్లబ్లో ఆల్రౌండ్ షోతో అదరగొడుతూ.. ఒమన్‌పై 8 వికెట్లతో గెలుపొందింది. తొలుత బ్లెస్సింగ్ ముజరబని(316), బ్రాడ్ ఎవాన్స్(318), రిచర్డ్ ఎగర్వ(317)లు వికెట్ల వేటతో 103కే ప్రత్యర్థిని పడగొట్టిన జింబాబ్వే.. స్వల్ప లక్ష్యాన్ని ఆడుతూపాడుతూ ఛేదించింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(48 నాటౌట్), బ్రెండన్ టేబెండన్ రిటైర్డ్ హర్ట్) మెరుపులతో 13.3 ఓవర్లోనే మ్యాచ్‌ను ముగించింది. గ్రూప్–బిలోని జింబాబ్వే లీగ్ దశ తొలిపోరులో పంజా విసిరింది. పసికూన ఒమన్ జట్టును వణికిస్తూ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బంతితో, ఆపై బ్యాటుతో రఫ్ఫాడించిన జింబాబ్వే.. 13.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకుంది. బ్యాటర్లు విఫలమవ్వగా.. ఒమన్ బౌలర్లు సైతం తేలిపోయారు. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (48 నాటౌట్) ధనాధన్ ఆటతో విరుచుకుపడగా.. లక్ష్యం కరుగుతూ పోయింది. ఓపెనర్ తడివనషే మరుమని(21)ను ఔట్ చేసిన సూఫియన్ తొలి వికెట్ అందించాడు. డియాన్ మేయర్స్(0) డకౌట్ కాగా.. సీనియర్ ప్లేయర్ బ్రెండన్ టేబెండన్ రిటైర్డ్ హర్ట్) తోడుగా బెన్నెట్ చెలరేగాడు. చిన్న లక్ష్యాన్ని మరో 39 బంతులుండగానే ఉఫ్మనిపించిన జింబాబ్వే రెండు పాయింట్లతో పాటు మెరుగైన రన్‌రేటు(+2.702) సాధించింది. ఆరంభంలోనే ఒమన్ను దెబ్బకొట్టి.. జట్టు విజయంలో కీలకమైన ముజరబని ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్గా ఎంపికయ్యాడు. కొలంబోలో బ్లెస్సింగ్ ముజరబని(316), రిచర్డ్ నగవర(317)లు టాప్ ఆర్డర్‌ను పడగొట్టగా ఒమన్ ఆటగాళ్లు క్రీజులో నిలిచేందుకు అపసోపాలు పడ్డారు. డెత్ ఓవర్లలో బ్రాడ్ ఎవాన్స్(318) రెచ్చిపోయాడు. శుభారంభం లభించకపోయినా.. సూఫియన్ మొహమూద్(25), వినాయక్ శుక్లా(28)లు పట్టుదలతో ఆడి పరువు కాపాడారు. చివరలో నదీమ్ ఖాన్(20) బ్యాట్ ఝులిపించాడు. కానీ, ఎవాన్స్ ఓవర్లో షకీల్ అహ్మద్ బౌల్ కావడంతో 103కే ఒమన్ ఆలౌటయ్యింది. ప్రపంచకప్‌లో జింబాబ్వేపై ఏ జట్టుకైనా ఇదే అత్యల్ప స్కోర్.

## యువతరంగం

# అమల్లో చిత్తశుద్ధి కరవు!

కేంద్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించే పథకాలు.. చేపట్టే ప్రాజెక్టులు ఆచరణలో విఫలమవుతున్నాయన్న విమర్శల్లో నిజం లేకపోలేదు. అందుకు ఉదాహరణగా ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పిఎంకెవివై) పథకాన్ని పేర్కొనాలి. దీని అమలుపై కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) చేసిన తీవ్ర వ్యాఖ్యలు దేశంలోని నైపుణ్యాభివృద్ధి విధానాలపై కొత్త చర్చకు దారితీశాయి. పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆడిట్ నివేదికలో, ఈ పథకం లక్ష్యాలు ఎంత ఆశావహంగా ఉన్నప్పటికీ, అమలులో తీవ్రమైన లోపాలు చోటుచేసుకున్నాయని కాగ్ స్పష్టం చేసింది. ముఖ్యంగా యువత ఉపాధి సమస్యను పరిష్కరించాలన్న ఉద్దేశంతో ప్రారంభించిన పథకం, కార్యరూపంలో అనేక వ్యవస్థాపక వైఫల్యాలను ఎదుర్కొన్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 2015 జూలైలో స్కిల్ ఇండియా మిషన్‌లో భాగంగా ప్రారంభమైంది. నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహికత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఈ పథకం అమలులోకి వచ్చింది. పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు యువత కు అందించి, వారి ఉపాధి అవకాశాలను పెంచడం, చదువుకున్న నిరుద్యోగ సమస్యను తగ్గించడమే దీనిప్రధాన లక్ష్యం. తక్కువ కాలిక శిక్షణ, ముందుగా ఉన్న నైపుణ్యాలకు గుర్తింపు, సర్టిఫికేషన్, ఉపాధి సహాయం వంటి అంశాలు ఈ పథకానికి కేంద్ర బిందువులుగా ఉన్నాయి. 2015 నుంచి 2022 వరకు మూడు దశల్లో ఈ పథకం అమలైంది. ఈ పథకం ప్రత్యేకత ఏమిటంటే, శిక్షణ భాగస్వాములకు చెల్లింపులు ఫలితాల ఆధారంగా జరగడం. శిక్షణ పూర్తయి, సర్టిఫికేషన్ పొందిన అభ్యర్థికి నేరుగా బ్యాంక్ ఖాతాలోకి రూ.500 నగదు ప్రోత్సాహకం జమ చేయడం ఇందులో భాగం. స్కిల్ ఇండియా పోర్టల్ ద్వారా డిజిటల్ పర్యవేక్షణ, ఆధార్ ఆధారిత ధృవీకరణ, మూడో పక్ష అంచనాలు వంటి చర్యల ద్వారా పారదర్శకతను నిర్ధారించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అధికారిక గణాంకాల ప్రకారం, 2015 నుంచి 2022 వరకు దాదాపు రూ.14,450 కోట్ల వ్యయంతో ఈ పథకం అమలైంది. సుమారు 1.32 కోట్ల మందిని శిక్షణ మరియు సర్టిఫికేషన్ లక్ష్యంగా పెట్టుకోగా, దాదాపు 1.1 కోట్ల మంది సర్టిఫికెట్ పొందినట్లు ప్రభుత్వం చెబుతోంది. కాగ్ ఆడిట్ నివేదిక ఈ ఆశావహ చిత్రాన్ని తీవ్రంగా ప్రశ్నిస్తోంది. 2015నుంచి 2022 మధ్య కాలంలో పథకం అమలులో తీవ్రమైన లోపాలు చోటుచేసుకున్నాయని నివేదిక పేర్కొంది. అత్యంత ఆందోళన కలిగించిన అంశం ఏమిటంటే, దాదా పు 94 శాతం అభ్యర్థుల రికార్డుల్లో నమ్మదగిన బ్యాంక్ వివరాలు లేవని కాగ్ వెల్లడించింది. దీని వల్ల నిజంగా లబ్ధిదారులు ఎవరు అన్న విషయంపైనే సందేహాలు తలెత్తుతున్నాయి. అంతేకాదు, సుమారు 34 లక్షల మంది సర్టిఫికేషన్ పొందిన అభ్యర్థులకు చెల్లింపులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని నివేదిక పేర్కొంది. శిక్షణ కేంద్రాలు మూసివేసినా, శిక్షణ కొనసాగుతున్నట్లు రికార్డుల్లో చూపించడం, ఒకే ఫోటోను అనేక లబ్ధిదారులకు వాడటం వంటి అక్రమాలు చోటుచేసుకున్నాయని నివేదిక పేర్కొంది. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన భారత యువతకు నైపుణ్యాలు అందించి ఉపాధి అవకాశాలు పెంచాలన్న గొప్ప లక్ష్యంతో ప్రారంభమైన పథకం. కాగ్ నివేదిక చూపిస్తున్న వాస్తవాలు, లక్ష్యాలు, అమలులో ఉన్న లోపాల మధ్య పెద్ద అంతరం ఉందని స్పష్టం చేస్తున్నాయి.

# విదేశాల్లో చదువులు..వర్సిటీ ఎంపిక కీలకం

విదేశాల్లో చదవాలి అనుకునేవారు లేదా తమపిల్లలను విదేశాల్లో చదివించడానికి పంపే తల్లిదండ్రులు ముందుగా యూనివర్సిటీల ఎంపిక చేసుకోవాలి. ఆ సమయంలో పలు అంశాలు పరిశీలించాలి. వీసాలు, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, ప్రవేశ అర్హతలు వంటి అంశాలను చాలామంది కుటుంబాలు ఇప్పటికే పరిశీలించాయి. అయితే ఇప్పుడు భారతీయ తల్లిదండ్రుల ఆలోచనలు ర్యాంకింగ్స్ లేదా ప్రముఖ దేశాలకే పరిమితం కాకుండా, ఇతర దేశాల పట్ల కూడా అనుమానాస్పదంగా మారుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడిపై లాభం (ఆర్ఒఐ), ఉద్యోగ అవకాశాలు, ఖర్చుల భరించగలగడం, భద్రత కీలకాంశాలుగా మారాయి. అదే విధంగా, పెరుగుతున్న ఖర్చులు, విధాన మార్పులు, ఉద్యోగ మార్కెట్ అనిశ్చితి నేపథ్యంలో తల్లిదండ్రులు విదేశీ విద్యను మరింత జాగ్రత్తగా విశ్లేషిస్తున్నారు. కేవలం అంతర్జాతీయ డిగ్రీ కాకుండా, ప్రాక్టికల్ నైపుణ్యాలు, పని అనుభవం, కెరీర్ స్పష్టత ఇవ్వగల కోర్సులకే ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో 2026లో యూనివర్సిటీని ఖరారు చేసే ముందు కెరీర్ ఫలితాలు, ప్లేస్‌మెంట్ అవకాశాలు ఎలా తెలుసుకోవాలి. ఎందుకంటే, 2026లో డిగ్రీ ఒక్కటే ఉద్యోగానికి హామీ కాదు. కోర్సు ప్రాముఖ్యత, వర్క్–వీసా మార్గాలు, చదువుతూనే లభించే పని అనుభవమే కీలకం. కేవలం ప్లేస్‌మెంట్ శాతాలు మాత్రమే కాకుండా, ఉద్యోగ రకాలు, రంగాలు, ఉద్యోగం దొరికే కాలం లేదా సమయం, సగటు జీతాలు వంటి వివరాలు పరిశీలించాలి. ఇంటర్న్‌షిప్‌లు, కో–ఆప్ ప్రోగ్రామ్‌లు, ఇండస్ట్రీ ప్రాజెక్ట్‌లు ఉన్న కోర్సులు ఎక్కువ అవకాశాలు ఇస్తాయి. మొదటి ఉద్యోగం కంటే కూడా దీర్ఘకాలిక కెరీర్ వృద్ధిపై దృష్టిపెట్టాలి. యూనివర్సిటీ లేదా కోర్సు విశ్వసనీయత ఎంత? అనేది కూడా చూడాలి. ఎందుకంటే, ఈ రోజుల్లో ర్యాంకింగ్స్ మాత్రమే ప్రమాణం కాదు. ఉద్యోగాలు ఎవరిస్తారు అనేది గమనించాలి. దేశం ఆధారంగా కాకుండా, నగరం, కోర్సు పూర్తయ్యే వరకు వచ్చే మొత్తం ఖర్చు ఆధారంగా లెక్కించాలి. తక్కువ ఖర్చుతో ఉన్న ప్రాంతాలు మంచివిగా కనిపించినా, ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్ లేకపోతే దీర్ఘకాలంలో నష్టం కలగవచ్చు. ఇక, క్యాంపస్ ఎంత భద్రమైనది, ఎంత మద్దతు ఇస్తుంది? అనేది కూడా ముఖ్యమే. భద్రత అంటే కేవలం శారీరక రక్షణ కాదు... అకాడమిక్ అడ్వైజింగ్.. కౌన్సెలింగ్.. మెంటల్ హెల్త్ సపోర్ట్.. అంతర్జాతీయ విద్యార్థుల సేవలు వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. అందుకే, అలాంటి వర్సిటీలను ఎంపిక చేసుకోవాలి. ఏ రకంగా చూసినా, విదేశీ విద్య ఒక పెద్ద పెట్టుబడి. కాబట్టి నిర్ణయం తీసుకునే ముందు పేరు, ర్యాంకు కంటే ఫలితాలు, విలువ, భవిష్యత్ అవకాశాలు ముఖ్యమని తల్లిదండ్రులు గుర్తిస్తున్నారు. సరైన యూనివర్సిటీ అంటే, చదువు పూర్తయ్యాక దారిని చూపేది. నైపుణ్యాలు, అనుభవం ఇచ్చేది. దీర్ఘకాలిక కెరీర్‌కు బలమైన పునాది వేసేది.



# మిత్రపక్షాల విజయంతోనే అభివృద్ధికి బాటలు

## అభివృద్ధిని అడ్డుకుంటున్న బిఆర్ఎస్; బిజెపిలకు ఓటు అడిగే హక్కు లేదు

### చండూరు కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/చండూరు** : మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, సిపిఐ మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి బాటలు వేసుకోవాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం చండూరులో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ ప్రచార సభలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ చండూరు మున్సిపాలిటిలో చాలా సమస్యలున్నాయి, వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత తనపైనే ఉందన్నారు. చండూరు మునిసిపాలిటీలోని 10వార్డులలో కాంగ్రెస్, సిపిఐ మిత్రపక్ష సభ్యులను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని భరోసా ఇచ్చారు. దోపిడీ, అవినీతికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన గొంతు వినిపించే పరిస్థితి వస్తే నేను ముందుంటానన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో రేషన్ కార్డులు, సన్న బియ్యం వస్తున్నాయన్నారు. చండూరు మున్సిపాలిటీలో ఇంటి స్థలాలు లేని నిరుపేదలందరికీ త్వరలోనే ప్రభుత్వ భూమిని గుర్తించి ఇండ్లు కట్టిస్తానన్నారు. చండూరులో ఇప్పటివరకు 10శాతం అభివృద్ధి మాత్రమే జరిగిందని, ఇంకో 90శాతం అభివృద్ధి చేసుకోవాలన్నారు. నా బలం, బలగం మునుగోడు ప్రజలేనని, మీరు వెంట ఉంటే ఎంత దూరమైనా వెళ్లి కొట్లాడుతానన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉండి అభివృద్ధి చేయని బిఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉండి అభివృద్ధికి నిధులు ఇవ్వని బిజెపి పార్టీలకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. కాంగ్రెస్ మద్దతుతోనే తను శాసనమండలి సభ్యుడిగా ఎన్నికయ్యానని నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా సాగు, తాగునీరు ప్రాజెక్టులతో పాటు రోడ్ల అభివృద్ధి, విద్యుత్తు ఆధునీకరణ కోసము కలిసి పని చేస్తామన్నారు. ప్రచారం కార్యక్రమంలో పది వార్డుల అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలపై పోరాడే వారిని గెలిపించండి



## సీతారామయ్య, కలవేన శంకర్ వినతి

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్** : అనునిత్యం ప్రజాక్షేత్రంలో కొనసాగుతూ వారి సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పనిచేసేవారిని అభ్యర్థులుగా గెలిపించుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ ఓటర్లను కోరారు. సోమవారం నస్పూర్ మండలం శ్రీరాంపూర్ టిఎస్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో 17వ వార్డు కౌన్సిలర్‌గా గెలిచి అనేక అభివృద్ధి పనులు చేసినట్టు తెలిపారు. అదే స్ఫూర్తితో ఆరో డివిజన్‌లో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి మేకల దాసును భారీమెజార్టీతో గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచి కార్యదర్శి ఎస్‌కె. బాజీ సైదా, మల్లయ్య, రాచర్ల చంద్రమోహన్, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మారుమల్లయ్య, కార్యదర్శి లింగం రవి, పూజారి రామన్న, కొత్తపల్లి మహేష్, సిపిఐ శ్రేణులు పాల్గొన్నారు.

## కూనంనేని చేసిన అభివృద్ధిని

# గెలుపుబాటగా మార్చుకుందాం



### సిపిఐ వెంటే కొత్తగూడెం కార్పొరేషన్ ప్రజానికం

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం** : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వెంటే కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని ప్రజానికం ఉన్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా ధీమా వ్యక్తం చేశారు. కొత్తగూడెం, పాల్వంచలోని పలు డివిజన్లలో చేపట్టిన రోడ్ షోకు అపూర్వ స్పందన లభిస్తోందని, సంఖ్యా సమస్య కారణంగా కార్పొరేషన్ వ్యాప్తంగా సిపిఐ అభ్యర్థులు పోటీలో ఉన్నారని, సిపిఐ అభ్యర్థులను గెలిపించుకుందామని ఓటర్లకు పిలుపినిచ్చారు. ప్రజల కోసం పనిచేసే వారిని కార్పొరేషన్‌కు పంపడం ద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అవినీతి రహిత పాలన సాగాలంటే కమ్యూనిస్టులతో మాత్రమే సాధ్యమన్నారు. కూనంనేని ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి చేసిన అభివృద్ధిని గెలుపు మంత్రంగా మార్చుకుందామని చెప్పారు. మోసపూరిత వాగ్దానాలతో ప్రలోబాలకు గురిచేసేందుకు కొందరు వస్తుంటారని, అలాంటి వారి పట్ల ఓటర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలతో మమేకమయ్యే కమ్యూనిస్టుల ఎన్నికల గుర్తు కంకి కొడవలికి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యక్రమాల్లో సిపిఐ నాయకులు నెరేళ్ల రమేష్, బత్తుల నాగరాజు, యూసుఫ్, గెద్దాడు నగేష్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, పి.సత్యనారాయణ చారి, తుమ్మ నర్సయ్య, గడ్డం ప్రభాకర్, మూడెత్తుల శ్రీను, సర్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.





# కమ్యూనిస్టు అభ్యర్థులను ఆదరించాలి

### సిపిఐ గద్వాల జిల్లా కార్యదర్శి ఆంజనేయులు



**ప్రజాపక్షం/గద్వాల రూరల్** : ఎర్రజెండాతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు పేర్కొన్నారు. గద్వాల మున్సిపల్‌లో 30వ వార్డు నుంచి సిపిఐ అభ్యర్థిగా పోటీచేస్తున్న అడ్వకేట్ రమేష్ గెలిపించాలని ఆయన కోరారు. సోమవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారం చివరి రోజు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి 30వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి వేసి కౌన్సిలర్‌గా గెలిపించి మున్సిపాలిటీకి పంపాలని విజ్ఞప్తి చేశారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన అడ్వకేట్ రమేష్‌ను 30వ వార్డు నుండి గెలిపించుకుని మున్సిపాలిటీలో ప్రజా సమస్యల పై నిలదీసే వ్యక్తిగా పంపాలన్నారు. వార్డు అభివృద్ధికి కావాల్సిన నిధులను మున్సిపల్ నుండి తీసుకొచ్చి సమస్యలను తీర్చే శక్తి రమేష్‌కు ఉందన్నారు. కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి పేదల పక్షాన పోరాడే సిపిఐని గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. అభ్యర్థి రమేష్ మాట్లాడుతూ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా గొంతుక అవుతారని తెలిపారు. ప్రచారంలో సిపిఐ నాయకులు రంగన్న, వెంకట్రాములు, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షాన పోరాడేది సిపిఐయే

### సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఆదిలాబాద్/నిర్మల్** : మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలోని 11వ వార్డు రాంనగర్‌లో సిపిఐ అభ్యర్థి మావురపు లక్ష్మి నరసయ్య విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం సిపిఐ శ్రేణులు ముమ్మర ప్రచారం నిర్వహించాయి. సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో ఇంటింటికీ వెళ్లి 'కంకి కొడవలి' గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ముడుపు ప్రభాకర్‌దరెడ్డి మాట్లాడుతూ పేదల పక్షాన పోరాడే సిపిఐ అభ్యర్థులను గెలిపించేకుంటే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రభుత్వేతర పార్టీలను గెలిపించడంతో సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి పేదల పక్షాన పోరాడే సిపిఐని గెలిపించాలని కోరారు. ప్రచారం కార్యక్రమంలో నాయకులు ఎస్.వి.దాస్. షేక్ పాషా, భాస్కర్, కేశవ్ రాజు, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ అభ్యర్థుల గెలుపుతోనే

# సమస్యలు పరిష్కారం : బాగం



**ప్రజాపక్షం/ఖమ్మం** : మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల పరిధిలో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసేవారిని గెలిపిస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. కొందరు డబ్బులతో పదవులు పొందాలని చూస్తున్నారని, డబ్బులతో గెలిచిన వారు ప్రజల గురించి పట్టించుకోరని, ఎంత ఖర్చు చేశాం ఎంత లాభం తీసుకోవాలన్న ఆలోచనలోనే ఉంటారని ఆయన తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటులోనూ, ఆ ప్రాంతా అభివృద్ధిలోనూ సిపిఐ కీలక భూమిక పోషించిందన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పలుగ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పాఠశాలలు, ఇతర ప్రభుత్వ సంస్థల ఏర్పాటు సిపిఐ హయాంలోనే జరిగిందని హేమంతరావు తెలిపారు. మధిర మున్సిపాలిటీలో మడుపల్లి గ్రామాన్ని అభివృద్ధి పదంలో నడిపిన చరిత్ర సిపిఐకి మాత్రమే ఉందన్నారు. అనేక దశాబ్దాల పాటు మడుపల్లి గ్రామ పంచాయతీ సిపిఐ ఏలుబడిలో ఉందని ఇప్పుడు ప్రజలు అనుభవిస్తున్న అనేక అభివృద్ధి కార్యక్రమాల వెనక సిపిఐ కృషి దాగి ఉందని ఆయన తెలిపారు. మడుపల్లి పరిధిలోని ఏడవ వార్డులో సిపిఐ బలపర్చిన ఊట్ల కొండలరావు ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. వైరా మున్సిపాలిటీ 15వ వార్డులో సిపిఐ, బిఆర్ఎస్, సిపిఎం బలపర్చిన అభ్యర్థిగా నల్లమోతు శైలజ పోటీ చేస్తున్నారని ఆమెను గెలిపించాలని హేమంతరావు కోరారు. దిద్దుపూడి గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు సిపిఐ సర్పంచ్ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని ఆయన తెలిపారు. మున్సిపల్ ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి అభివృద్ధికాముకులను గెలిపించాలని ఆయన కోరారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

**అందరికీ విద్య పేరుతో కొందరికే విద్యను పరిమితం చేసిన ఘనత మన పాలకులది**

**యూనివర్సిటీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలి**

**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్**




**ప్రజాపక్షం/వరంగల్:** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సమరశీల ఉద్యమాలు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ బస్ స్టాండ్ రోడ్డులోని గిర్మాజిపేట గాంధీ భవన్ లో ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా 26వ మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ మహాసభలకు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పార్థసారథి అధ్యక్షత వహించారు. ఈ సభలకు ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికి విద్య పేరుతో కొందరికే విద్యను పరిమితం చేసిన ఘనత మన పాలకులదని ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను పూర్తిగా దూరం చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. నూతన జాతీయ విద్యావిధానం 2020 పేరుతో విద్యా కార్పొరేటికరణ, విద్యాకేంద్రీకరణ, కాషాయికరణ చేయాలని చూస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో రేషనలైజేషన్ పేరుతో 3,680 ప్రభుత్వ పాఠశాలల మూసివేయాలని చూస్తున్నారని, విద్యాసంస్థలు ప్రారంభమై ముగింపు దశకు వచ్చిన విద్యార్థులకు న్యాయమైన వసతులు కల్పించలేని దౌర్భాగ్య పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బాసర విద్యార్థుల బాధలు తీర్చలేని స్థితిలో పాలకులు ఉన్నారని, ఆశ్రమ విద్యాసంస్థల్లో కలుషిత ఆహారంతో విద్యార్థులు అల్లాడుతున్నారని దీనికి కారణాలేమిటో ప్రభుత్వం ఎందుకు బహిర్గతం చేస్తాలేదని ఆరోపించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న అధికారులను ఉద్యోగం నుండి తొలగించాలని అన్నారు. జూనియర్ కళాశాల్లో అమలు కాని మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలనీ, సమస్యల సుడిగుండంలో ప్రభుత్వ యూనివర్సిటీలు ఉన్నాయన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, 22 జిల్లాల్లో సైతం విద్యాధికారులు లేరని, కళాశాల విద్యాలో 7550 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు, యూనివర్సిటీలల్లో 2560 టీచింగ్, 3,000 నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 వేలకోట్ల రూపాయల స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు ఉండడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజులను వసూలు చేస్తున్న విద్యాశాఖ చోద్యం చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదాళ్ళ శరత్, శివ కుమార్, పవన్, అభిరామ్, శ్రేయాస్, ప్రభాస్, రాజు, సంతోష్, రాకేష్, నిఖిల్, భరత్ పాల్గొన్నారు

## ప్రచార హోరుకు బ్రేక్

**ప్రజాపక్షం/జనగామ :** మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. గత 15 రోజులుగా జనగామ జిల్లా హోరెత్తింది. మైక్ శబ్దాలతో మారుమోగింది. నాయకుల పర్యటనలు, సభలతో దద్దరిల్లింది. జనగామ జిల్లా కేంద్రం కావడంతో మేమంటే మేం జెండా ఎగరవేయాలనే ఉద్దేశ్యంతో పోటాపోటీగా ప్రచారాలు జరిగాయి. కాంగ్రెస్ నుండి మంత్రి సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి ప్రచారం చేశారు. బిఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపుకోసం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రచారం చేశారు. ప్రచారమంతా రోడ్ షోలతో, సభలతో ప్రచారం చేశారు. నామినేషన్ల విత్‌డ్రాలు, అభ్యర్థుల ప్రకటన అనంతరం మరింత పోటీగా ప్రచారం జరిగింది. కాంగ్రెస్ అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించగా, బిఆర్‌ఎస్ తాము గతంలో చేసిన పథకాలు, సంక్షేమాన్ని వివరించింది. ఇలా ఒకరిని మించి ఒకరు ప్రచారం చేశారు.

**ఇక డబ్బులు పంపిణీ పైనే**

ప్రచారాలు ముగిశాయి. కాళ్ల మొక్కడం, కడుపులో తలపెట్టి బ్రతిమిలాడడం, చేతులు పట్టుకొని దండం పెట్టడం వంటివి పూర్తయ్యాయి. ఇప్పుడు ఇక డబ్బులు పంపిణీ పైనే అభ్యర్థులు ఆధారపడి ఉన్నారు. ప్రిస్టేజ్‌గా భావించే చోట అధికారం పంపిణీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఓటుకు రెండు వేలకు పైగా ఇచ్చే అవకాశాలు సైతం లేకపోలేదు. ఒకొక వార్డులో 1300 నుండి 1600కు పైగా ఓట్లు ఉండగా ఆవరేజ్‌గా వెయ్యి ఓట్లకు పైగా డబ్బులు పంపిణీ చేయాలని కాంగ్రెస్, బిఆర్‌ఎస్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది. ఇక పోలీసులు మాత్రం డబ్బుల పంపిణీ అడ్డుకోవడం కోసం వార్డుకు ఒక ఎస్ఐ చొప్పున నియమించారు. శాంతి భద్రత సమస్య కూడా ప్రధానం కావడంతో పోలీసులు దానిపై దృష్టి పెట్టినట్లు తెలుస్తుంది.

## పోలింగ్ సిబ్బంది మూడవ ర్యాండమైజేషన్ ప్రక్రియ




**ప్రజాపక్షం/వరంగల్:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగాజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జనరల్ అబ్జర్వర్ కిల్లు శివ కుమార్ నాయుడు సమక్షంలో పోలింగ్ సిబ్బంది మూడవ ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ చాంబర్‌లో సోమవారం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అనుసరిస్తూ ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించగా, కలెక్టర్, జనరల్ అబ్జర్వర్లు దానిని నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ విధులు నిర్వర్తించేందుకు మూడవ ర్యాండమైజేషన్ ద్వారా మొత్తం 80 మంది ప్రిసైడింగ్ అధికారులు, 80 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 240 మంది ఇతర పోలింగ్ అధికారులను కేటాయించారు. జెడ్పీ సీఈఓ రామ్‌రెడ్డి, జిల్లా నోడల్ అధికారి నర్సింహమూర్తి, రంజిత్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## తొర్రూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/తొర్రూరు :** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని వార్డు అభ్యర్థులను గెలిపించుకొని కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం తొర్రూరు పట్టణ కేంద్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం చివరి రోజు కావడంతో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ ప్రెసిడెంట్ ఝాన్సీరాజేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి అన్నారం రోడ్డులోని రహదారిలో భారీ గజమాలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డిలను ఘనంగా సన్మానించారు. పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన ఈ బైక్ ర్యాలీ కాంగ్రెస్ జెండాలు పట్టుకొని నినాదాలు చేయడంతో తొర్రూరు పట్టణం హోరెత్తింది. ర్యాలీ అనంతరం హరిపిరాల క్రాస్ రోడ్డు వద్ద కార్నర్ మీటింగ్‌ను ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డిలు పాల్గొన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి వారు నీతులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేశారని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు, మండల నాయకులు, కౌన్సిలర్ అభ్యర్థులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యువ కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కలకలం రేపుతున్న కల్తీ మద్యం



**ప్రజాపక్షం/వేలేరు:** ఇందుకలదు అందుకలదు కల్తీ అనేసందేహంబు వలదు అన్నచందంగా కల్తీ వ్యవహారం రోజురోజుకు విచ్చలవిడిగా అవుతున్న తరుణంలో ఆదివారం వేలేరు మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలోని ఓబెల్టు షాపులో చోటు చేసుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది.ఆదివారం అదేగ్రామానికి చెందిన ఓవ్యక్తి గ్రామంలోని ఓబెల్టు షాపు నిర్వాహకుని వద్దకు వెల్లి మద్యం బాటిల్‌ను కొనుగోలు చేసి సేవించగా వాంతులు కాగా సదరు బెల్టు షాపు నిర్వాహకున్ని నిలదీయగా నాకేమితెలియదు బ్రాండ్ యాజమాన్యం అమ్మకం మేరకు అమ్మడం జరుగుతోందనే విషయం వివిధ సామాజిక మాధ్యమాలలో వైరల్ కాగా ఇట్టి విషయాన్ని సోమవారం కాజిపేట ఎక్సైజ్ శాఖఅధికారులు వేలేరు మండలకేంద్రంలోని సంబందించిన బ్రాండ్ షాపును తనిఖీ చేసి వెల్లినట్లుగా సమాచారం.కల్తీ మద్యం అమ్మకాలు చేస్తున్న బ్రాండ్ షాపును తక్షణమే సీజ్ చేయడంతో పాటుగా మండలంలోని బెల్టు షాపుల యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పోలింగ్ కేంద్రం పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల నిర్వహణలో భాగంగా ఈ నెల 11వ తేది బుధవారం జనగామ, ఘన్పూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట మున్సిపాలిటీలకు జరిగే ఎన్నికల సందర్బంగా పోలింగ్ జరిగే ప్రాంతాల్లో శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో బి.ఎన్.ఎస్. ఎస్ సి. ఆర్. పిసి 163 ప్రకారం ప్రజలు ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుంపులు గా చేరడం నిషేధించడం జరిగింది. ఈ నిషేధం రేపటి అనగా 10 తారీఖు ఉదయం 6 గంటల నుండి 11 తారీకు రాత్రి 8 గంటల వరకు అమలులో వుంటుందని. ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ హెచ్చరించారు.

## పోలింగ్ సందర్భంగా ప్రచార కార్యక్రమాలపై నిషేధం: కలెక్టర్

**ప్రజాపక్షం/హన్మకొండ:** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న పరకాల మునిసిపల్ పరిధిలో సోమవారం ఫిబ్రవరి 09వ తేదీ సాయంత్రం 5.00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసేంత వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరిష్ తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో పై పట్టణాలలో ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, ఎం.సి.సి బృందాలు, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు.మున్సిపల్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ఈ నెల 9వ తేదీ సోమవారం సాయంత్రం 5.00 గంటల నుండి 11వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు మద్యం షాపులను, కల్లు దుకాణాలను మూసివేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పురస్కరించుకుని ఈ నెల 13న కూడా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలని, కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలు లో ఉంటుందని తెలిపారు.

## పార్లమెంట్‌లో గళమెత్తిన ఎంపి కావ్య



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** ప్రధాన మంత్రి జన ధన్ యోజన (పీఎంజేడీవై) కింద ప్రారంభించిన ఖాతాల్లో పెద్ద సంఖ్యలో నిష్క్రియ (డార్మెంట్) ఖాతాలు కొనసాగుతుండటంపై, అలాగే ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన (పీఎంఎస్బీవై) కింద క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉండటంపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై లోక్‌సభలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాధానం ఇచ్చారు. ప్రభుత్వం వెల్లడించిన గణాంకాల ప్రకారం వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జనగాం తదితర జిల్లాల పరిధిలో జనధన్ ఖాతాలు 2023 మార్చిలో 10.80 లక్షల నుంచి 2025 మార్చికి 12.50 లక్షలకు పెరిగాయి. అయితే వీటిలో గణనీయమైన సంఖ్య ఇంకా వినియోగంలోకి రాకపోవడం గమనార్హం. 2026 జనవరి 21 నాటికి వరంగల్ జిల్లాలోనే సుమారు 2.99 లక్షల జన ధన్ ఖాతాలు డార్మెంట్‌గా ఉన్నట్లు కేంద్రం అంగీకరించింది. వీటిలో అత్యధికంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద 1.46 లక్షల ఖాతాలు ఉండగా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ తదితర బ్యాంకులు తరువాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే బ్యాంకుల వారీగా డార్మెంట్ ఖాతాల వివరాలు కేంద్ర స్థాయిలో నిర్వహించడం లేదని ప్రభుత్వం చెప్పడంతో, పథకాల వాస్తవ ప్రయోజనం ప్రజలకు అందుతోందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో పీఎంజేజేబీవై, పీఎంఎస్బీవై బీమా పథకాల కింద క్లెయిమ్‌లు ఉన్నప్పటికీ, వాటి పరిష్కారంలో ఆలస్యం జరుగుతోందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. 2026 జనవరి 14 నాటికి పీఎంజేజేబీవై కింద 35 క్లెయిమ్‌లు, పీఎంఎస్బీవై కింద 74 క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. గ్రామీణ, అర్ధనగర ప్రాంతాల ప్రజలు ఖాతాల యాక్టివేషన్, కేవైసీ (కేవైసీ) నవీకరణ, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్, బీమా అవగాహన, క్లెయిమ్ పరిష్కారంలో ఇంకా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డాక్టర్ కావ్య పేర్కొన్నారు. అర్హులెవ్వరూ ప్రయోజనాలకు దూరం కాకుండా తాను నిరంతరం పోరాడుతానని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు.

## డయాగ్నస్టిక్ సెంటర్లో అగ్నిప్రమాదం




**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** హనుమకొండ భవానీ నగర్ లోని ఏ టూ జెడ్ డయాగ్నస్టిక్ సెంటర్లో సోమవారం షార్ట్ సర్క్యూట్తో అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. ఎవరికీ గాయాలు కాలేదని, ఆస్తి నష్టంపై అంచనా వేస్తున్నామని సుబేదారి ఇన్స్పెక్టర్ రంజిత్ తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని ఆయన స్పష్టం చేశారు.

## స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గమే నా కుటుంబం

**బిఆర్ఎస్, బిజెపిలకు ఓటు వేస్తే మురికి కాలువలో వేసినట్టే**

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



**ప్రజాపక్షం/స్టేషన్ ఘనపూర్ :** స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని, మీరు వేసే ఓటు అభివృద్ధికి ఉపయోగపడాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ శివునిపల్లి పరిధిలోని 2,3,4,5,చాగల్ పరిధిలోని 6,7,8,9 వార్డులలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.... స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గమే నా కుటుంబం అని నాకున్న ఏకైక లక్ష్యం అని, నా ఆలోచన అంతా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం మాత్రమే అని స్పష్టం చేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం తోనే 30ఏళ్లుగా రాజకీయాలలో ఉంటున్నానని తెలిపారు. మీ మద్దతు తోనే కడియం శ్రీహరి అనే వ్యక్తి నీతి నిజాయితీకి మారుపేరుగా ఉండగలుగుతున్నని అన్నారు. 30ఏళ్ల నా రాజకీయ జీవితంలో ఏనాడూ అవినీతి అక్రమాలకు పాల్పడలేదని మీరు ఇచ్చిన అవకాశాన్ని ప్రజా సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం ఉపయోగిస్తూ నిజాయితీగా పని చేస్తున్నాని వెల్లడించారు. కడియం శ్రీహరి ఎమ్మెల్యే గా ఉన్నప్పుడే అభివృద్ధి జరిగింది అని చెప్పుకునే విధంగానే నా పని తీరు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, వార్డు ఇంచార్జ్ లు, పరిశీలకులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేటపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యం



**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** వర్ధన్నపేట ప్రజలను మోసం చేసిన రాజకీయ దొంగలకు ఈ మున్సిపల్ ఎన్నికల్లో చరమగీతం పాడటం ఖాయమని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు..12వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తిరుపల్లి వాణి–కుమారస్వామి, 8వ వార్డు అభ్యర్థి పాలకుర్తి సారంగపాణి, 10వ వార్డు అభ్యర్థి కొండేటి రజిత–సాంబయ్య, 3వ వార్డు అభ్యర్థి మహమ్మద్ అఫ్సర్, 9వ వార్డు అభ్యర్థి మంచాల లత–రామకృష్ణ, 5వ వార్డు అభ్యర్థి భూక్య స్రవంతి నరేష్, 6వ వార్డు అభ్యర్థి మలోతు దేవేందర్ అభ్యర్థులతో కలిసి ప్రజలను కలుసుకుని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలోకి వచ్చిన 8వ వార్డు మాజీ కౌన్సిలర్ శివరాత్రి చేరాలును కాంగ్రెస్ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ ప్రచార కార్యక్రమంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎన్నికల ఇన్చార్జి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ రియాజ్, మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, పాల్గొన్నారు.

## నల్లెల్ల స్వాతి భరత్ కుమార్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలి

**మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి సీతక్క**



**ప్రజాపక్షం/ములుగు:** కీ.శే స్వర్గీ య నల్లెల్ల కుమారన్న ఆశయాలతో ప్రజా సేవకై ఎన్నికల బరిలో నిలుస్తున్న నల్లెల్ల స్వాతి భరత్ కుమార్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ములుగు మున్సిపాలిటీ పరిధిలోని ప్రేమ్‌నగర్ 8వ వార్డు, ములుగు 9వ వార్డు, 20వ వార్డుల్లో రాష్ట్రమంత్రి ధనసరి అనసూయ సీతక్క ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ కీఃశే స్వర్గీయ నల్లెల్ల కుమారన్న ఆశయాలతో ప్రజలకు సేవచేయడానికి కుమారన్న కొడుకు కోడలు నల్లెల్ల స్వాతి భరత్ కుమార్ ముందుకు వచ్చారని, కాంగ్రెస్ పార్టీ నుండి ప్రేమ్‌నగర్‌లో 8వ వార్డులో కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వారిని ఆదరించి చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే 9వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి వేల్పురి శ్రావణి భరత్ రావును, 2వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి హాట్కర్ ప్రశాంత్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రానోత్ రవిచందర్, రేగ కళ్యాణి, శ్రీదేవి సుధీర్, సీనియర్ నాయకులు నద్దునూరి రమేష్, గౌసుద్దీన్, జిల్లా నాయకులు, మహిళా నాయకులు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పరకాల పట్టణాభివృద్ధి అధికార కాంగ్రెస్‌తోనే సాధ్యం

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**



**ప్రజాపక్షం/పరకాల:** పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని, పరకాల పట్టణాభివృద్ధి అధికార కాంగ్రెస్ పార్టీతో సాధ్యమని, మోసపూరిత బిఆర్ఎస్, బిజెపి పార్టీల నాయకుల మాటలను నమ్మవద్దు అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కోరారు. సోమవారం పరకాల మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఇంటింట ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలు, అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ చేతి గుర్తుకి ఓటు వేయాలని తెలిపారు. ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మవద్దని, గత ప్రభుత్వ పాలకుల వలనే పరకాల పట్టణం వెనుకబడిందన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ప్రజల కష్టసుఖాల్లో తోడు ఉండే అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఆలోచించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. పట్టణంలో సిసి రోడ్, డ్రైనేజీ వ్యవస్థ త్రాగునీరు మరిన్ని వసతులతో మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 వంట గ్యాస్, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ చీరలు, తదితర సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు.

## పోలింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

**ప్రజాపక్షం/జనగామ :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. డిస్ట్రిబూషన్ సెంటర్‌లో వసతులు బాగుండాలని, పోలింగ్ అధికారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, నాణ్యమైన బోజనం పెట్టాలన్నారు. ఈ నెల 11న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగనుండగా పోలింగ్ కేంద్రాలు, డ్రిస్టిబూషన్ ఏర్పాట్లు తదితర అంశాలపై అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డిసిపి రాజమహేంద్రనాయక్‌తో కలిసి ఆర్‌డిఓలు, మున్సిపల్ కమీషనర్లు, నోడల్ అధికారులతో గుగుల్ మీట్ ద్వారా సమీక్షించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ డిస్ట్రిబూషన్ సెంటర్‌లో పక్కాగా అన్ని ఏర్పాట్లు ఉండాలన్నారు. పోలింగ్ అధికారులకు నాణ్యమైన బోజనం అందిచాలని, పోలింగ్ కేంద్రాలకు వెళ్లెందుకు సరపడా వాహనాలను అందుబాటులో పెట్టాలన్నారు. పోలింగ్ అధికారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని, నోడల్ అధికారులు తమ పరిధిలో గల ప్రతి అంశంపైన బాధ్యతాయుతంగా విధులు నిర్వయించాలన్నారు. సమయానికి రిపోర్టింగ్ చేయాలని, వందశాతం వెబ్ కాస్టింగ్ జరిగే విధంగా ఏర్పాట్లు చేయాలని, ఎఫ్ఎస్‌టి, ఎస్‌ఎస్‌టి టీమ్‌లు అప్రమత్తంగా ఉండాలని, బ్యాలట్ పేపర్ జాగ్రత్తగా నిర్వాహణ ఉండాలన్నారు. పోలింగ్ అనంతరం ప్రతి ఒక్కరు నియమ నిబంధనలకు లోబడి పని చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే సిబ్బందిపై ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బంది అందరు బాధ్యతగా పనిచేసి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిటట్లు చూడాలన్నారు.

## అట్టాహసంగా కాంగ్రెస్ ర్యాలీ

**చివరి రోజు ప్రచారంలో విఫ్ బీర్ల ఐలయ్య, చామల, కొమ్మూరి**



**ప్రజాపక్షం/జనగామ :** జనగామ మున్సిపాల్టీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వ విఫ్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జనగామ నియోజకవర్గ ఇంఛార్జీ, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 11న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగనుండగా చివరి రోజైన సోమవారం ప్రచారం హోరెత్తింది. 5,20,21,22,23 వార్డుల్లో భారీ ర్యాలీ ర్యాలీ నిర్వయించారు. ఈ సందర్భంగా పలు చోట్ల బీర్ల ఐలయ్య, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్‌లు మిత్ర పక్షాలకు ఈ ఎన్నికల్లో పోటీ చేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం మున్సిపాల్టీలను పట్టించుకోకపోవడంతో పట్టణాల్లో దుర్గంధం వెదజల్లుతుందని, రోడ్లు గంతల మయం కావడంతో పాటు దోమలు, కోతుల, పందుల బెడద తీవ్రంగా ఉందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందని బిఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో ఇవ్వని రేషన్ కార్డులు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. రేషన్ కార్డుల వలన ఆరోగ్య శ్రీ వర్తించి అందరికి 10లక్షల వరకు నాణ్యమైన వైద్యం అందనుందన్నారు. అందుకే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. **జనగామ మున్సిపాల్టీపై ఎగిరేది కాంగ్రెస్ జెండాయే...కొమ్మూరి:** జనగామ మున్సిపాల్టీపై కాంగ్రెస్ జెండాయే ఎగురుతుందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంఛార్జీ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ప్రజలంగా కాంగ్రెస్ వైపు ఉన్నారని, దీనికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమే అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు.

## 24వ డివిజన్‌లో.. సిపిఐ నేతల విస్తృత ప్రచారం



**ప్రజాపక్షం/మణుగూరు :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 24వ డివిజన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోలుమూరి ధనలక్ష్మి ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ 24వ డివిజన్లో సిపిఐ పార్టీ నాయకులు విస్తృతంగా ఇల్లు ఇల్లు తిరుగుతూ గంధం, పసుపు కుంకుమ దిద్దుతూ మహిళలకి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిని గెలిపించాలని, నిత్యం ప్రజలలో ఉండే నాయకులను గెలిపించుకోవాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని చెబుతూ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో 24వ డివిజన్ అభ్యర్థి పోలుమూరి ధనలక్ష్మి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి జిల్లా సమితి సభ్యులు దుర్గ్యాల సుధాకర్, మహిళా సమైక్య జిల్లా నాయకురాలు బానోత్ శాంతి, స్థానిక నాయకులు దుర్గ, రాశి, లక్ష్మి, శ్రీను, సిరాజుద్దీన్, కిష్టాఫర్, జక్కుల నాగమణి, రూప, సింధు, నాగరాజు ,స్థానిక నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు.

## ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలి

నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

డిఎస్‌పి ఆదినారాయణ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎన్నికల ప్రచారం ముగియడంతో, ఈనెల 11న జరగనున్న ఎన్నికలు సజావుగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని డిఎస్‌పి ఆదినారాయణ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 33 డివిజన్ల వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.34వేల విలువచేసే 40 లీటర్ల మద్యం, 2 లక్షల 70 వేల విలువ చేసే 5.5 కేజీల గంజాయి స్వాదీనం చేసుకున్నట్లు చెప్పారు. మోడల్ కోడ్ ఆఫ్ కండెక్ట్ ఉల్లఘించినందుకు గానూ మూడు కేసులు నమోదు చేసినట్లు, 110 కేసుల్లో 258 మంది సమస్యాత్మక వ్యక్తులను బైండోవర్ చేయడం జరిగిందన్నారు. 41 పోలింగ్ స్థానాల్లో 110 పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో 65 సున్నితమైనవి కాగా, 45 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ఎన్నికల సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

## ఎంపిడిఒకు సమ్మె నోటీసు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఈనెల 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించి రఘునాథపాలెం ఎంపిడిఒ అశోక్‌కుమార్‌కు గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెలో గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. కార్మికులంతా పాల్గొని ఈ సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బానోత్ మంగీలాల్, కార్యదర్శి మేళ్లచెరువు రాజగోపాల్, నాయకులు రాము, లింగయ్య, శివలాల్, వీరన్న, సామ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు స్థలాల్లో అండర్ డ్రైనేజీ నిర్మాణంపై స్థానికుల అభ్యంతరం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి సంబంధించి పైపులైన్లు ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటు చేయవద్దంటూ స్థానికులు, రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఖమ్మం నగరంలో మురుగు నీటి తరలింపుకు సంబంధించి లకారం చెరువు ప్రాంతం నుంచి ధంసలాపురం పెద్ద చెరువు వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. డ్రైనేజీ నిర్మాణ పనుల్లో భాగంగా లకారం చెరువు వద్ద నుంచి కొత్తగూడెం, అల్లిపురం రోడ్డులోని గంగమ్మ గుడి వరకు ప్రస్తుతం ఉన్న వరద కాలువ పక్క నుంచి పైపులైన్‌లు ఏర్పాటు చేశారు. గంగమ్మ గుడి వద్ద నుంచి పైపులైన్ నిర్మాణాన్ని వాగు పక్క నుంచి కాకుండా దారి మళ్లించి 500 మీటర్ల ప్రైవేటు స్థలాల్లో నుంచి పైపులైన్ నిర్మాణం చేపట్టేందుకు అధికారులు పరిశీలన చేపట్టారు. ఇట్టి విషయం తెలుసుకున్న 15వ డివిజన్ కొత్తగూడెం వాసులు, రైతులు పైపులైన్ నిర్మాణ పనులపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గంగమ్మ గుడి వరకు ఏవిధంగా పైపులైన్ వేశారో అదేవిధంగా గంగమ్మ గుడి వద్ద నుంచి ధంసలాపురం చెరువు వద్ద ఏర్పాటు చేస్తున్న మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టిపి) వరకు వరద కాలువ పక్క నుంచే పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. వరద నీటి కాలువ నుంచే పైపులైన్ ఏర్పాటు చేయాలని ప్రైవేటు స్థలాల్లో పైపులైన్ నిర్మించవద్దని అభ్యంతరం వ్యక్తం చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతులు, స్థానికులు బుగ్గవీటి సరళ, ఎర్రబోయిన గోవిందరావు, చేతుల నాగేశ్వరరావు, మొర్రిమేకల కోటయ్య, సత్తి గోపాలరావు, మొర్రిమేకల వెంకటనారాయణ, చిన్నవెంకటయ్య, లక్ష్మయ్య, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి బియ్యం వితరణ

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** మృతుని కుటుంబానికి బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్లు 50 కేజీల బియ్యాన్ని వితరణ చేశారు. గ్రామానికి చెందిన జమ్మిశెట్టి రుచిత ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని గుత్తా వెంకటేశ్వర్లు సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గుండ్ల ముత్తయ్య, దేశగాని నర్సయ్య, దంతాల వెంకటేష్, మాజీ వార్డు సభ్యులు గంగిరెడ్డి విజయ్‌రెడ్డి, కాళంగి వీరబాబు, మద్దుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో పట్టణాల్లో ప్రశాంత వాతావరణం

మున్సిపల్ ఎన్నికల్లో

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క



ప్రజాపక్షం/ మధిర : రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు ఒడిఒడిగా ముందుకు సాగడానికి, సంక్షేమ ఫలాలు అన్ని వర్గాలకు చేరడానికి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లల్లో ఎన్నికలు జరుగుతున్నాయని కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సోమవారం మధిర పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపల్, విద్య రెండు శాఖలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఉన్నాయి, వారు ఈ రెండు శాఖలపై ప్రత్యేకంగా దృష్టి సారించి ముందుకు తీసుకువెళ్తున్నారని తెలిపారు. మురుగునీటిని శుద్ధి చేసేందుకు రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఎస్టిపిలు మంజూరు చేశామని, పట్టణాల్లో ఆసుపత్రులు, విద్యావ్యవస్థ, ఎలక్ట్రిసిటీ ఈ రంగాల్లో ప్రపంచంలో వస్తున్న పరిణామాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ప్రతినెల 15వ తేదీ తర్వాతే వచ్చేవి, కాని మేము అధికారంలోకి రాగానే ప్రతి నెల మొదటి తేదీనే ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జీతాలు జమ చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మా ప్రభుత్వం కృషి చేస్తుందని, ఉద్యోగుల సంక్షేమం కోసం కోటి రూపాయల ప్రమాద బీమా కార్యక్రమాన్ని అమలు చేయబోతున్నామని, ఉద్యోగుల సంక్షేమం కోసం ఉద్యోగ వర్గాలు కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. 2024 విజన్ డాక్యుమెంట్‌ను ఇటీవల గ్లోబల్ సమ్మెట్‌లో విడుదల చేశామని, మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దామని, ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తెలంగాణ రాష్ట్రం చేరుకుందని తెలిపారు. రాష్ట్రాన్ని పది సంవత్సరాలు పరిపాలించిన బిఆర్‌ఎస్ వారు పట్టణాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులు, మహిళలు అన్ని రంగాలను గాలికి వదిలేశారని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలు పెంచాలన్న ఆలోచనలను గత ప్రభుత్వం చేయలేదని అన్నారు. అటువంటి వారికి ఓట్లు వేస్తే సన్న బియ్యం పోయి తిరిగి మొద్దు బియ్యం వస్తాయి, ఆర్టిసి బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం ఉండదు, ఉద్యోగుల జీతాలు ప్రతినెలా 15వ తేదీన తర్వాతే పడుతాయన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ నగరాలు, పట్టణాలన్నింటిలో సాధ్యమైనంత వరకు మౌలిక సదుపాయలు, మెరుగైన వసతులు కల్పిస్తూ ముందుకు పోతుందని తెలిపారు. అర్హత కలిగిన పేద బడుగు బలహీన వర్గాల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఇచ్చామని అన్నారు. మన బిడ్డలకు ఉద్యోగాలు రావాలంటే స్కిల్స్ ఉన్న కోర్సులు నేర్పించాలి అందుకే రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఐటిఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దుతున్నామని, ఇవన్నీ కార్పొరేషన్లు, మున్సిపల్ కేంద్రాల్లోనే ఉన్నాయని తెలిపారు. రాబోయే 50 సంవత్సరాలకు మధిర పట్టణ అవరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు ప్రణాళికబద్ధంగా చేపడుతున్నట్లు డిప్యూటీసిఎం వివరించారు. వరద నీరు మధిర పట్టణంలోకి రాకుండా భారీ రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నామని, వైరా నదిని టూరిజం ప్రాజెక్టుగా అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్కులు, ఫుడ్ కోర్ట్ వంటివి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆధునిక స్మశాన వాటిక, మురుగునీరు కనబడకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజి, భారీ వర్షాలు వరదలు వచ్చినప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మధిర పట్టణానికి ప్రవేశించే మార్గాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేందుకు పార్కులు నిర్మిస్తున్నామని తెలిపారు. మై మధిర క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మిర్యాల రమణగుప్తా, రాష్ట్ర నాయకులు కొండబాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# చివరి రోజు హోరెత్తిన ప్రచారం

ఎర్రజెండా రెపరెపలు

ఎన్నికలు తెచ్చిన కూనంనేనికే

జై కొడుతున్న ప్రజలు



**ప్రజాపక్షం/పాల్వంచ :** గత వారం రోజుల నుండి హోరెత్తిన మైకుల హోరు సోమవారం సాయంత్రం ఐదు గంటల నుండి మూగబోయాయి. ప్రచారానికి చివరి రోజు సిపిఐ, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు తమ ప్రచారాన్ని హోరెత్తించారు. ఈ సందర్భంగా 38వ డివిజన్‌లో పోటీ చేస్తున్న చెరుకూరి శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గొత్తికోయల కొమ్ము నృత్యం విశేషంగా ఆకట్టుకొంది. దీనితో పాల్వంచలోని 26వ డివిజన్‌లలో ఎర్రజెండాలు రెపరెపలాడాయి. 1వ డివిజన్ వల్లపు లలిత కుమారి, 2వ, డివిజన్ పగిడిపల్లి ఆదిలక్ష్మి, 3 నుండి గుగులోత్ కల్పన, 4వ, డివిజన్ రావుల స్వాతి, 5 ఆలపాటి లీలావతి, 6, ఉప్పుశెట్టి రాహుల్, 7, బానోత్ శారద, 8, కాకటి దుర్గాభవాని, 9, వాడె లక్ష్మి, 31 నునావత్ శ్యామల, 32 ధర్మసోత్ మోతీలాల్, 33 వజ్జా రాజేశ్వరి, 34 భట్టు విజయ, 37 మడకం కమల, 38 చెరుకూరి శేఖర్‌బాబు, 39 మహమ్మద్ అస్లాం, 40 అడుసుమిల్లి సాయిబాబ, 41 గొర్రె అన్నపూర్ణ, 42 గుత్తా వెంకట క్రిష్ణారావు, 43 గోసనపల్లి వెంకటేష్, 44 వీసంశెట్టి విశ్వేశ్వరరావు, 45 మొగులూరి శివరామక్రిష్ణ (గౌతమి క్రిష్ణ), 46 మహమ్మద్ జిలానీబేగం, 47 గుర్రం వెంకటేశ్వర్లు, 48 గుగులోత్ బాలు, బోయిన విజయ కుమార్‌లు తమ డివిజన్ పరిధిలోని ప్రాంతాలలో హోరుగా ప్రచారం నిర్వహించారు. భారీ ఎత్తున కదిలి వచ్చిన కార్యకర్తలు, అభిమానులతో బైక్ ర్యాలీ, రోడ్ షోలతో ప్రచారాన్ని హోరెత్తించారు. ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. తమను గెలిపిస్తే డివిజన్‌లలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో చుట్టపు చూపుగా వచ్చిపోయే వారిని నమ్మొద్దని సూచించారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రజల పక్షాన పోరాటం చేసేది సిపిఐ అన్నారు. కార్పొరేషన్ నిధులు సద్వినియోగం కావాలంటే కమ్యూనిస్టు పార్టీని బలపరచాలన్నారు. ప్రజల కష్టాలు, సమస్యలు తెలిసిన కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించి ఎర్ర జెండాను అక్కున చేర్చుకోవాలన్నారు. పాలనలో జవాబుదారీతనంగా బాధ్యత వహిస్తామని స్పష్టం చేశారు. పాల్వంచ సమగ్రాభివృద్ధికి ఎన్నికలు తీసుకొచ్చిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు మద్దతు తెలుపుతూ తెలుగుదేశం, సిపిఐ పార్టీలు బలపరిచిన అభ్యర్థులకు ఓట్లేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, తెలుగుదేశం రాష్ట్ర నాయకులు జివి. రత్నాకర్, శనగారపు శ్రీనివాస్, సర్వయ్య, వైఎస్.గిరి, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, రామాచారి, మడుపు ఉపేంద్రాచారి, నల్లమల్ల వేణు, కఠారు చంద్రశేఖర్, కోటేశ్వరరావు, శ్రీరామినేని మోహన్, మేకా వరప్రసాద్, ఉప్పుశెట్టి సునీల్, వర్క అజిత్, నామా నవీన్, రాంబాబు, వనమా రామక్రిష్ణ, పాండురంగాచార్యులు, అన్నవరపు అశోక్, ఈశ్వరయ్య, లింగయ్య, శ్రీను, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సీతయ్య ఆశయ సాధన కోసం కృషిచేయాలి: భాగం



**ప్రజాపక్షం/చింతకాని :** సిపిఐ సీనియర్ నాయకులు , స్వాతంత్ర్య సమరయోధుడు నాగిలిగొండ గ్రామానికి చెందిన ఏపూరి సీతయ్య ధన్యజీవి అని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు పేర్కొన్నారు. నాగిలిగొండ గ్రామానికి చెందిన ఏపూరి సీతయ్య దశదిన కర్మ సోమవారం నాగిలిగొండ గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా సీతయ్య చిత్రపటానికి భాగం హేమంతరావు పూలమాల వేసి నివాళులర్పించారు. భాగం మాట్లాడుతూ సీతయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో కొరియర్‌గా పనిచేశారని, బ్రతికినంతకాలం ఎర్రజెండాని ఎత్తుకొని పార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషిచేశాడన్నారు.ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమం బలపడటానికి సీతయ్య పాత్ర ఎనలేనిదన్నారు. నేటి యువత సీతయ్యని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రజాసమస్యలపై పోరాటాలే సీతయ్యకు మనం ఇచ్చే ఘన నివాళులన్నారు. సీతయ్య ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు.. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందరావు, ఏనుగు గాంధీ, రావి శివరామకృష్ణ, రామాంజనేయులు, మల్లిఖార్జునరావు, కూచిపుడి రవి, పార్టీ మండల కార్యదర్శి గోపాలరావు, సహాయ కార్యదర్శులు మహేష్, శ్రీను, జిల్లా కౌన్సిల్ సభ్యులు మోహన్‌రావు, చిన్నమండవ, బస్వాపురం, తిరుమలాపురం సర్పంచులు రామచంద్రరావు, నర్సింహారావు, చాపలమడుగు వీరబాబు, సిపిఐ నాయకులు పదిమల వెంకటనర్సయ్య, కొల్లి రవికుమార్, తాళ్లూరి యాదగిరి, గుండ్ల బేబీరాణి, నాగిలిగొండ శాఖ కార్యదర్శి చాట్ల రమేష్, బాబు, ముఖర్జీ, షేక్ హుస్సేన్, ఏపూరి నర్సయ్య బస్వాపురం ఉపసర్పంచ్ చంద్రకాని నర్సింహారావు తదితరులు ఉన్నారు.

## ఎన్నికల సిబ్బంది కేటాయింపు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఈ నెల 11న జరగనున్న రెండో సాధారణ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సిబ్బందిని కేటాయించినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఐడిఒసి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ సాధారణ ఎన్నికల పరిశీలకులు అజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, సిఇఒ నాగలక్ష్మి తో కలిసి నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ముగ్గురు ఓపిఓలు చొప్పున ఎన్నికల సిబ్బందిని, అదనంగా 20 శాతం రిజర్వ్ సిబ్బందిని రాండమైజేషన్ విధానం ద్వారా కేటాయించినట్లు చెప్పారు. అశ్వారావుపేట పరిధిలో 42 మంది ప్రిసైడింగ్ అధికారులు, 126 మంది ఓపిఓలను కేటాయించినట్లు చెప్పారు. ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 62 మంది ప్రిసైడింగ్ అధికారులు, 187 మంది ఓపిఓలను కేటాయించినట్లు చెప్పారు. కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలో మొత్తం 241 మంది ప్రిసైడింగ్ అధికారులు, 723 మంది ఓపిఓలను కేటాయించినట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లా మొత్తంగా 288 పోలింగ్ కేంద్రాలకు గానూ 345 మంది ప్రిసైడింగ్ అధికారులు, 864 మంది ఓపిఓలు కలిపి మొత్తం 1036 మంది ఎన్నికల అధికారులను కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేలా అధికారుల సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

## ముగిసిన ప్రచార పర్వం.. సిపిఐ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం

కార్పొరేషన్‌వ్యాప్తంగా అపూర్వ ఆదరణ

అడుగడుగునా కూనంనేనికి నీరాజనం

అభ్యర్థుల గెలుపు కోసం శ్రమిస్తున్న నాయకుడు

ఇంటింటి ప్రచారంలో పాషా బిజీబిజీ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కార్పొరేషన్ ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది. జిల్లాలోని కొత్తగూడెం కార్పొరేషన్, ఇల్లెందు, అశ్వారావుపేట మున్సిపాలిటీలలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఆయా రాజకీయ పార్టీలు ప్రచారానికి తెరవేశారు. ఇన్ని రోజుల పాటు 60 డివిజన్ల వ్యాప్తంగా టిడిపి, ప్రజా సంఘాలతో కలిసి సిపిఐ తన అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారాన్ని హోరెత్తించడంతో ప్రత్యర్థులు బెంబేలెత్తుతున్నారు. అశ్వారావు పేట మున్సిపాలిటీ పరిధిలో 1వ వార్డు, ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో 2వ వార్డుల్లో సిపిఐ పోటీ చేసింది. ప్రధానంగా ఈ ఎన్నికల్లో కొత్తగూడెం కార్పొరేషన్‌వ్యాప్తంగా సిపిఐ, కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపిలు విడివిడిగా పోటీలో ఉన్నప్పటికీ బిజెపి మినహాయించి త్రిముఖ పోటీ కొనసాగనుంది. సిపిఐ జనరల్ స్థానాల్లో సైతం పార్టీ వీరవిధేయులుగా ఉండే ఎస్సి సామాజిక వర్గానికి చెందినవారికి కూడా సీట్లు కేటాయించారు. దీంతో ప్రతీ డివిజన్‌లో సిపిఐ తన సత్తా చాటేందుకు శక్తి వంచన లేకుండా పనిచేస్తోంది.

**గెలుపే లక్ష్యంగా..**

కూనంనేని అంటేనే ఫైర్ బ్రాండ్. ఆయన మదిలో ఆలోచన పడాలేగానీ మడమ తిప్పకుండా ముందుకు సాగే నైజం. ఎర్రజెండా నీడలో ఒదిగి ఎదిగిన కూనంనేని ఏ ఎన్నికనైనా సవాల్‌గా తీసుకుంటారనే ప్రచారం ఉంది. గత గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సైతం తనదైన శైలిలో రాజకీయ చాణక్యునిలా ముందుకు సాగి అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేలా కృషి చేశారు. మేజర్ గ్రామ పంచాయితీలను దక్కించుకుని కాంగ్రెస్ పార్టీ కంటే సిపిఐకి అత్యధిక ఓట్లు పోలయ్యేలా చక్రం తిప్పారు. స్థానిక కార్పొరేషన్ ఎన్నికల్లో సైతం ఒంటరి పోరు సాగిస్తున్న కూనంనేని సైన్యం, ఆయన దిశా నిర్దేశంతో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. అత్యధిక డివిజన్లను కైవసం చేసుకుని కార్పొరేషన్ తొలిపీఠం సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లవ్యాప్తంగా కలియతిరుగుతూ ఎమ్మెల్యేగా తాను చేసిన అభివృద్ధిని చెబుతున్న కూనంనేని గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

**పాషా బిజీబిజీ..**

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్ని డివిజన్లవ్యాప్తంగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్లవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తోంది. వీలైనంత వరకు ఓటర్లను స్వయంగా కలుస్తూ సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌లు, రోడ్ షోలకు పెద్ద ఎత్తున ఓటర్లు హాజరయ్యారు. అంచనాల ప్రకారం సిపిఐ 30 నుండి 35, కాంగ్రెస్ 18 నుండి 22, బిఆర్‌ఎస్, ఇతరులు 6 నుండి 8 డివిజన్లలో విజయం సాధించే అవకాశాలు ఉన్నట్లు విశ్లేషకుల వాదన.

## ఆర్థికాంశాలలో అప్రమత్తం

సైబర్ మోసాల పట్ల విస్తృత ప్రచారం కల్పించాలి

గోడప్రతులను ఆవిష్కరించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆర్థిక అంశాలలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆర్థిక అక్షరాస్యతపై రూపొందించిన గోడ ప్రతులను అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డిలతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పౌరుడికి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాల గురించి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తెలుసుకుని జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రస్తుతం మనం అధికంగా ఫోన్ ద్వారా లావాదేవీలు చేస్తున్నామని, సైబర్ నేరగాళ్లు మన ఫోన్ నుంచి సమాచారం సేకరించి బ్యాంకులో ఉన్న డబ్బును దోచే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ప్రముఖ వైద్యులు, వ్యాపారవేత్తలు కూడా సైబర్ మోసాలకు గురయ్యారన్నారు. మన ఫోన్ పాస్‌వర్డ్ ఆరు నెలలకు ఒకసారి మారుస్తూ ఉండాలని, ముఖ్యమైన ఖాతాలకు తప్పనిసరిగా రెండు ఫ్యాక్టర్ అథెంటికేషన్ పెట్టాలని, ఇకెవైసి వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఎస్ఎంఎస్‌లో వచ్చే ఫ్రాడ్ లింక్‌లను మనం క్లిక్ చేయవద్దని, వాట్సాప్ ద్వారా కలెక్టర్ ఉన్నతాధికారుల పేర్ల మీద మెసేజ్ చేస్తూ డబ్బులు అడుగుతూ మోసం చేస్తున్నారని, మనం ఒకరికి డబ్బులు పంపే ముందు ఒకటికి రెండు సార్లు ధృవీకరించుకోవాలన్నారు. ఫోన్‌లో అనవసర యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని, యాప్‌లకు అనుమతులు ఇచ్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

## సామగ్రి పంపిణీ, స్వీకరణ పకడ్బందీగా నిర్వహించాలి

కౌంటింగ్ కేంద్రాన్ని కట్టుదిట్టంగా పర్యవేక్షించాలి

డిస్ట్రిబ్యూషన్, లెక్కింపు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** మున్సిపల్ ఎన్నికలను పూర్తి స్థాయిలో నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియను అధికారులు పకడ్బందీగా ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈనెల 11న జిల్లాలో ఐదు మున్సిపాలిటీలలో నిర్వహించే మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ పెద్దతండాలోని ప్రియదర్శిని కళాశాలలో ఏర్పాటు చేసిన ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ సెంటర్లను కలెక్టర్ తిరుగుతూ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈనెల 10న ఎన్నికల సిబ్బంది అందించే సామగ్రి పంపిణీకి ముందస్తు ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. పోలింగ్ సామగ్రిని, పోస్టల్ బ్యాలెట్ పత్రాలు, పూర్తి సామగ్రి ఉందో లేదో ఎలా సరిచూసుకోవడం, బ్యాలెట్ బాక్స్, ఓటరు లిస్టు, బ్యాలెట్ పేపర్స్ చెక్ చేసుకోవడం, పోలింగ్ రోజున ఉదయమే సిబ్బంది పోలింగ్ స్టేషన్ వద్దకు చేరుకునేవిధంగా వాహనాల ఏర్పాట్లతో రూట్ ఆఫీసర్లు బాధ్యత వహించాలన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటూ సమయానికి అనుగుణంగా సిబ్బందికి భోజనం ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పెద్ద మున్సిపాలిటీ అయిన ఏదులాపురం నందు ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమైందని ప్రతి అంశంపైన క్షుణ్ణంగా అవగాహన చేసుకుని విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామగ్రి సేకరించడం, బ్యాలెట్ పేపర్స్ ఇవ్వడం, పివో డైరీ నింపడం, అన్ని ఫార్మ్ ఎలా నింపాలి, ఏజెంట్స్ సిగ్నేచర్ ఎక్కడ తీసుకోవాలి, పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్స్ సీలింగ్, స్ట్రాంగ్ రూం సెంటర్‌కు తరలింపు తదితర అంశాల మీద పూర్తి ఉండాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు వారికి ఏర్పాటు చేసిన చోటనే ఉండేలాగా చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు రిసెప్షన్ కేంద్రాలు, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి సునాయాసంగా తెలిసేలా సైన్‌బోర్డ్స్, వాహనాల పార్కింగ్‌కు అవసరమైన స్థలం ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూము వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఉండాలన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద నిబంధనల మేరకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం రిటర్నింగ్ అధికారి నవీన్‌బాబు, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపిడివోలు సురేందర్, ఎర్రయ్య, మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ, ప్రియదర్శిని కళాశాల యాజమాన్యం నవీన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

“మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న ‘డ్రాగన్’ సినిమా షూటింగ్ కోసం ఎన్టీఆర్ ప్రస్తుతం జోర్డాన్ వెళ్లారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఆయన కనిపించిన రగ్గడ్‌లుక్, గుబురు గడ్డం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.”

రీల్

## ’స్వయంభు’లో కత్తి యుద్ధం నేర్చుకున్న నిఖిల్



కార్తికేయ 2తో దేశ వ్యాప్తంగా ప్రశంసలు పొందిన నిఖిల్ ఇప్పుడు తన ప్రతిష్టాత్మక 20వ చిత్రం ’స్వయంభు’తో ప్రేక్షకులను అలరించబోతున్నారు. భారీ స్థాయిలో నిర్మించబడిన ఈ హిస్టారికల్ యాక్షన్ చిత్రానికి భరత్ కృష్ణమాచా రి దర్శకత్వం వహించారు. సంయుక్త, నభా నటేష్ హీరోయిన్ లుగా నటిస్తున్నా రు.పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్ పై భువన్, శ్రీకర్ నిర్మించారు. ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. పాన్‌ఇండియా విజన్ తో వస్తున్న స్వయంభు నిఖిల్ కెరీర్ లో మరో మై లు రాయిగా నిలవనుంది నిర్మాత ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ స్వ యంభు టీజర్ ఫిబ్రవరి 11న రిలీజ్ చేయనున్నట్లు నిర్మాత ప్రకటించారు. ఈ సందర్భం గా నిఖిల్ యాక్షన్ లుక్ తో కూడిన పోస్టర్ ను విడుదల చేశారు. స్వయంభు నిఖిల్ కెరియర్ లో హైయెస్ట్ బడ్జెట్ సినిమా. కార్తికేయ 2 తర్వాత పాన్ ఇండియా స్థాయిలో హ్యాజ్ బజ్ వున్న సినిమా ఇది. ఇందులో తన పాత్ర కోసం నిఖిల్ పూర్తిగా ఫిజికల్ ట్రాన్స్ ఫర్మేషన్ అవ్వడంతో పాటు ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకున్నారు.రాజమౌళితో ఐకానిక్ సినిమాలు అందించిన సెంథిల్ కుమార్ సినిమాకి డిఓపి గా పనిచేయడం విశేషం. కేజీఎఫ్, సలార్ ఫేం రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఎం. ప్రభాహరన్, రవీంద్ర ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. అన్ని పనులు పూర్తి చేసి స్వయంభు చిత్రాన్ని ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్ తమ్మిరాజు, మాటలు విజయ్ కామిశెట్టి, ఫైట్స్ కింగ్ సోలమన్, స్టంట్ సిల్వా, పాటలు రామజోగయ్య శాస్త్రి.

## ‘మృత్యుంజయ్’లో ఐపిఎస్ సీతాగా రేబా మోనికా



శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘మృత్యుంజయ్’. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహిస్తున్నారు. రమ్య గున్నం సమర్పణలో లైట్‌బాక్స్ మీడియా, పిక్చర్ పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్‌పై సందీప్ గున్నం, వినయ్ చిలకపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.‘సామజవరగమన’ మూవీ తర్వాత శ్రీవిష్ణు, రేబా మోనికా జాన్ జంటగా నటిస్తున్నారు. ఈ సినిమాలో రేబా మోనికా జాన్ పోషిస్తోన్న ఐపీఎస్ సీతా పరుశురామ్ పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. అందం, అభినయంతో కుర్రకారు హృదయాలను దోచుకున్న ముద్దుగుమ్మ రేబా జాన్ మృత్యుంజయ్ చిత్రంలో మరో ఆసక్తికరమైన పాత్రలో కనిపించనుంది. ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌లో ఆమె తనదైన నటనతో ఎలాంటి థ్రిల్స్ ఇవ్వనుందోనని అందరూ ఎదురు చూస్తున్నారు. మృత్యుంజయ్ చిత్రం ఫిబ్రవరి 27న థియేటర్లలో సందడి చేయబోతోంది. శ్రీవిష్ణు స్టైల్‌కు తగ్గట్టుగా రూపొందిన ఈ థ్రిల్లర్, మరో ఉత్కంఠతను రేపే ఎంటర్‌టైనర్‌గా నిలుస్తుందనే అంచనాలు ఉన్నాయని నిర్మాతలు అంటున్నారు. శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా వర్క్ చేస్తున్న ఈ చిత్రానికి విద్యాసాగర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా కాల భైరవ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. మనీషా ఎ.దత్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు.

# సరిపడే వినోదాన్ని అందిస్తాం..

### ‘ఆల్ఫా’ ట్రైలర్ లాంచ్ లో హీరో హేమంత్ కుమార్



ఎల్‌వి ప్రొడక్షన్స్ బ్యానర్ మీద హేమంత్ కుమార్, అయానా, గోపిక సురేష్ ప్రధాన పాత్రల్లో విజయ్ ఎన్ తెరకెక్కించిన చిత్రం ‘ఆల్ఫా’. ఉప శీర్షిక మెన్ లవ్ వెంజన్స్. ఈ సినిమాని హేమంత్ కుమార్, ఆనంద్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 20న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మూవీని తెలుగులో రవిశంకర్, మంజునాథ్ డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. ఈ క్రమంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు సముద్ర ముఖ్య అతిథిగా హాజరైయ్యారు.‘అంతా ఆ దేవుడి అనుగ్రహంతో జరుగుతుంది అంటే.. మరి ఆ రాక్షసులు’ అనే డైలాగ్‌తో ట్రైలర్‌ను ఓపెన్ చేశారు. ఇక వెంటవెంటనే చూపించిన యాక్షన్ సీక్వెన్స్, రౌడీ గ్యాంగ్, మాఫియా సీన్లు అన్నీ అదిరిపోయాయి. ‘నేను బరిలోకి కొత్తగా వచ్చాను.. ఆటకు కాదు’ అనే హీరో డైలాగ్ మాసీగా ఉంది. మధ్యలో హీరో, హీరోయిన్ ట్రాక్.. రొమాంటిక్ సీన్లు కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. ‘నాకు పాస్ట్, ప్రజెంట్, ఫ్యూచర్ అంతా మా నాన్నే’ అనే డైలాగ్‌తో ఇందులో ఫాదర్ సెంటిమెంట్, ఫ్యామిలీ ఎమోషన్స్ ఎలా ఉండబోతోన్నాయో చెప్పేశారు. ఇక చివర్లో షర్ట్ లెస్ సీన్, సిక్స్ ప్యాక్ చూపించిన తీరు మాస్ ఆడియెన్స్‌కి నచ్చేలా ఉన్నాయి. ట్రైలర్ రిలీజ్ చేసిన అనంతరం హీరో హేమంత్ కుమార్ మాట్లాడుతూ ‘నాకు తెలుగు సినిమాలంటే చాలా ఇష్టం. నాలాంటి కొత్త వాళ్ల చిత్రాల్ని ఇలా ఎంకరేజ్ చేయడం ఆనందంగా ఉంది. ప్రేక్షకులు పెట్టే డబ్బులకు సరిపోయే ఎంటర్‌టైన్‌మెంట్‌ను మేం అందిస్తాం. ప్రముఖ దర్శకుడు సముద్ర మాట్లాడుతూ ‘‘ఆల్ఫా’ ట్రైలర్ అద్భుతంగా ఉంది. కన్నడ నుంచి వస్తున్న హీరోలంతా ఇక్కడ సక్సెస్ కొడుతున్నారు. యశ్, రిషబ్ శెట్టిలా హేమంత్ కూడా పెద్ద విజయాన్ని అందుకోవాలి. ‘కేజీయఫ్’, ‘కాంతార’ స్థాయిలో ‘ఆల్ఫా’ని ఆడియెన్స్ ఆదరించాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు.హీరోయిన్లు అయానా, గోపికా సురేష్, డిస్ట్రిబ్యూటర్ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉర్రూతలూగించేలా ‘యమ యమ్మ’



విశ్వక్ సేన్, దర్శకుడు కె.వి. అనుదీప్ కలయికలో వస్తున్న ‘ఫంకీ’ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, ‘ధీరే ధీరే’, ‘రట్టాటటావ్’ పాటలకు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా ఈ చిత్రం నుంచి మూడవ గీతం ‘యమ యమ్మ’ విడుదలైంది.తి రుపతిలో ఈ గీతావిష్కరణ వేడుక ఘనంగా జరిగింది. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ మాస్ గీతం విన్న వెంటనే ఆకట్టుకునేలా ఉంది. అందరూ కాలు కదిపేలా భీమ్స్ అందించిన ఉత్సాహభరిత సంగీతం, ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దేవ్ పవార్ అందించిన సాహిత్యం, మాస్ పాటకు తగ్గట్టుగా మళ్ళీ మళ్ళీ పాడుకునేలా ఉంది. గాయని రోహిణి సోరట్ తో కలిసి సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ పాటను ఆలపించడం విశేషం. తమ ఉత్సాహభరితమైన గాత్రంతో పాటను మరో స్థాయికి తీసుకెళ్లారు. నాయకానాయికలు విశ్వక్ సేన్, కయాదు లోహర్ పై చిత్రీకరించిన ఈ పాట.. అదిరిపోయే మాస్ బీట్లు, ఆట సందీప్ మాస్టర్ అద్భుతమైన నృత్యరీతులతో మాస్ పాటల అభిమానులకు విందు భోజనంలా మారింది. గీతావిష్కరణ కార్యక్రమంలో విశ్వక్ సేన్ మాట్లాడుతూ ‘ఒక మంచి సినిమా అందించాలనే ఉద్దేశంతోనే సంవత్సరం విరామం తీసుకొని ఫంకీ సినిమా చేశాను. ఈ చిత్రం మీ అందరినీ మెప్పిస్తుంది. ఇదొక క్లీన్ ఎంటర్టైనర్. మీ కుటుంబంతో కలిసి థియేటర్ కి రండి. రెండు గంటల పది నిమిషాల పాటు అన్నీ మర్చిపోయి కడుపుబ్బా నవ్వుకుంటారు. ఫిబ్రవరి 13న థియేటర్లలో కలుద్దాం. మిమ్మల్ని ఈ సినిమా అసలు నిరాశపరచదు.‘ అన్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతానికి శ్రోతలలో ఉండే ఆదరణ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా తొలి గీతం ‘ధీరే ధీరే’, రెండో గీతం ‘రట్టాటటావ్’ చార్ట్‌బస్టర్స్ గా నిలిచాయి. ఇప్పుడు ‘యమ యమ్మ’ కూడా అదే జోరును కొనసాగిస్తూ సంగీత ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇటీవల విడుదలైన ‘ఫంకీ’ ట్రైలర్ విశేష స్పందనను సొంతం చేసుకుంది అన్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఎక్కడా రాజీ పడకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఒకరోజు ముందుగా ఫిబ్రవరి 13న థియేటర్లలో ఫంకీ’ చిత్రం విడుదల కానుంది.

## విప్లవ వీరుడు’ షూటింగ్ ప్రారంభం



భారత స్వాతంత్ర సంగ్రామంలో సామాన్యులే వీరులై పోరాడిన చరిత్రను తెరకెక్కిస్తున్న మూవీ ‘విప్లవ వీరుడు’. ప్రముఖ నటి ఇంద్రజ కీలక పాత్రలో జైశ్వర్ సోనాలి జంటగా ఎస్ నాగరాజ్ రావు దర్శకత్వంలో ఏవీ జయరాం నిర్మిస్తున్న ఈ సినిమా ఫిలింనగర్ దైవ సన్నిధానంలో పూజా కార్యక్రమాలతో షూటింగ్ ప్రారంభించుకుంది. ముహూర్తం షాట్‌కు ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ ఇంద్రజపై క్లాప్ కొట్టి సినిమా షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంద్రజ మాట్లాడుతూ, సామాన్య ప్రజలు కూడా స్వాతంత్ర పోరాటంలో ఎలా పాల్గొన్నారు అనే అంశాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నాం. ఒక సామాన్యుడు విప్లవ వీరుడిగా మారి స్వతంత్ర ఉద్యమంలో వీరోచితంగా పోరాడే కథ ఇది. ఈ చిత్రంలో నేను రాణి భవానీదేవి పాత్రలో కనిపించబోతున్నాను.హీరో జైశ్వర్ మాట్లాడుతూ విప్లవ వీరుడు పాత్రలో ప్రేక్షకుల ముందుకు రానున్నాను. ఈ పాత్ర నాకు ఎంతో ప్రత్యేకం. సినిమా చరిత్రలో నిలిచిపోతుంది అని చెప్పారు. హీరోయిన్ సోనాలి మాట్లాడుతూ, నాకు ఇంత అద్భుతమైన అవకాశం ఇచ్చినందుకు ఎంతో కృతజ్ఞతలు. ఇది నా మొదటి సినిమా. దర్శకుడు ఎస్ నాగరాజు రావు మాట్లాడుతూ ఇది నా డ్రీమ్ ప్రాజెక్ట్. బ్రిటిష్ కాలం నాటి హిస్టారికల్ కథతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. ఇందులో ఇంద్రజ గారు కీలకమైన పాత్రలో నటిస్తున్నారు అని తెలిపారు. నిర్మాత ఏవీ జయరాం మాట్లాడుతూ,టిప్పు సుల్తాన్ కాలం నాటి కథ ఇది. బ్రిటిష్ వారు వ్యాపారం పేరుతో దేశాన్ని ఎలా దోచుకున్నారో, ఆ పరిణామాలను ఈ సినిమాలో చూపిస్తున్నాం. మంచి సందేశం ఇచ్చే సినిమా అవుతుంది అని చెప్పారు. ఈ చిత్రానికి డిజిపి : మాత్యు రాజన్ మ్యూజిక్: ఉదయ్, ఎడిటర్: ఎం ఎన్ ఆర్ .

## ‘ఆకాశంలో ఒక తార’ క్లైమాక్స్



పాన్‌ఇండియా స్టార్‌డమ్‌తో దూసుకుపోతున్న వెర్సటైల్ హీరో దుల్కర్ సల్మాన్ తాజాగా న టిస్తున్న చిత్రం ’ఆకాశంలో ఒక తార’. విలక్షణ క థలతో ఆకట్టుకునే పవన్ సాదినేని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా సమర్పణలో ఈ చిత్రాన్ని సందీప్ గున్నం, రమ్య గున్నం నిర్మిస్తున్నారు. దుల్కర్ సరసన కొత్త హీరోయిన్ సాత్విక వీరవల్లి కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమా క్లైమాక్స్ షూటింగు రాజమండ్రిలో జరుగుతోంది. శృతి హాసన్ ఈ చిత్రంలో ఒక కీలక పాత్ర చేస్తున్నారు. ఇప్పటికే శృతి హాసన్ పాత్రకు సంబధించిన ఫస్ట్ లుక్ విడుదల చేశారు.ఈ చిత్రానికి జి.వి. ప్ర కాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సుజిత్ సారంగ్ సినిమాటోగ్రఫర్‌గా పని చే స్తున్నారు. శ్వేతా సాబు సిరిల్ ప్రొడక్షన్‌ను పర్యవేక్షిస్తున్నారు.ఈ చిత్రం వేసవిలో తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషలలో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

## సిపిఐ సంపూర్ణ మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

రక్షించాలని డి.రాజా తన ప్రకటనలో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా, ఖేత్ మజ్దూర్ యూనియన్లు మద్దతుతో కేంద్ర కార్మిక సంఘాలు గురువారం సార్వత్రిక సమ్మెకు పిలుపు ఇచ్చాయి. అమెరికా–యూరప్ దేశాలతో ఇటీవలి వాణిజ్య ఒప్పందాలు దేశంలో రైతుల ప్రయోజనాలకు తీవ్రమైన సవాళ్ళగా మారాయని, అందువల్ల రైతుల ప్రయోజనాలు రక్షించేందుకు ప్రభుత్వం నుండి సరైన వివరణ, ఒక కార్యాచరణ ప్రక్రియ చాలా అవసరమని కోరారు. అదేవిధంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో తెచ్చిన వికసిత్ భారత్–గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) చట్టం–2025తో గ్రామీ ఉపాధి హామీ పథకం ప్రాథమిక హక్కులను అణచివేశారని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం, తీవ్ర అసహనం తాండవిస్తున్న తరుణంలో ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడిందని, అదేవిధంగా ఈ పథకం కింద ఆర్థిక భారాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల్లో ప్రభుత్వాలపై నెట్టివేయడం ఎంత మాత్రం సమ్మతం కాదని, అందువల్ల ఈ భారాలను వెంటనే వెనక్కు తీసుకోవాలని డి.రాజా కోరారు.

# వచ్చేవారం రాజీనామా?

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి. ఆయన నియమించిన పీటర్ మాండెల్సన్ దౌత్యవేత్త పదవికి రాజీనామా చేసి ఈనెలారంభంలో లేబర్ పార్టీ నుండి కూడా వైదొలగినప్పటికీ, ప్రతిపక్షాలు స్టార్‌మర్‌ను వదిలిపెట్టడంలేదు. మాండెల్సన్ అదేపనిగా అబద్ధాలు చెప్పారని, ఎప్‌స్టీన్‌తో ఎంత లోతుగా ఆయనకు సంబంధాలున్నాయో తెలియదని, ఈ విషయంలో తనను క్షమించాలని గతవారంలోనే స్టార్‌మర్ ఒక ప్రకటన విడుదల చేశారు. కానీ, స్టార్‌మర్ ఉద్దేశపూర్వకంగా మాండెల్సన్‌ను కాపాడేందుకు ప్రయత్నం చేశారని, మాండెల్సన్‌ను శిక్షించాల్సిందేనని, ప్రధానమంత్ర రాజీనామా చేయాల్సిందేనని ప్రతిపక్షాల నుండి రోజు రోజుకూ విపరీతమైన ఒత్తిడి పెరుగుతోంది. ఆయన విమర్శలపాలవుతున్నారు. స్టార్‌మర్ ప్రభుత్వాన్ని నడిపించడంలో మెక్‌స్వీనీ ప్రధాన సూత్రధారి. ఇప్పటికే స్టార్‌మర్ సిబ్బందికి ప్రధానాధిపతిగా ఉన్న మోర్గాన్ మెక్‌స్వీనీ ఆదివారం తన పదవికి రాజీనామా చేశారు. పీటర్ మాండల్సెన్‌ను నియమించాలని ప్రధానమంత్రి స్టార్‌మర్‌కు సలహా ఇచ్చినందుకుగాను పూర్తి బాధ్యత వహిస్తూ మోర్గాన్ మెక్‌స్వీనీ పదవి నుండి వైదొలగారు. ఐతే ఆయన రాజీనామా స్టార్‌మర్ రాజీనామాకు ఎలా దారితీస్తుంది? స్టార్‌మర్‌పై మెక్‌స్వీనీ,మాండెల్సన్ ప్రభావం ఎంత ఉంది? అనే విషయాలు రాబోయే వారం రోజుల్లో బయటపడనున్నాయి.

ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మాండెల్సన్ భాగోతం గత ఏడాదిలోనే బయట పడింది. ఎప్‌స్టీన్‌తో రాసుకుపూసుకు తిరిగిన మాండెల్సన్‌కు నిధులు కూడా ముట్టాయి. దీంతో గడచిన సెప్టెంబరునెలలో మాండెల్సన్ అమెరికాలో బ్రిటన్ దౌత్యవేత్త పదవికి రాజీనామా చేశారు. తాజాగా అమెరికా ఫెడరల్ న్యాయస్థాన విభాగం డిఓజె జనవరి 30వ తేదీ విడుదల చేసిన పత్రాలలో ఆయన అవినీతి చరిత్ర, స్త్రీలతో సంబంధాలు వెలుగుచూడటంతో స్టార్‌మర్ ప్రభుత్వం ప్రతిష్ఠ కోల్పోయింది. ఇక తనవల్ల లేబర్‌పార్టీ సమస్యలకు గురికాకూడదని ప్రకటిస్తూ ఆయన పార్టీకి రాజీనామా చేశారు.

ఐతే తాను ఎలాంటి తప్పూ చేయలేదని ఇప్పటికీ ఆయన వాదిస్తున్నారు. ‘మాండెల్సన్‌ను అమెరికాలో బ్రిటన్ దౌత్యవేత్తగా నియమిస్తూ తప్పుడు నిర్ణయం తీసుకున్నాం, దానికి నేనే పూర్తి బాధ్యత వహిస్తున్నాను, ఆయన లేబర్‌పార్టీ పరువు ప్రతిష్టలకు భంగం కలిగించారు, దేశాన్ని భ్రష్టుపట్టించారు, రాజకీయాల్లో దేశ విశ్వాసాన్ని గంగలో కలిపారు’ అని రాజీనామా సమర్పించిన సందర్భంగా మెక్‌స్వీనీ లిఖితపూర్వకంగా తెలియజేశారు.

# 24న చలో సెక్రటేరియట్

టిజిఎస్ ఆర్‌టిసిజెఎసి పిలుపు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆర్‌టిసి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్‌టిసి జెఎసి ఆధ్వర్యంలో ఈనెల 24న చలో సెక్రటేరియట్ చేపట్టనున్నట్లు జెఎసి నేతలు తెలిపారు. ఆర్‌టిసిఎంప్లాయీస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో సోమవారం జెఎసి నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి.మౌలానా, కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సుమారు రెండున్నర సంవత్సరాల నుండి జెఎసి ఆధ్వర్యంలో పలు ఉద్యమాల ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, యాజమాన్యం దృష్టికి తీసుకు వెళ్ళినప్పటికీ హామీల అమలుకు నోచుకోలేదని జెఎసి నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ప్రధానంగా ఆర్‌టిసిఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు యూనియన్లపై ఆంక్షలను ఎత్తివేసి, 2021 వేతన సవరణ అమలు, ఆర్‌టిసి విస్తరణ, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి ఏ ఒక్కటీ అమలు చేయకుండా వాటిని ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఆర్‌టిసి కార్మికులపై ఈ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పెట్టి కార్మికులపై విపరీతమైన పనిభారాలు మోపిందని, రోజుకు 16 గంటలు బలవంతంగా డ్యూటీలు చేయిస్తూ కార్మికుల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కార్మికులలో రోజు రోజుకూ అసంతృప్తి, వ్యతిరేకత తీవ్రరూపం దాలుస్తున్నాయని, అందులో భాగంగా జెఎసి నాయకత్వం ఫిబ్రవరి 24న ‘చలో సెక్రటేరియట్’ కార్యక్రమానికి పిలుపునిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక వర్గం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల నుండి పెద్ద యెత్తున తరలివచ్చి ‘చలో సెక్రటేరియట్’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈ సమావేశంలో సి.ఎన్.కృష్ణ (ఎన్‌ఎంయు), జె.రాఘవులు, ఎన్.బాల్ రెడ్డి, ఎం.ఎ.మజీద్ (ఈయు), ఎన్.బుద్ధ విశాల్(బికెయు), డి.రాంచందర్ (బిడబ్ల్యూయు), పాపయ్యగౌడ్, ము త్యాలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్లిష్టదశలో కార్మికవర్గం

(మొదటి పేజీ తరువాయి)

వారిని కాంట్రాక్టు ఉద్యోగులుగా నియమించుకుంటున్నారని, మరోవైపు ప్రజల ప్రజాస్వామ్య హక్కులపై దాడులు పెరిగిపోయాయని, మైనారిటీలపై విద్వేషం పెంచి విభజించి పాలించే విషపూరిత ప్రచారం జరుగుతున్న పరిస్థితుల్లో కార్మికులు సమ్మె చేయవలసి వచ్చిందని ఐక్య వేదిక స్పష్టం చేసింది. వ్యూహాత్మకమైన ప్రభుత్వరంగ అధీన సంస్థలను అమ్మకానికి పెట్టి, రైల్వే, రేవులు, ఓడల నిర్మాణ సంస్థలు, బొగ్గుగనులు రక్షణ, రహదారులు, విమానాశ్రయాలు, బ్యాంకులు, బీమా, టెలికాం, పోస్టల్, అణు, ఇంధ, విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వంటి ప్రభుత్వ సేవలను భారీ వాణిజ్య వ్యవస్థలు, స్వదేశ విదేశీ సంస్థలకోసం ప్రైవేటీకరణ చేసే చర్యలను ప్రభుత్వం కొనసాగిస్తోందని ఐక్యవేదిక నాయకులు విమర్శించారు. ఈ చర్యలన్నీ దేశీయ పరిశ్రమల వృద్ధికి, ఆర్థిక వ్యవస్థ స్వయంసమృద్ధికి, కార్మికులకు తీవ్ర హాని కలిగిస్తాయని పేర్కొన్నారు. రైతుల సమ్మెవల్ల అనివార్యంగా మూడు వ్యవసాయ చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాల్సివచ్చిన తర్వాత వివిధ మార్గాల్లో రైతు వ్యతిరేక విధానాలను కేంద్రం కొనసాగిస్తూ తాజాగా విత్తన బిల్లును తీసుకువచ్చి రైతులపై తీవ్రమైన దాడికి పాల్పడిందని ఐక్యవేదిక విమర్శించింది. కొత్త ఆర్థిక సంవత్సరానికి ఈ నెలారంభంలో చేసిన కేటాయింపులు కూడా అర్థంపర్థం లేకుండా మారాయని విమర్శించింది. కేంద్ర ప్రభుత్వం ప్రజల న్యాయబద్ధమైన డిమాండ్లకు సానుకూలంగా ప్రతిస్పందించడానికి బదులుగా తమకు అనుకూలంగా ఉన్న పెట్టుబడిదారులకు, కార్పొరేట్ ప్రపంచానికి మేలు చేయడంకోసం వివిధ వర్గాల ప్రజలపై దాడులను ఉధృతం చేసిందని విమర్శించారు.

ఈ దేశా న్ని ఒక సంక్షేమ వ్యవస్థగా కొనసాగించేందుకు కేంద్రం ఎంతమాత్రం ఇష్టపడటంలేదని, అందుకే మహాత్మా గాంధీ ఉపాధిపథకం స్థానంలో విబి జీ రామ్ జీ చట్టాన్ని తెచ్చిందని విమర్శించారు. ఇదిలా ఉండగా, బడ్జెట్ సమావేశాల్లో ఇటీవల ఇండియా కూటమి పార్టీలకు చెందిన ఎంపిలు నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ పార్లమెంటు ఆవరణలో నిరసన కార్యాచరణ చేపట్టడం పట్ల ఐక్యవేదిక హర్షం ప్రకటించింది.

### కార్మిక సంఘాల ఐక్యవేదిక ప్రధాన డిమాండ్లు ఇవే

* నాలుగు లేబర్ కోడ్స్, నిబంధనలను రద్దు చేయాలి
* ముసాయిదా విత్తనబిల్లు, విద్యుత్ సవరణ బిల్లులను ఉపసంహరించాలి.
* లాభాల పేరుతో అత్యంత ప్రమాదకరమైన అణు ఇంధన ఉత్పత్తి వంటి విభాగాలలోకి విదేశీ సంస్థలను, దేశీయ ప్రైవేటు సంస్థలను అనుతించేందుకు ఉద్దేశించిన ‘శాంతి చట్టం’ను ఉపసంహరించుకోవాలి.
* విబి జీ రామ్ జీ చట్టాన్ని రద్దుచేసి దశాబ్దాలుగా కొనసాగుతున్న గ్రామీణ కార్మికులకు మేలు చేసే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి.
* బీమా రంగ కంపెనీలలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
* వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లు–2025ను వెనక్కు తీసుకోవాలి.
* ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలి. అంగన్‌వాడీ, ఆశా, ఎండిఎం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చాలి, ఎన్‌హెచ్‌ఎం డాక్టర్లు, నర్సులను పర్మినెంటు చేయాలి.

## కోట్లు మోసం (మొదటి పేజీ తరువాయి)

మారం సురేష్ రెడ్డి, మమతలు తమకు తెలంగాణ రాష్ట్రంలో లిక్కర్ వ్యాపార దిగ్గజాలమని మాధవరెడ్డితో పరిచయం చేసుకొని, హైదరాబాద్‌లో ఎలైట్ లిక్కర్ మార్ట్ లైసెన్స్ ఖచ్చితంగా ఇప్పిస్తామని నమ్మించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వాధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు, మంత్రులతో తమకు సన్నిహిత సంబంధాలున్నాయని చెప్పి, ఐఎఎస్ అధికారులతో మాట్లాడుతున్నట్లు నటిస్తూ ఫోన్ కాల్స్ చేసి మోసం చేసినట్లు బాధితుడు ఆరోపించాడు. వారి మాటలు నమ్మిన మాధవ రెడ్డి, 2019 సెప్టెంబర్ నుంచి 2021 మార్చి మధ్య వివిధ తేదీల్లో సురేష్ వీల్స్, హైదరాబాద్ వైన్ మార్ట్ ఖాతాలకు చెక్కుల ద్వారా మొత్తం ₹96.20 లక్షలు చెల్లించినట్లు వెల్లడించారు.ఇంతటితో ఆగకుండా, వారి భాగస్వాములు, మధ్యవర్తులకు కమిషన్ పేరుతో రూ.17 లక్షలు, ప్రభుత్వ అధికారులను మేనేజ్ చేయడానికి అంటూ రూ.3 లక్షలు నగదు, మంత్రులకు ప్రత్యేక సౌకర్యాల పేరుతో మరో రూ.15 లక్షలు నగదు వసూలు చేసినట్లు ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడు. మొత్తం మీద బాధితుడి నుంచి రూ.1.26 కోట్లకు పైగా వసూలు చేసినట్లు పేర్కొన్నారు.డబ్బులు తీసుకున్న తర్వాత నిందితులు మాట దాటవేయడం, తప్పించుకోవడం మొదలుపెట్టారని, డబ్బులు అడిగితే బెదిరింపులకు దిగారని బాధితుడు తెలిపాడు. తప్పుడు కేసులు పెడతామని, ప్రాణహాని చేస్తామని బెదిరించినట్లు ఆరోపించాడు. 2025 జూన్‌లో చివరి పరిష్కారంగా అంటూ సురేష్ రెడ్డి రూ.2 కోట్ల విలువైన పోస్ట్‌డేటెడ్ చెక్కు ఇచ్చి, 20 ఎకరాల భూమికి సంబంధించిన అసలు డాక్యుమెంట్లు భద్రతగా ఇచ్చినట్లు చెప్పాడు. అయితే ఆ చెక్కు బ్యాంక్‌లో వేయగా అకౌంట్ క్లోజ్ అయిందని తిరిగి వచ్చిందని, ఇది స్పష్టమైన మోసమని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసును ఆర్థిక నేరాల విభాగం సిఐ ఇ.జహంగీర్ యాదవ్ దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు ఎలైట్ లిక్కర్ లైసెన్స్ పేరుతో పలువురిని ఇదే తరహాలో మోసం చేసినట్లు అనుమానం ఉందని పోలీసులు తెలిపారు.

## ‘పచ్చి దోపిడీ’

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాన్ని ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం సుమోటోగా ఈ కేసు విచారణను చేపట్టింది. ‘బ్యాంకులు కేవలం లాభాపేక్షతో, వ్యాపార ధోరణిలో ఉండి, నేరగాళ్లు సులభంగా దోపిడీ సొమ్మును తరలించడానికి వేదికలుగా మారుతున్నాయి’ అని జస్టిస్ బాగ్చీ అన్నారు. 2021 ఏప్రిల్ నుంచి 2025 నవంబర్ మధ్య మన దేశంలో ఏకంగా రూ.52వేల కోట్ల సైబర్ మోసాలు జరిగినట్లు హోంశాఖ నివేదిక పేర్కొన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇది ‘అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్ కంటే ఇది చాలా ఎక్కువ మొత్తం’ అని సిజెఐ సూర్యకాంత్ అన్నారు. కాగా, ఈ డిజిటల్ మోసాలు బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్ల లేదా నేరగాళ్లతో సహకరించడం వల్ల జరిగి ఉండవచ్చని ధర్మాసనం అనుమానం వ్యక్తం చేసింది. డిజిటల్ అరెస్టుల పట్ల ఆర్‌బిఐ, బ్యాంకులు సకాలంలో స్పందించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది.

### సుప్రీం కోర్టు ఆదేశాలు

ఆర్‌బిఐ, టెలికాం శాఖ రూపొందించిన నిబంధనలను పరిగణనలోకి తీసుకుని, ఈ నేరాలను సమర్థవంతంగా అరికట్టడానికి నాలుగు వారాల్లోగా ఒక ముసాయిదా ఒప్పందాన్ని సిద్ధం చేయాలని హోం మంత్రిత్వ శాఖను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అలాగే దేశవ్యాప్తంగా నమోదైన డిజిటల్ అరెస్ట్ కేసులను గుర్తించాలని సిబిఐని ఆదేశించింది. అలాగే, ఈ కేసుల్లో విచారణ జరిపేందుకు సిబిఐకి అవసరమైన అనుమతులను వెంటనే మంజూరు చేయాలని ఢిల్లీ, గుజరాత్ ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్ట్ బాధితులకు పరిహారం అందించే విషయంలో ఉదారంగా, ఆచరణాత్మక దృక్పథంతో వ్యవహరించాలని సుప్రీం కోర్టు సూచించింది. పరిహారం చెల్లింపుపై ఒక ఫ్రేమ్‌వర్క్ సిద్ధం చేయడానికి ఆర్‌బిఐ, టెలికాం శాఖ సంయుక్తంగా సమావేశం కావాలని ఆదేశించింది.

### బ్యాంకులపై ధర్మాసనం ఆగ్రహం

సైబర్ మోసాల నివారణలో బ్యాంకులు క్రియాశీలక పాత్ర పోషించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ‘కోట్లాది రూపాయల టర్నోవర్ ఉన్న వ్యాపార సంస్థల ఖాతాల్లో భారీ లావాదేవీలు జరిగితే అనుమానం రాకపోవచ్చు. కానీ కేవలం రూ.1520 వేల పెన్షన్ తీసుకునే వ్యక్తి ఖాతా నుంచి ఒక్కసారిగా రూ.50 లక్షలు లేదా కోటి రూపాయలు విత్‌డ్రా అవుతుంటే, మీ ఎఐ టూల్స్ ఎందుకు అలర్ట్ చేయడం లేదు?‘ అని సిజెఐ సూర్యకాంత్ ప్రశ్నించారు. ఈ కేసులో అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ అడ్వకేట్ ఎన్.ఎస్.నప్పినై తన వాదనలు వినిపిస్తూ, ‘అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడానికి బ్యాంకులు కృత్రిమ మేధ (ఏఐ)ని ఉపయోగించాలి’ అని సూచించారు. కేవలం ఆర్‌బిఐ సర్క్యులర్లు జారీ చేస్తే సరిపోదని, నిబంధనలు పాటించని బ్యాంకులపై జరిమానాలు విధిస్తేనే ఫలితం ఉంటుందని ఆమె అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com